ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 45 సంచిక : 6 అభివృద్ధి మాసపత్రిక ఏప్రిల్ 2017 ₹ 22

## కార్మిక సంస్కరణలు


భారతదేశంలో కార్మిక వ్యవస్థ - కొన్ని కీలక సమస్యలు
ప్రవీణ్ ఝా

కార్మిక సంస్కరణలు : సవాళ్ళు... అవకాశాలు
శ్రీరంగ్ ఝా

భారత్‌లో అనధికార లేబర్ మార్కెట్
ఏ. శ్రీజ

కార్మిక విధానాలు - కార్మిక సంక్షేమం... అంతర్జాతీయ సామ్యం
ప్రదీప్ అగ్రవాల్

ప్రత్యేక వ్యాసం
మహిళల ఉపాధి : నిస్సహాయతలో నూతన ఆశ
నీతా ఎన్

విశిష్ట వ్యాసం
బాలకార్మిక సంస్కరణలు - విశ్లేషణ
హెలెన్ ఆర్. శేఖర్




## స్వచ్ఛభారత్ మిషన్‌లో మహిళల పాత్ర

కేంద్ర ప్రభుత్వం మార్చి ఒకటవ తేది నుండి ఒక వారం రోజులపాటు దేశ వ్యాప్తంగా స్వచ్ఛ శక్తి శపథ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కేంద్ర తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం పారిశుధ్య నిర్వహణలో మహిళల ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడమే! గ్రామాలను పూర్తి బహిరంగ మల విసర్జన నిషేధ గ్రామాలుగా సంస్కరించడంలో విశేష కృషి చేసిన మహిళా గ్రామ సర్పంచులను, స్వచ్ఛాగ్రహులను వివిధ ప్రభుత్వ పథకాలను మహిళలు మరింత గరిష్ఠంగా వినియోగించుకోవడంలో తోడ్పడే వారినీ సత్కరించడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యము. హర్యాణాలోని గురుగ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారం రోజుల ఈ కార్యక్రమంలో అట్టడుగు స్థాయిలోని మహిళాకార్యకర్తలను గుర్తించి, వారి సేవలను ప్రశంసించి, ఈ కృషిని దేశం నలుమూలలకు చేర్చేందుకు తోడ్పడమని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రజలకు పారిశుధ్యమనేది ఒక అలవాటుగా మారాలనీ, దీనివల్ల ప్రయోజనం గరిష్ఠంగా పేదలకే ఉంటుందని మోది అన్నారు. మొత్తం 118 జిల్లాలలో 1.7 లక్షల గ్రామాలు బహిరంగ మల విసర్జన నుండి విముక్తి పొందినట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

## ఆరుకోట్ల కుటుంబాలకు డిజిటల్ అక్షరాస్యత

దేశవ్యాప్తంగా ఆరు కోట్ల కుటుంబాలను డిజిటల్‌గా అక్షరాస్యులను చేయడానికి కేంద్రప్రభుత్వం 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత మిషన్' కార్యక్రమాన్ని ప్రకటించింది. మార్చి, 2019 గడువుగా రూ. 2,351.38 కోట్ల కేటాయింపుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2016-17 సంవత్సరంలో 25 లక్షలమందికీ, 2017-18 లో 275 లక్షలమందికీ, 2018-19లో 300 లక్షలమందికీ డిజిటల్ అక్షరాస్యతను కలుగచేస్తారు. కేంద్ర సమాచార సాంకేతక మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుంది.

## ప్రపంచ ఆనంద సూచిలో మరింత దిగువకు భారత్

మిగతా దేశాలతో పోలిస్తే, మన భారతీయులకు సంతోషం తక్కువగా ఉన్నది. ప్రపంచ ఆనంద నివేదిక, 2017 ప్రకారం భూటాన్ 97వ స్థానంలోను, నేపాల్ 99వ స్థానంలోను, మ్యాన్మార్ 114, శ్రీలంక 120వ స్థానాల్లో ఉంటే, మనదేశం 122వ స్థానంలో ఉన్నది. నార్వే మొదటి స్థానంలో ఉన్నది. ఆరోగ్యం, జీవన ప్రమాణాలు, సామాజిక సౌకర్యాలు వంటి అంశాల ప్రాతిపదికగా మొత్తం 155 దేశాలలో ఈ సర్వే చేశారు.

■

ఏప్రిల్ 2017 సంపుటి : 45 సంచిక : 6

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు : దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...


1. భారతదేశంలో కార్మిక వ్యవస్థ – కొన్ని కీలక సమస్యలు – ప్రవీణ్ ఝా 5
2. కార్మిక సంస్కరణలు : సవాళ్ళు... అవకాశాలు – శ్రీరంగ్ ఝా 8
3. భారత్‌లో అనధికార లేబర్ మార్కెట్ – ఏ. శ్రీజ 11
4. కార్మిక విధానాలు – కార్మిక సంక్షేమం... అంతర్జాతీయ సామ్యం – ప్రదీప్ అగ్రవాల్ 14
5. మహిళల ఉపాధి : నిస్సహాయతలో నూతన ఆశ – నీతా ఎన్. 19
6. బాలకార్మిక సంస్కరణలు – విశ్లేషణ – హెలెన్ ఆర్. శేఖర్ 25
7. యంత్ర యుగం – రింటూ నాథ్ 28
8. విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ 30
9. దర్పణం 33
10. సాంఘిక సంక్షేమానికి బాట – తెలంగాణ బడ్జెట్ 2017-18 – ఎమ్. కె. ఆదిత్య 35
11. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ – 2017-18 – రామ్‌మనోహర్ శివకోటి 38
12. అంబేద్కర్ దార్శికనికత : వర్తమాన సమాజంపై ప్రభావం – జి. దత్తాత్రేయ 40
13. తెలంగాణ బడ్జెట్ లక్ష్యం సకల జనుల సంక్షేమం – రాజనాల బాలకృష్ణ 44
14. జాతీయ సాంకేతిక శిక్షణాభివృద్ధికి ప్రత్యేకనిధి – సంతోష్ మెహరోత్రా 47
15. కార్మికుల ఉపాధి, వలసలు, వేతనాలు – విశ్లేషణ – యు. హేమంత్ కుమార్ 50
16. జాతీయ వలస విధానం వైపుగా అడుగులు – ఎస్ . చంద్రశేఖర్ 55


**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను www.Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.

యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.

ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### కష్టజీవికి హుందా అయిన జీవితం




ఏ దేశ పురోభివృద్ధినైనా శాసించగలిగే సత్తా శ్రామిక వర్గానికి ఉంది. ఏ ఆర్థిక కార్యక్రమంలోనైనా, ప్రధాన పాత్ర శ్రమజీవిదే! కనుకనే ఏదేశ విధానకర్తలకైనా, కార్మిక సంక్షేమం అత్యంత ప్రధాన అంశం. అది సౌకర్యవంతమైన పనిగంటలు కానీండి, పని పరిసరాలు కానీండి,పనిచేసే కార్మికుల సంక్షేమం కానీండి. భారతీయ లేబర్ మార్కెట్, సంఘటిత, అసంఘటిత అని రెండు విస్పష్ట వర్గాలుగా చీలిపోయింది. సంఘటిత బృందంలోని అతిచిన్న వర్గం మాత్రమే ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను అనుభవిస్తున్నది. దేశ కార్మికవర్గంలో మెజారిటీ ఇంకా అసంఘటిత రంగంలోనే ఉన్నది. వీరికి ఎటువంటి సామాజిక భద్రత లేదు. మొత్తం కార్మికలోకంలోని వ్యవసాయ, వ్యవసాయేతర, సంఘటిత, అసంఘటిత, వలసవచ్చిన, స్థానిక కార్మిక వర్గం ఏదైనా ఎవరికి తగినట్లు వారు అనేక సమస్యలలో కొట్టుమిట్టాడుతున్నారు. అసంఘటితరంగ కార్మికులు గ్రామీణ ప్రాంతం వారైనా, పట్టణ ప్రాంతం వారైనా యజమాన్య వర్గం అంటే ధనిక వర్గం మరిన్ని అధిక లాభాలు ఆర్జించి, మరింత ధనవంతులుగా మారడానికి మాత్రమే పావులవుతున్నారు. గ్రామీణ ప్రాంత అసంఘటిత కార్మికులైతే, ఖామందుల నుండి కనీస జీవనావసరాలనందుకోడానికి కూడ తల్లక్రిందులవుతున్నారు. అసలు అసంఘటిత మంటేనే వారి ఈతిబాధలన్నీ కళ్ళముందుకొస్తాయి. అతి తక్కువ వేతనాలు, దుర్భర పని పరిస్థితులు, ఇవాళ ఉంటే రేపు ఉంటుందో లేదో తెలియని పని జీవితం. ఇక వలస కార్మికుల పరిస్థితైతే చెప్పనే అక్కరలేదు. కుటుంబాలకు దూరంగా, రోడ్డు పక్కన జీవితాలతో, తట్ట, బుట్టా నెత్తిన పెట్టుకుని వలసలు పోతూ ఉంటారు. రోడ్లువేసేవారు, నిర్మాణ కార్మికులు, ఇళ్ళలో పనిచేసేవారు ఇంకా అనేకమంది రోజూ మనకు కనిపిస్తూనే ఉంటారు. మహిళా కార్మికుల పరిస్థితైతే మరిక చెప్పనే అక్కరలేదు. వారి శ్రమ ఇప్పటికీ గుర్తింపుకు నోచుకోలేదు.

2025 నాటికి ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో కార్మికులు మనదేశంలోనే ఉంటారని అంచనా! కనుక తగినట్లుగా కార్మిక సమస్యలపై దృష్టి పెట్టాలి. పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాల చట్టం, కాంట్రాక్టులేబర్ చట్టం, వంటి అనేక చట్టాలు ఉన్నప్పటికీ, బోనస్ చెల్లింపు సవరణ బిల్లు, 2015, కార్మిక పరిహారబిల్లు, 2016, బాల కార్మిక (నిర్మూలన, నియంత్రణ) సవరణబిల్లు 2016, వంటి ఎన్నో నూతన చట్టాల రూపకల్పనకు కేంద్రం చొరవ చూపింది. అనేక చట్టాలను మరింత సులభతరంచేసి, ఒక్కరూపంలోకి తీసుకురావడానికి కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ కృషిచేస్తున్నది. పని గంటలు, వృత్తిపరమైన అనారోగ్యాలవంటి అంశాలపై నిర్దిష్ట నియమావళిని కూడ రూపొందిస్తున్నది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ముద్ర, ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన వంటి అనేక పథకాలను కార్మికుల ఆర్థిక, సామాజిక మెరుగుదలకు కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్నది. మనదేశాన్ని, యావత్ ప్రపంచంలో అత్యుత్తమ పెట్టుబడుల, ఉత్పత్తుల గమ్యంగా రూపొందించడానికి సమగ్ర కార్మిక సంస్కరణలకోసం ఒక బృహత్ యత్నం మొదలైంది. ప్రపంచస్థాయిలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఈ సంస్కరణలను తేవాలని కేంద్ర ప్రభుత్వయత్నం. ■

**సామాజిక భద్రత**

# భారతదేశంలో కార్మిక వ్యవస్థ - కొన్ని కీలక సమస్యలు



**జనాభాపరమైన ప్రయోజనం మనకి పెద్ద బలమని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంతో పాటు కార్మిక రంగాన్ని చట్టాల ఉచ్చు నుంచి వెలుపలికి తీసుకురాగలిగితే భారీగా పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు పెంచగలుగుతామని కూడా వారంటున్నారు. భిన్న వేదికలపై పాల్గొన్న అనుభవాన్ని బట్టి పై వాదాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తే కార్మిక రంగానికి సంబంధించిన నియంత్రణలేవీ ఆర్థిక పురోగతికి గాని, ఉపాధికల్పనకు గాని ఏ విధంగాను అవరోధం కానేకాదు.**

యువతకు తగినన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం, ఉపాధిలో నాణ్యత రెండూ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాళ్ళు. భారత్ కూడా ఇందుకు అతీతం కాదు. ఇటీవలి సంవత్సరాల్లో ఈ సమస్య మరింతగా పెరిగింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ ఉపాధి, సామాజిక రంగ ధోరణులు 2016 పేరిట విడుదల చేసిన నివేదిక ఉద్యోగాల్లో నాణ్యత ప్రపంచం యావత్తును కుదిపి వేస్తున్న ప్రధాన సమస్యగా పేర్కొంది. ప్రపంచ సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచి ఉద్యోగభద్రతకు ముప్పు మరింతగా పెరిగింది. ప్రధానంగా సొంత బాధ్యతతో కూడిన ఉపాధి, కుటుంబానికి మద్దతు ఇచ్చే ఉపాధి, మరింత జాగ్రత్తతో కూడిన ఉపాధి క్రమక్రమంగా కుంచించుకుపోయాయి. 150 కోట్ల మంది ప్రజలు ఎల్లప్పుడూ పొంచి ఉన్న ముప్పు నీడలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం ఉపాధిలో ఇలాంటి ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య 46 శాతం ఉంది. దక్షిణాసియా, సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతాల్లో ఇలాంటి వారి సంఖ్య 70 శాతానికి పైగానే ఉంది. ఐఎల్ఓ నివేదిక ప్రకారం రెండేళ్ళ కాలంలో 2.4 మిలియన్ నిరుద్యోగులు కార్మికశక్తికి అదనంగా జోడవుతారు. భారతదేశంలో అలాంటి వారి సంఖ్య 17.6 మిలియన్లు ఉంటుంది. 2017 నాటికి దక్షిణాసియాలోని నిరుద్యోగుల సంఖ్యలో ఇది 60 శాతం ఉంటుంది. వాస్తవానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గౌరవప్రదమైన ఉద్యోగావకాశాలు కల్పించడం, అందుకు అవసరమైన విధానాలు రూపొందించడం భారతదేశానికి పెద్ద సవాలుగానే ఉంది. ఇటీవల కాలంలో ఆ సవాలు మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో సమకాలీన భారతదేశంలో కార్మిక రంగం ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సమస్యలను ఈ వ్యాసంలో వివరిస్తున్నాం.

### కార్మికశక్తి భాగస్వామ్యం, ప్రస్తుత స్థితిలో ఉపాధి రంగం సవాళ్ళు

130 కోట్ల మంది భారత జనాభాలో 70 శాతం మంది (ప్రపంచ జనాభాలో ఆరింట ఒక శాతం మంది) గ్రామాల్లోనే నివశిస్తున్నారు. 40 నుంచి 45 శాతం మంది పని చేయగల వయస్సులోని వారుగా వర్గీకరణలోకి వస్తారు. స్వాతంత్ర్యం సమకూరిన నాటి నుంచి ఈ నిష్పత్తి సుమారు ఇలాగే ఉంది. ఉపాధికల్పన

**ప్రవీణ్ ఝా,** ప్రొఫెసర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ & ప్లానింగ్, అడ్జంక్ట్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ ఇన్ఫార్మల్ సెక్టర్ & లెబర్ స్టడీస్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, జె.ఎన్.యు. న్యూ ఢిల్లీ. E-mail: praveenjha2005@gmail.com

రంగంలో కులం, మతం, లింగ, ప్రాంతీయ భేదాలు అధికంగా ఉన్నాయి. దీని వల్ల కార్మికశక్తి చలనశీలత తగ్గిపోయింది. ప్రధానంగా మహిళల పట్ల ఇది అధికంగా ఉంది. వేతనాల్లో భారీ వ్యత్యాసాలున్నాయి. ఉదాహరణకి కార్మికశక్తిలో పురుషులతో పోల్చితే మహిళలు 20 శాతం తక్కువగా ఉంటున్నారు. తాజా అంచనాల ప్రకారం ఈ వ్యత్యాసం 25 నుంచి 30 శాతానికి పెరిగింది. సామాజిక-ఆర్థిక సూచికలు, రాష్ట్రాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయి. మహిళలు - పనులు పేరిట 2016లో ఐఎల్ఓ ప్రచురించిన నివేదికలో పొందుపరిచిన గణాంకాల ప్రకారం భారతదేశంలో లింగపరమైన వేతన వ్యత్యాసం 26 శాతం ఉంది. ఆసియా ఖండంలోని దేశాలన్నింటి సగటు 23 శాతం కన్నా ఇది చాలా అధికం. మొత్తం వర్ధమాన ప్రపంచంలో లింగపరమైన వేతన వ్యత్యాసం సగటు 15 శాతం కన్నా తక్కువగా ఉంది.

భారతదేశంలో కార్మికశక్తి వ్యవసాయ రంగంపై ఆధారనీయత చాలా ఎక్కువగా ఉండడం మరో ప్రధానాంశం. మొత్తం కార్మికశక్తిలో 50 శాతం మంది వ్యవసాయరంగం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇందుకు భిన్నంగా భారత జిడిపికి వ్యవసాయ రంగం అందిస్తున్న వాటా సుమారు ఆరోవంతు మాత్రమే. వేతనాలపై ఆధారపడే కార్మికశక్తి పెరిగిపోయి 'వ్యవసాయదారులు'గా వ్యవహరించే వారి సంఖ్య కుంచించుకు పోవడమే వ్యవసాయరంగంలో ఇంత భారీగా కార్మికశక్తి కేంద్రీకృతం కావడానికి కారణం. వ్యవసాయేతర రంగానికి వస్తే అక్కడ ఉన్న ఏకైక సమస్య అవ్యవస్థీకృత ఉపాధి. వ్యవసాయేతర రంగాల్లో పని చేస్తున్న కార్మికశక్తి మొత్తం కార్మికశక్తిలో 50 శాతమే ఉన్నప్పటికీ జిడిపిలో ఆ రంగం వాటా 80 శాతం మేరకు ఉంది. ఈ కార్మికశక్తిలో 10 శాతం కన్నా తక్కువే వ్యవస్థీకృతంగా ఉన్నారు. వ్యవస్థీకృత రంగంలోని కార్మికుల్లో 65 నుంచి 70 శాతం మంది ప్రభుత్వ రంగంలో (ప్రభుత్వ పాలన, రక్షణ సర్వీసులు) పని చేస్తున్నారు. సుమారు 29.2 మిలియన్ కార్మికులు ప్రైవేటు రంగంలోనే పని చేస్తున్నారు. కార్పొరేట్ల నిర్వహణలోని తయారీ రంగం, సేవల రంగం వాటా ఇందులో ఎక్కువగా ఉంది. వారిలో 16 శాతం మంది అవ్యవస్థీకృతంగా ఉన్నారు.

భారత కార్మికశక్తిలోని ఈ లక్షణాలు పరిశీలిస్తే స్వాతంత్ర్యం లభించిన నాటి నుంచి వారు అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి స్థితిగతులు ఆవేదన కలిగించేవిగా ఉన్నాయి. అందులోనూ 1990 దశకం తర్వాత మనం ఘనంగా చెప్పుకునే ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో కార్మికశక్తి మనుగడ మరింత ప్రమాదకరంగా మారింది. ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో స్థూల ఆర్థిక విధానాల్లో మార్పులు, ప్రాథమిక రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించడం, వ్యవసాయ రంగంలో కార్మికశక్తిని తీసుకోగల సామర్థ్యం తగ్గడం వంటి కారణాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర వత్తిడిలో పడింది. శతాబ్దాలుగా తమకు జీవనాధారంగా ఉన్న రంగాన్ని వదిలిపెట్ట వలసిరావడం వల్ల కార్మికశక్తి వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగాల వైపు చూడాల్సివచ్చింది. కానీ అక్కడ కూడా వారికి నిరాదరణే ఎదురయింది. ప్రధానంగా భూమిలేని, రోజువారీ కూలీలుగా పని చేసే కార్మికశక్తికి తయారీ, సేవల రంగాల్లో గౌరవనీయమైన ఉపాధి అవకాశాలు కొరవడ్డాయి. మొత్తం జాతీయాదాయంలో తయారీ రంగం వాటా 1990 దశకం నుంచి 15-16 శాతం వద్ద స్థిరంగా ఉండిపోయింది. తయారీ రంగంలోని 85 శాతం పరిశ్రమలు ఒకరు లేదా ఇద్దరు కార్మికులతోనే పని చేయడం ఆ రంగంలో నెలకొన్న సునిశిత వాతావరణానికి దర్పణం పడుతోంది. ఫలితంగా 1990 నుంచి స్వయం ఉపాధికి ప్రాధాన్యం పెరిగింది. ఆర్థిక రంగం అధిక వృద్ధిలో పరుగులు తీస్తున్న రోజుల్లో కూడా ఉపాధి అవకాశాల పెరుగుదల నామమాత్రంగానే ఉంది. గత మూడు దశాబ్దాలుగా ఉపాధి అవకాశాల విస్తరణ తగ్గుతూ వస్తోంది. వృద్ధి అంతా సేవలరంగం మీదనే కేంద్రీకృతం కావడం చెప్పుకోదగ్గ మార్పు. ఇది స్వయం ఉపాధి పైనే ఆధారపడి నడిచే రంగం కావడం వల్ల ఉపాధి రంగం పరిస్థితి మరింత నిరాశాజనకం అయింది. ఈ పరిణామంతో అవ్యవస్థీకృత ధోరణులు ప్రబలిపోయాయి. వర్తమాన రాజకీయ ఆర్థిక విధానాలకు ఇది ప్రతిబింబం.

## పెరిగిపోయిన అనిశ్చితి, అవ్యవస్థ

ప్రపంచ ఆర్థిక, సామాజిక పరిస్థితులపై 2016లో ప్రచురించిన నివేదిక ప్రకారం సంపన్నదేశాల్లో 12 శాతం, వర్ధమాన దేశాల్లో 46 శాతం మంది ఉద్యోగులు అవ్యవస్థీకృత ఉపాధిలోనే ఉన్నారు. ఈ మొత్తం అవ్యవస్థీకృత ఉపాధిలో మూడింట రెండు వంతులు-సుమారు 72 శాతం - కార్మికశక్తి దక్షిణాసియా దేశాల్లోనే పని చేస్తున్నారు. భారతదేశంలో ఇది 90 శాతం కన్నా పైనే ఉంది. గతంలో వ్యవస్థీకృత పరిశ్రమలుగా ఉన్నవి కూడా అవ్యవస్థీకృతం కావడం మరింత ఆందోళన కలిగించే అంశం. 1999 - 2000 సంవత్సరం నాటికి వ్యవస్థీకృత రంగంలోని అవ్యవస్థీకృత కార్మికశక్తి 37.8 శాతం ఉండగా 2011-12 నాటికి అది 54.4 శాతానికి పెరిగినట్టు ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన 68వ సర్వేలో తేలింది. ఎన్ఎస్ఎస్ఓ 60వ నివేదిక ప్రకారం స్వయంఉపాధి పొందిన వారిలో గ్రామీణ ప్రాంతాల్లో 97 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 98 శాతం మంది అవ్యవస్థీకృత విభాగాల్లోనే ఉన్నారు. గ్రామీణ రోజువారీ కార్మికుల్లో 78 శాతం మంది, పట్టణ

రోజువారీ కార్మికుల్లో 81 శాతం మంది అవ్యవస్థీకృత విభాగాలపైనే ఆధారపడుతున్నారు. కార్మికశక్తిలో చోటు చేసుకున్న ఈ మార్పుల వల్ల దేశంలో 48.47 కోట్ల మంది కార్మికులుండగా వారిలో 44.72 కోట్ల మంది అవ్యవస్థీకృతంగానే ఉన్నట్టు 2011-12 ఎన్ఎస్ఎస్ఓ నివేదిక తెలుపుతోంది. వీరిలో అధిక శాతం మంది ఎలాంటి సామాజిక భద్రత లేని కార్మికులుగానే ఉన్నారు. పైగా ఆర్థిక రంగం అధిక వృద్ధిలో పరుగులు తీస్తున్న ఈ యుగంలో భారత ప్రభుత్వం కీలకమైన పలు సామాజిక విభాగాల నుంచి వైదొలగడం కార్మికశక్తిలో అభద్రతను మరింతగా పెంచింది.

ఉపాధి రంగంలో పెరిగిపోయిన అవ్యవస్థకు 1990 దశకం నుంచి వ్యవస్థీకృత ఉపాధి రంగం ఎలాంటి చలనశీలత లేకుండా స్థిరంగా నిలిచి పోవడం ఆజ్యం పోసింది. ఉదాహరణకి 1987-88లో పురుషుల్లో శాశ్వత ఉపాధి పొందిన వారు 10 శాతం ఉండగా 2009-10 నాటికి అది 8.5 శాతానికి దిగజారింది. 2011-12 నాటికి తిరిగి 10 శాతానికి చేరింది. ఇటీవలి కాలంలో ఏర్పడుతున్న కొత్త ఉద్యోగాల్లో 80 శాతానికి పైగా తాత్కాలికమైనవే కావడం, వాటిలో కూడా ఎక్కువ ఉద్యోగాలు నిర్మాణ రంగంలోనే ఉండడం తాజా పరిణామం. కార్మికశక్తి అసంఘటితం కావడం వల్ల వారి పనులు చేసే ప్రదేశాల స్వభావంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉత్పాదక రంగంలో చోటు చేసుకున్న మార్పులు, అది కుంచించుకుపోవడం వల్ల కార్మికులు పని చేసేందుకు గౌరవనీయమైన పరిస్థితులు లోపించాయి. అలాగే సేవల రంగంలోనే స్వయం ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ఆయా ఉపాధి కేంద్రాలు సాంప్రదాయిక పని ప్రదేశాల వర్గీకరణలో చేర్చే అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారిని 'కార్మికులు'గా వర్గీకరించే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ కారణంగా అధిక శాతం మంది కార్మికశక్తి కార్మిక చట్టాలకు వెలుపలే ఉండిపోయి కార్మికుల హక్కులు మృగ్యం అయిపోయాయి. ఉపాధి అవకాశాలు కుంచించుకు పోవడం వల్ల ఎలాంటి భద్రతా చట్రాల్లోకి రాని కార్మికశక్తి పెరిగిపోయింది. తాజాగా అందుబాటులోకి వచ్చిన గణాంకాల ప్రకారం 1983 నుంచి 1993-94 సంవత్సరాల మధ్య కాలంలో నిరుద్యోగిత తగ్గినా 1993-94 నుంచి 2004-05 సంవత్సరాల మధ్య కాలంలో విశేషంగా పెరిగిపోయింది. కార్మికశక్తికి ప్రతీ ఏడాది జత అవుతున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే వారందరికీ ఉపాధి కల్పించడానికి ఏడాదికి కోటి నుంచి 1.2 కోట్ల ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది. అయితే ఉపాధి కల్పన అత్యంత నిరాశాజనకంగా ఉన్నదని కార్మికబ్యూరో తాజాగా రూపొందించిన నివేదిక తెలుపుతోంది. పూర్తి స్థాయి ఉపాధి కల్పన అనేది కనుచూపు మేరలో కనిపించక పోవడంతో పాటు కొత్త ఉపాధి అవకాశాల కల్పన 90 శాతం పడిపోయింది. 2010 సంవత్సరంలో ఏర్పడిన కొత్త ఉద్యోగాలు 11 లక్షలు కాగా 2010 నాటికి 1.5 లక్షలకు పడిపోయింది.

## సామాజిక భద్రత ఆవశ్యకం

ఎంతో ఘనంగా చెప్పుకునే ఆర్థిక సంస్కరణల యుగంలో అడుగడుగునా అడ్డు తగిలే పలు చట్టాల కారణంగా భారత కార్మిక రంగం చాలా మొండిగా మారిపోయిందని, విదేశీ పెట్టుబడులు ఆకర్షించాలంటే సంస్కరణలు తప్పనిసరి అని అధికార ప్రతినిధులు తరచు ఉటంకించడం పరిపాటి. అలాగే జనాభాపరమైన ప్రయోజనం మనకి పెద్ద బలమని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంతో పాటు కార్మిక రంగాన్ని చట్టాల ఉచ్చు నుంచి వెలుపలికి తీసుకురాగలిగితే భారీగా పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు పెంచగలుగుతామని కూడా వారంటున్నారు. భిన్న వేదికలపై పాల్గొన్న అనుభవాన్ని బట్టి పై వాదాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తే కార్మిక రంగానికి సంబంధించిన నియంత్రణలేవీ ఆర్థిక పురోగతికి గాని, ఉపాధికల్పనకు గాని ఏ విధంగాను అవరోధం కానేకాదు.

ముందుగానే చర్చించినట్టుగా మొత్తం కార్మికశక్తిలో అతి తక్కువ మంది మాత్రమే వ్యవస్థీకృత రంగాల్లో పని చేస్తున్నారు. వారు మాత్రమే కొన్ని రక్షణలు పొందుతున్నారు. వివిధ రాష్ట్రాలు, కొన్ని రంగాల్లో అమలు పరుస్తున్న ఒక్క కనీస వేతనాల చట్టాన్ని మినహాయిస్తే వ్యవస్థీకృత రంగంలో కార్మిక సంబంధాల మెరుగుదల కోసం రూపొందించిన ప్రధాన చట్టాలేవీ ఆచరణలో అవ్యవస్థీకృత రంగంలో కార్యకలాపాలకు అవరోధంగా లేవు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుంటే భారత కార్మికశక్తిలో చలనశీలత లేదన్న వాదంలో ఎలాంటి నిజం లేదు. భిన్న సందర్భాల్లో పలు వేదికలపై నేను (రచయిత) వెలిబుచ్చిన అభిప్రాయాల ప్రకారం 90 శాతం కార్మికశక్తికి హక్కులు కల్పించే చట్టాలు లేకపోవడం, ఉన్న చట్టాలు కూడా ఆచరణీయం కాకపోవడమే భారత కార్మిక రంగంలో పెద్ద లోపం. ఈ నేపథ్యంలో 'జాతీయ కార్మిక మార్కెట్' ఆవిష్కరించగల సమగ్ర దార్శనికతను, క్షేత్ర స్థాయిలో కార్మికులకు హక్కులు కల్పించే చట్టాలు రూపొందించి అమలుపరచడమే విధానకర్తలు ఎదుర్కొం టున్న పెద్ద సవాలు. అలాంటి విజన్ ఏదైనా కూడా జాతీయ కనీస వేతనాలకు, కార్మిక సంస్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకే కార్మికశక్తిలో అవ్యవస్థను తొలగించాలంటే విధాన రూపకల్పనలో ఈ అంశాలన్నింటినీ అగ్రప్రాధాన్యంలో నిలపాల్సిన అవసరం

*తరువాయి 13వ పేజీలో...*

# కార్మిక సంస్కరణలు : సవాళ్ళు... అవకాశాలు



**కార్మిక సంస్కరణలు అంటే కార్మిక వనరులకు సంబంధించిన మొత్తం వ్యవస్థలో అప్పుడప్పుడు చేసే మార్పులు కాదు. అలాగే, అడపా దడపా తీసుకునే సామాజిక భద్రతా చర్చలు అంతకంటే కాదు. మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేయడం కార్మిక సంస్కరణల ప్రధాన లక్ష్యం. కార్మిక మార్కెట్ సరళీకరణ ఉపాధి సౌలభ్యానికి, నైపుణ్యాభివృద్ధికి, ఉద్యోగుల కల్పనకు పెద్ద ఎత్తున తోడ్పడాలి. భారత్‌లో కార్మిక సంస్కరణలపై జరుగుతున్న విస్తృత చర్చకు కాలం చెల్లిన చట్టాలను మార్చాలన్న అభిప్రాయమే కేంద్ర బిందువుగా ఉంది.**

కార్మిక సంస్కరణలు అంటే వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం నుంచి నిర్బంధం, శిక్షల భయం లేకుండా తమ వ్యాపారాన్ని సునాయాసంగా చేసుకోగలిగే విధంగా కార్మక చట్టాలలో తెచ్చే మార్పులుగా భావించడం సహజం. అయితే, ఇది పరిమిత భావన మాత్రమే. కార్మిక సంస్కరణలు అంటే కార్మిక వనరులకు సంబంధించిన మొత్తం వ్యవస్థలో అప్పుడప్పుడు చేసే మార్పులు కాదు. అలాగే, అడపా దడపా తీసుకునే సామాజిక భద్రతా చర్చలు అంతకంటే కాదు. మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేయడం కార్మిక సంస్కరణల ప్రధాన లక్ష్యం. భారతదేశంలో రెండు కారణాల వల్ల కార్మిక సంస్కరణలకు ఇది అత్యంత అనువైన సమయం. మొదటిది, చైనాలో గత దశాబ్ద కాలంలో కార్మిక వ్యయం మూడు రెట్లు పెరిగిపోవడంతో తయారీ కేంద్రంగా తనకుగల స్థానాన్ని చాలా వేగంగా కోల్పోతోంది. రెండవది – భారత ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా'కు చిత్తశుద్ధితో కట్టుబడి భారత్‌లో తయారీ కేంద్రాలు నెలకొల్పేలా విదేశీ పెట్టుబడిదారులను, పెద్ద వ్యాపారులను ప్రోత్సహిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' విజయం ఎంత త్వరగా, ఎంత వేగంగా కార్మిక సంస్కరణలను ముందుకు తీసుకువెళ్ళగలమనే దానిపై ఆధారపడి ఉంది. స్పష్టంగా చెప్పాలంటే, కార్మిక సంస్కరణలు శ్రామిక ఉత్పాదకత పెంపు ద్వారా పోటీదాయకతను పెంచడంతో ముడిపడి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ, భారత కార్మిక సంస్కరణల ప్రక్రియ ప్రయత్నాలు మందకొడిగానే ఉన్నాయి. ఆఖరికి ప్రపంచీకరణ, సరళీకరణ ప్రక్రియ భారత్‌లో 1991లోనే ప్రారంభం అయినప్పటికీ కార్మిక సంస్కరణల ప్రక్రియపై దాని ప్రభావం పరిమితంగానే ఉంది. కార్మిక మార్కెట్‌లో కఠిన నిబంధనలు, మొరటు కార్మిక చట్టాలు, కొట్టచ్చినట్టు కనబడుతున్నా నైపుణ్యం కొరత కారణంగా ప్రపంచంలో తయారీ కేంద్రంగా ఆవిర్భవించే అవకాశాన్ని భారత్ కోల్పోయినా ఆశ్చర్యం లేదు. గడచిన పాతిక సంవత్సరాలలో భారత ప్రభుత్వం కార్మిక సరళీకరణ దిశగా కార్మిక చట్టాలలో చెదురుమదురు మార్పులు తెచ్చేందుకు ప్రయత్నించింది. అయినా, లెదర్ వస్తువులు, టెక్స్‌టైల్స్ (దుస్తులు మొదలైనవి), వజ్రాభరణాలు, ఆట వస్తువులు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఫర్నీచర్,

**శ్రీరంగ్ ఝా,** అసోసియేట్ ప్రొఫెసర్ & కన్వీనర్ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ & గవర్నెన్స్, ఏపీజె స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్, న్యూ ఢిల్లీ. E-mail: jha.srirang@gmail.com

రబ్బర్ ఉత్పత్తులు, ఫాబ్రికేటెడ్ లోహ వస్తువులు మొదలైన వాటిని తయారుచేసే కార్మికులు పనివారు చాలా ఎక్కువగా అవసరమయ్యే రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అమితంగా ఆకర్షించ లేకపోయింది. కనుక కార్మిక సంస్కరణలను సంపూర్ణ దృష్టితో చూడవలసి ఉంది. అప్పుడే, ప్రపంచానికే తయారీ కేంద్రంగా భారత్ ప్రయోజనాలు అందుకోగలుగు తుంది. కార్మిక ప్రమాణాలపై రాజీలేని విధంగా అధిక కార్మిక ఉత్పాదకత, సరళీకృత కార్మిక మార్కెట్ విధానాలు, తక్కువ శ్రామిక వ్యయంతో ప్రపంచంలో సుస్థిర తయారీ కేంద్రంగా మనగలుగు తుంది.

కాలం చెల్లిన కార్మిక చట్టాల సంక్లిష్టత, అర్థవంతంకాని అధికార నియంత్రణ, కార్మిక సంక్షేమాన్ని ఫణంగా పెట్టి ఫ్యాక్టరీ యాజమాన్యాలు సాగించే అవినీతి విధానాలు భారత కార్మిక మార్కెట్‌ను కలుషితం చేశాయి. అందుచేత, కార్మిక మార్కెట్ సరళీకరణ ఇప్పుడు తక్షణావసరం. కార్మిక చట్టాలు అభ్యుదయకరంగా రూపుదిద్దుకోవాలి. అధికార నియంత్రణ స్థానంలో పారదర్శక నిర్వహణ, స్వీయ నియంత్రణ అనివార్యం. ఫ్యాక్టరీ తనిఖీల విధానాల స్థానంలో స్వచ్ఛత కార్మిక ప్రమాణాలను అన్వయింపు చేసుకోవాలి. కార్మిక మార్కెట్ సరళీకరణ ఉపాధి సౌలభ్యానికి, నైపుణ్యాభివృద్ధికి, ఉద్యోగుల కల్పనకు పెద్ద ఎత్తున తోడ్పడాలి. మార్కెట్ ధోరణులకు అనుగుణంగా అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి కార్మికుల విషయంలో నియమ నిబంధనలను నియంత్రించే అధికారం యాజమాన్యాలకు ఉండేలా కార్మిక చట్టాలలో సవరణలు ఉండాలనే అభిప్రాయం ఉంది. ఇటువంటి విపరీత పరిస్థితి మొదటికే మోసాన్ని తెస్తుంది. కాలం చెల్లిన కార్మిక చట్టాలను హేతుబద్ధం చేసి– కార్మికులకు సాధికారత కల్పించడం ద్వారా కార్మిక మార్కెట్‌ను సరళీకృతం చేయాలనేది మరో ఆలోచన. కానీ దీనికి తీవ్ర వ్యతిరేకత ఉంది. కార్మికులను పనిలో పెట్టుకోవడం, పరిహారం చెల్లింపు, పనుల నుంచి తొలగించడం వంటి అధికారాలు యాజమాన్యాలకే ఉండాలనేది గట్టి వాదన. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇదే ధోరణితో భారత కార్మిక వ్యవస్థ నియంత్రించబడుతోంది. అయితే, గత 25 ఏళ్ళలో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కార్మిక సంస్కరణల ఆవశ్యత పై సానకూల ధోరణి పెంచుకున్నట్టు కనబడుతోంది. ప్రపంచీకరణ, కార్మిక మార్కెట్, పెట్టుబడి మార్కెట్, వస్తు మార్కెట్‌ల సమీకృతానికి ప్రాధాన్యత పెరుగుతోంది. దీనితో తలొగ్గి ఉండాల్సిన ఒత్తిడి, ఇన్‌స్పెక్టర్‌ల భయం తగ్గుతున్నాయి. ప్రభుత్వమే కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను పక్కనపెట్టి కాంట్రాక్ట్ కార్మికులను నియమించే పెద్ద యాజమాన్యాలలో ఒకటిగా మారడం ఆసక్తికరమైన విషయం. కార్మిక చట్టాలకు ప్రభుత్వమే కట్టుబడి ఉండకపోతే, ప్రైవేటు కంపెనీలు కూడా తమ కీలక కార్యకలాపాల కోసం కాంట్రాక్టు కార్మికులను నియమించుకోవడానికి ఉత్సాహం చూపినా ఆశ్చర్యం లేదు. కోర్టులు కూడా పారిశ్రామిక వివాదాలపై తీర్పులు ఇవ్వడంలో హేతుబద్ధతను ప్రదర్శిస్తున్నాయి. 1991కి ముందు కార్మికులు, యాజమా న్యానికి వివాదాల కేసు పరిష్కారంలో న్యాయమూర్తులు కార్మికుల అనుకూల వైఖరి తీసుకోవడం ఇందుకు నిదర్శనం.

భారత ప్రభుత్వం కార్మిక చట్టాలపై సరళ వైఖరి తీసుకున్నప్పటికీ, ఉద్యోగ నియమ, నిబంధనలపై నియంత్రణను పూర్తిగా యాజమాన్యలకు అప్పగించడానికి సిద్ధంగా లేదు. ఈ విషయంలో 2001 ప్రణాళికా సంఘం అధ్యయనంలో ఒక స్పష్టత గోచరించింది. పెట్టుబడుల మార్కెట్‌ల కంటె చట్టం ద్వారా కార్మిక మార్కెట్‌లను నియంత్రించవలసిన కారణాలు బాగా తెలిసినవే. కార్మికులు వస్తువులు కాదు. వారు మనుషులు, పౌరులు. వ్యక్తిగత కార్మికులు కూడా యాజమాన్య ఉద్యోగ సంబంధాలలో బలహీన వర్గమే. ఈ కారణాలు అనేక రంగాలలో కార్మిక హక్కుల పరిరక్షణకు చట్టం అవసరాన్ని సూచిస్తున్నాయి. ఉమ్మడిగా బేరసారాల కోసం యూనియన్‌లు ఏర్పరచుకోవడం వంటి హక్కులు ప్రధానమైనవి. అలాగే సాంఘిక ప్రయోజనాలు, ఆరోగ్యం, భద్రత, మహిళా కార్మికులకు ప్రత్యేక ప్రయోజనాలు, సమస్యల పరిష్కార వ్యవస్థల ఏర్పాటు వంటి కనీస లభ్యతలను ఈ చట్టం యాజమాన్యా లకు నిర్దేశిస్తోంది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా ఇది అంగీకార విధానంగానే ఉంది. అయితే దేశాల మధ్య వీటి అమలులో కొంత వ్యత్యాసం ఉండవచ్చు. భారతదేశం కూడా కార్మికుల, యాజమాన్యాల ప్రయోజనాలు కాపాడేందుకు సమ ప్రాధాన్యం ఇస్తోంది. 2001 ప్రణాళికా సంఘం అధ్యయనం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తోంది. కార్మికుల చట్టబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించ డానికి మనకు కార్మిక చట్టాలు అవసరం అనే విషయంలో సందేహం లేదు. అయితే అటువంటి చట్టబద్ధ వ్యవస్థ ఉద్యోగుల చట్టబద్ధ హక్కుల పరిరక్షణ, వారి సామర్థ్యాన్ని పెంచి సంపూర్ణ ఉపాధి విస్తరణకు ప్రోత్సాహకాలు కల్పించే దిశగా సమతూకాన్ని కలిగివుండాలి. చట్టాలు, అవి అమలు జరిగే తీరు యాజమాన్యాలు శ్రామిక ఉత్పాదకతను ప్రోత్సహించే వ్యవస్థను ఏర్పాటుచేయగలిగేవిగా ఉండలి. ఇది కార్మిక శక్తిని మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి, మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మలచగలిగేలా

కూడా ఉండాలి. భారతదేశంలో పారిశ్రామిక, మైత్రిపూర్వక కార్మిక మార్కెట్‌కు సంస్కరణలలోని లోపాలు, కాలం చెల్లిన చట్టాలు అవరోధంగా ఉన్నాయి. కార్మిక చట్టాలు కార్మికుల ప్రయోజనాల రక్షణ కొనసాగిస్తుండగా, పోటీ నుంచి దేశీయ పరిశ్రమదారులకు రక్షణ కవచంగా ఉన్న వ్యవస్థ 1991 తరువాత కనుమరుగయిపోయింది. ప్రపంచీకరణ, సరళీకరణ భారత మార్కెట్‌లోకి అంతర్జాతీయ వ్యాపారస్తులకు తలుపులు తెరిచాయి. దీనితో వ్యాపార, వాణిజ్య వ్యవస్థల మౌలిక స్వరూపం మారిపోయింది. ఈ పరిస్థితిలో కార్మిక చట్టాలకు కార్మిక క్యాజువలీకరణ, మూడో పార్టీ ఎంప్లాయిమెంట్ వంటి ఆధునిక ధోరణులతో అనుసంధానం చేయడం అవసరం. ఇదే సమయంలో కార్మికుల మౌలిక హక్కులకు రక్షణ కల్పించడం, పరిశ్రమలతో కార్మిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం తప్పనిసరి.

దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉన్న నైపుణ్య కొరత భారత కార్మిక మార్కెట్‌పై పెను ప్రభావం చూపుతోంది. ఈ నైపుణ్యం కొరత కార్మిక మార్కెట్‌ను, ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అత్యంత అనాకర్షణీయంగా మార్చింది. దేశంలోని బడా పారిశ్రామిక వేత్తలతోపాటు, సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలు కూడా నైపుణ్య శ్రామిక వనరుల కొరతను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో 10.1% పురుష కార్మికులు, 6.3 % మహిళా కార్మికులు, పట్టణ ప్రాంతాలలో 19.6% పురుష కార్మికులు, 11.2 శాతం మహిళా కార్మికులు మాత్రమే మార్కెట్ నిర్దిష్టమైన నైపుణ్యాలను కలిగివున్నారని 2001 ప్రణాళిక సంఘం అధ్యయనం వెల్లడించింది. పైగా, భారత కార్మిక శక్తిలో 20-24 సంవత్సరాల వయసువారిలో కేవలం 5 శాతం మంది మాత్రమే వృత్తి నైపుణ్యం కలిగి వున్నారు. ఇదే పారిశ్రామిక దేశాలలో చాలా ఎక్కువగా 60% నుంచి 80% (ప్రణాళికా సంఘం, 2001) ఉన్నారు. వృత్తి నైపుణ్యాలలో మెక్సికో వంటి కొన్ని అభివృద్ధిచెందిన దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి పేలవంగా ఉంది. మెక్సికో యువతలో వృత్తి శిక్షణ పొందినవారు 28% (ప్రణాళికా సంఘం, 2001) ఉన్నారు. సమగ్ర కార్మిక విధాన లోపం దేశంలో సరళీకృత కార్మిక మార్కెట్ అభివృద్ధికి శాపంగా మారింది. దేశంలో పెద్ద సంఖ్యలో అధ్యయన బృందాలు, నివేదికలు, సలహా సంప్రదింపుల సమావేశాలకు కొదవ లేదు. అయితే, సమగ్ర జాతీయ కార్మిక విధానం మాత్రం ఎండమావిగానే మిగిలింది. ఈ దిశగా ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం కార్మిక చట్టాలకు సమయానుకూల చిన్నపాటి సంస్కరణలతో సరిపెడుతోంది. దీనికి తోడు, జాతీయ తయారీ విధానం, జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానం, జాతీయ ఉపాధి విధానం, జాతీయ హెచ్ఐవి/ఎయిడ్స్ విధానం, భద్రతకు సంబంధించిన జాతీయ విధానం, గని ప్రదేశాలలో ఆరోగ్యం, పరిసరాలు వంటి అంశాలపై కార్మిక సమస్యల నీలినీడలు కమ్ముకున్నాయి. చివరిసారిగా మూడవ పంచవర్ష ప్రణాళికా పత్రంలో 'కార్మిక విధాన' జాడలు కనుగొన్నారు. దీనికి పూర్తిగా కాలం చెల్లింది. ఇటువంటి ముందుచూపు లేని తాత్కాలిక ప్రయత్నాలు ప్రపంచీకరణకు అనుగుణంగా కార్మిక మార్కెట్‌ను సరళీకృతం చేయడంలో ఎటువంటి సానుకూల ఫలితాలను సాధించలేకపోయాయి.

భారత్‌లో కార్మిక సంస్కరణలపై జరుగుతున్న విస్తృత చర్చకు కాలం చెల్లిన చట్టాలను మార్చాలన్న అభిప్రాయమే కేంద్ర బిందువుగా ఉంది. ఈ చర్చల సారాంశాన్ని ప్రణాళిక సంఘం (2001) మాటల్లో చెప్పాలంటే-- "ఈ చట్టాలపై సమగ్ర సమీక్ష ఖచ్చితంగా అవసరం. వీటిని సులభతరం చేసి సమకాలీన ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మలచడం అవసరం. కాలక్రమంలో ఈ చట్టాలు సంక్లిష్ట స్వభావం, వ్యయ ప్రయాసలతో కూడిన న్యాయ వ్యవహారాలు, కార్మిక చట్టాలను అమలుచేసే యంత్రాంగాలతో సమస్యలు, వాటి దుర్వినియోగంపై పరిశ్రమల నుంచి ఫిర్యాదుల వెల్లువ, లంచాల కోసం యాజమాన్యాలపై వేధింపులు మొదలైనవి చిన్న పారిశ్రామికవేత్తలకు భారంగా పరిణమించాయి. మరోవైపు చట్టాల అమలు యంత్రాంగాలను పటిష్టం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి".

చట్టంపై ఎలాంటి భయం లేకుండా దేశంలోని పూర్తి కార్మిక మార్కెట్ సామర్థ్యాన్ని పరిశ్రమ అందిపుచ్చుకోవాలంటే చట్టాల్లోని నిరర్థకాలను, అస్పష్టతను, ద్వంద్వాతీతాన్ని తొలగించడం అవసరం. ఉపాధి కల్పన పద్ధతులకు సంబంధించి అనువైన వాతావరణాన్ని ఈ చట్టాలు కల్పించగలగాలి. కార్మిక చట్టాలు కఠినత్వం వల్ల వచ్చిన రాజీ ధోరణి నుంచి తక్షణం భయటపడాలి. తయారీ, సేవారంగాల్లో అంతర్జాతీయ పోటీతత్వం పెరిగేలా మన అవకాశాలను మెరుగుపరచుకోవాలి. కార్మిక - యాజమాన్య సంబంధాలు, వేతనాలు, సామాజిక భద్రత, పని ప్రదేశాల్లో భద్రత, సంక్షేమ నిబంధనలు, ఉద్యోగ కల్పనకు సంబంధించిన నియమ నిబంధనలు, కార్మిక సంఘాల గుర్తింపు, ఉమ్మడి బేరసారాల నిబంధనలు, అన్నింటికి మించి అంతర్జాతీయ కార్మిక ప్రమాణాల అమలు వంటి అంశాలన్నింటినీ చేరుస్తూ ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలన్నింటినీ ఒకే ఏకీకృత చట్టంగా తీసుకురావడంపై ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టాలి. ఇటువంటి

*తరువాయి 18వ పేజీలో...*

# భారత్‌లో అనధికార లేబర్ మార్కెట్



ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద 20 కి పైగా కేంద్ర మంత్రిత్వశాఖలు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వ్యాపారాలను ప్రారంభించడాన్ని మరింత సులభతరంచేస్తూ, అనేక చర్యలను తీసుకున్నారు. భారత్‌లో తయారీ, డిజిటల్ ఇండియా, స్వచ్ఛభారత్ అభియాన్ వంటి ప్రధాన కార్యక్రమాల ద్వారా కూడ అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. వీటికి అదనంగా స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర వంటి పథకాలతో అనేక సృజనాత్మక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు.

భారతీయ లేబర్ మార్కెట్ స్వభావరీత్యా బహుముఖమైనది. ఇక్కడి 92శాతం కార్మికులు అనధికార ఉపాధిలో ఉన్నారు. కేవలం 8 శాతం మాత్రమే అధికార ఉపాధిలో ఉన్నారు. దీనికి వలసపాలన కాలం నుండి ఉన్న అనేక సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణం. బ్రిటీషు వారి పాలనలో మన పారిశ్రామికాభివృద్ధి ఎలా జరిగిందంటే, మన దగ్గర ఉత్పత్తి అయిన ముడి సరుకును ఎగుమతిచేసి, తయారైన ఉత్పత్తులను దిగుమతి చేసేవారు. బ్రిటన్‌లో సంభవించిన పారిశ్రామిక విప్లవం మనదేశంలో ఏ ప్రభావమూ చూపలేదు. కేవలం మొదటి ప్రపంచయుద్ధ కాలంలో మాత్రమే ఫ్యాక్టరీల ద్వారా ఉత్పత్తి మన దేశంలో ప్రారంభమైంది, అదికూడ యుద్ధావసరాలకోసం మాత్రమే! అందుకనే స్వాతంత్ర్య సమయానికి మనకు అధిక సంఖ్యలో రైతులు తప్ప, మరే ఇతర ఉత్పత్తి వర్గమూ లేకుండా పోయింది. కార్మిక వర్గం అల్పసంఖ్యాకవర్గంగా కులమతాల చిచ్చులతో, కునారిల్లుతూఉండేది. ఔత్సాహిక తత్వం కొన్ని వర్గాలకే పరిమితం అయింది. కనుకనే, ఇనుము-ఉక్కు, గనులు, జౌళి, న్యూస్ ప్రింట్ వంటి కార్మికులు తక్కువగా అవసరమయ్యే పరిశ్రమలే అభివృద్ధి చెందాయి. స్వాతంత్ర్యానంతరం మహలనోబిస్ సూత్రం ప్రకారం మూలధనం అధికంగా అవసరమయ్యే పరిశ్రమలకే ప్రాధాన్యమిచ్చి, అధిక కార్మికులు అవసరమయ్యే పరిశ్రమలకోసం గ్రామీణ వ్యవసాయేతర సహకార సంస్థలను ప్రోత్సహించారు. కొన్నిరకాల ఉత్పత్తులను కుటీర, చిన్నతరహా పరిశ్రమలకే పరిమితం చేశారు. ఫలితంగా, వ్యవసాయము, చేతి వృత్తులు, చేనేత, చిన్నతరహా గ్రామీణ పరిశ్రమలు ఎటువంటి ప్రగతి లేకుండా, అలాగే ఉండిపోయాయి.

మొత్తం ఉపాధి రంగంలో అసంఘటిత రంగ వాటా 1977-78 నాటికి 92.2 శాతంగా ఉండగా, 1993-94 నాటికి అది 92.7 శాతానికి పెరిగింది. అంటే, ప్రపంచీకరణ ప్రభావం మొదలుకాకముందే, మనదేశంలో కార్మిక వర్గం భారీ సంఖ్యలో ఉన్నది. అసంఘటితరంగం లోని సంస్థల జాతీయ కమీషన్ (NATIONAL COMMISSION FOR ENTERPRISES IN THE UNORGANIZED SECTOR-NCEUS) వారి ప్రకారం, "వ్యక్తుల, లేదా కుటుంబాల యజమాన్యంలో గానీ, భాగస్వామ్యంలోగానీ

**ఏ. శ్రీజ,** డైరెక్టర్, నైపుణ్యాభివృద్ధి & ఉపాధి కల్పనా విభాగం, నీతి ఆయోగ్, న్యూ ఢిల్లీ.
E-mail: srija.a@nic.in

ఉన్న నవోదు కాని, ఉత్పత్తి, అమ్మకాలలోనిమగ్నమైన పది కన్నా తక్కువమందితో పనిచేసే అన్ని సంస్థలు" అసంఘటిత సంస్థలే! అనధికార కార్మికవర్గం సంఘటిత, అసంఘటిత రంగాలలో రెంటిలోనూ వ్యాపించి ఉండటంవల్ల,NCEUS వారిని అసంఘటిత కార్మికులుగా నిర్వచించింది. ఈ నిర్వచనం కిందకు వచ్చే కార్మికులకు ఎటువంటి సామాజిక భద్రత ఉండదు.

మధ్యతరహా పరిశ్రమలకు కొన్ని సరుకుల ఉత్పత్తిని నిర్దేశించడం వల్లను ఎక్కువ ఉపాధి అవకాశాలు అందుబాటులో లేవు. పైగా 1991 కి ముందు అధికభాగం పరిశ్రమలు రాయితీల మీదను, ప్రభుత్వం ఇచ్చే మినహాయింపుల పైనను అధికంగా ఆధారపడినవి. అయితే, 1991 తరువాత, పెట్టుబడుల ఉపసంహరణ, బయటి నుండి పెరిగిన పోటీల వల్ల కేవలం సంఘటి తరంగంలోనే కొద్దిగా ఉపాధి అవకాశాలలో

పట్టిక-1 : సంఘటిత, అసంఘటిత రంగాలలోని అధికార, అనధికార కార్మికుల వివరాలు.

| | సంఘటిత | అసంఘటిత | మొత్తం |
|---|---|---|---|
| **1999-2000** | | | |
| అధికార | 33.7 (62.3%) | 1.4 (0.41%) | 35 |
| అనధికార | 20.5 (37.9%) | 341.3 (99.6%) | 361.7 |
| మొత్తం | 54.1 (13.6%) | 342.6 (86.3%) | 396.8 |
| **2004-2005** | | | |
| అధికార | 32.06 (52%) | 1.35 (0.3%) | 33.41 |
| అనధికార | 29.54 (48%) | 396.66 (99.7%) | 426.2 |
| మొత్తం | 61.61 (13%) | 398.01 (87%) | 459.61 |
| **2011-2012** | | | |
| అధికార | 37.18 (45.4%) | 1.39 (0.4%) | 38.56 |
| అనధికార | 44.74 (54.6%) | 390.92 (99.6%) | 435.66 |
| మొత్తం | 81.92 (17.3%) | 392.31 (82.7%) | 474.23 |

మూలం: జాతీయ ప్రతిచయన సంస్థ.

ఈ అనధికార ఉపాధి సంఘటిత, అసంఘటిత రంగాలు రెంటిలో కలిపి, 1999-2000 నాటి 91.2 శాతం నుండి, 2004-05 నాటికి 92.7 శాతానికి పెరిగింది. 2011-12 లో మాత్రం కొద్దిగా తగ్గి, 91.9 శాతంగా రికార్డు అయింది.

అసంఘటితరంగంలో ఇంతభారీగా ఉపాధి ఉండటానికి కారణం, వారిలో 50 శాతం పైగా స్వయం ఉపాధి పొందినవారు కావడమే! ముఖ్యంగా వ్యవసాయరంగంలో ఉండటమే. తయారీరంగంలోనైతే, భారీ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమివ్వడం వలన, వేతన నిబంధనలు, చిన్న,

పెరుగుదల కనిపించింది. ఈ ఉపాధి రేటు 1999-2000 నాటి 48శాతం నుండి, 2004-05 నాటికి 54.6 శాతానికి పెరిగింది. గత నాలుగు దశాబ్దాలలో మనదేశం హిందూ వృద్ధిరేటును అధిగమించి, వేగాన్నందుకుంది. లేబర్ మార్కెట్‌లో సంస్థాగత మార్పులు కారణంగా, వ్యవసాయ రంగంలో ఉపాధి తగ్గి, నిర్మాణరంగం, తక్కువ నైపుణ్యం అవసరమైన సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయి. సరళీకరణ అనంతరం, ప్రపంచస్థాయి పోటి పెరిగి, రాయితీలు తగ్గడంవల్ల పెట్టుబడులలో రిస్క్ పెరిగి, వ్యవస్థాపకులు తమ

సంస్థలను చిన్న స్థాయిలకే పరిమితం చేయసాగారు. దీనితో వారికి నియమ నిబంధనల ఒత్తిడి, పన్నుల భారం, అనేక కార్మి చట్టాల, సామాజిక భద్రత పథకాల భారం పెరగలేదు. సంస్థలను విస్తరించడంపై వ్యవస్థాపకుల ఈ నైరాశ్యాం కారణంగా, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో బహుళజాతి సంస్థల, పనివారిని కొద్దికాలంపాటు అద్దెకు తీసుకునే విధానం పెరిగింది. దీనితో మొత్తంమీద శాశ్వత ఉపాధి కాస్తా తాత్కాలిక ఉపాధిగా మారసాగింది. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రేరణతో 'హైర్ అండ్ ఫైర్' విధానం అమలులోకి వచ్చింది. సాంకేతికతలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు తయారైన వస్తువుల జీవిత కాలాన్ని తగ్గించి వేస్తున్నాయి. మూలధన సామగ్రి దిగుమతులపై సుంకాలు తగ్గాయి. దీనితో చిన్న పారిశ్రామికులకు పోటీ/ఒత్తిడి పెరిగి, దానిప్రభావంతో శాశ్వత ఉపాధి స్థానంలో కాంట్రాక్టు ఉపాధి పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థలలో కూడ వ్యయాన్ని తగ్గించుకునేందుకు పలు విధానాలకు స్వస్తి పలకడంతో, ఈ ధోరణి మరింత పెరిగింది. ఆర్థిక గణన ప్రకారం, ఆరుకన్నా తక్కువమంది కార్మికులతో పనిచేయించుకుంటున్న సంస్థలు 1990లోని 95.5 శాతం నుండి, 2013 నాటికి 93 శాతానికి తగ్గాయి.

ఇలా తాత్కాలిక ఉపాధి ధోరణి పెరగడంతో కార్మికులు ఉపాధిని కోల్పోవడం, సామాజిక భద్రతను కోల్పోవడం, తనకు, కుటుంబానికీ వైద్య సదుపాయాలు కోల్పోవడం వంటి అనిశ్చిత పరిస్థితులు తలఎత్తసాగాయి. ఈ అనిశ్చితత్వాన్ని అరికట్టడానికి అనేక కమిటీలు, రిపోర్టులు అనేక సిఫార్సులను చేశాయి. కార్మికులకు సాధారణంగా నిరక్షరాస్యులవడం వల్లను, వారికి వృత్తిపరమైన నైపుణ్యం తక్కువగా

పట్టిక 2 : కార్మికుల సంఖ్యతో సైజులవారీగా పరిశ్రమల శాతం.

| క్రమ సంఖ్య | సంస్థ పరిమాణం | అంశం | ఆర్థిక గణన సంవత్సరాలు | | | |
|---|---|---|---|---|---|---|
| | | | 1990 | 1998 | 2005 | 2013 |
| 1. | 1-5 మంది | సంస్థ | 93.4 | 94.0 | 95.4 | 95.5 |
| | | ఉపాధి | 54.5 | 58.6 | 67.3 | 69.5 |
| 2. | 6-9 మంది | సంస్థ | 3.5 | 3.3 | 3.4 | 3.1 |
| | | ఉపాధి | 8.4 | 8.3 | 10.3 | 9.3 |
| 3. | 10, ఆ పైన | సంస్థ | 3.1 | 2.8 | 1.3 | 1.4 |
| | | ఉపాధి | 37.1 | 33.1 | 22.4 | 21.2 |

మూలం: 5వ, 6వ జాతీయ ఆర్థిక గణాంకాలు.

ఉండటం వల్లను వారికి వ్యవసాయ జీవనం నుండి, తయారీ/ ఉత్పత్తి/ సేవల రంగాలకి మళ్ళడం కష్టమైంది.


విధానపరమైన చర్యలు: తక్కువ నైపుణ్యం అవసరమైన ప్రధానరంగమైన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు, పనిగంటలు ఇతర పని పరిస్థితుల నియంత్రణకు నిర్మాణ కార్మికుల (ఉపాధి పని పరిస్థితుల నియంత్రణ) చట్టం, 1996, నిర్మాణకార్మికుల సెస్ చట్టం 1996 లను అమలుచేశారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి అసంఘటితకార్మికుల సామాజిక భద్రత చట్టం, 2008 ని అమలుచేశారు. అంతేకాక, అసంఘటిత రంగ కార్మికుల వైద్య ఖర్చులకు గాను, 2008 లో రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనను అమలుచేశారు. నిర్మాణ కార్మికులు, రైల్వే పోర్టర్లు, వీధులలో అమ్ముకునేవారు, ఆటో, రిక్షాలను నడిపేవారు, చిత్తుకాగితాలను ఏరుకునే వారు, ఉపాధిహామీ కార్మికులు, వంటి విభిన్న వృత్తులలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులకందరికీ ఈ బీమా యోజన వర్తిస్తుంది. మార్చి 31, 2016 నాటికి 41.3 కోట్లమంది ఈ బీమా పథకంలో చేరారు. ఇప్పటికే అమలులో ఉన్న అనేక సంక్షేమ పథకాలకు ప్రతిబంధకంగా ఉన్న "కనీసం 20 మంది సిబ్బంది ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుంది" వంటి నిబంధనలను క్రమంగా అన్ని చట్టాలనుండి తొలగించే కార్యక్రమం మొదలైంది. మొదటే అసంఘటిత కార్మికులు బలహీనమైన బేరసారాల శక్తితో ఉంటారు. పైగా వృత్తి నైపుణ్యం కూడ అంతంత మాత్రమే. ఇలాంటి వారి కోసమే అటల్ పెన్షన్ పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలను అమలుచేశారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన పథకం కింద జౌళి కార్మికులకు భవిష్యనిధికి యజమాని వాటాగా ఇవ్వవలసిన 12శాతం మొత్తాన్ని చిన్న తరహా సంస్థలకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. అదేవిధంగా, జాతీయ అప్రంటీస్ పథకం కింద రూ. 1500/- ల గరిష్ట పరిమితితో 25 శాతం సంస్థ తరపున ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద 20 కి పైగా కేంద్ర మంత్రిత్వశాఖలు ప్రత్యేక నైపుణ్యాభి వృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వ్యాపారాలను ప్రారంభించడాన్ని మరింత సులభతరంచేస్తూ, అనేక చర్యలను తీసుకున్నారు. భారత్‌లో తయారీ, డిజిటల్ ఇండియా, స్వచ్ఛభారత్ అభియాన్ వంటి ప్రధాన కార్యక్రమాలద్వారా కూడ అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. వీటికి అదనంగా స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర వంటి పథకాలతో అనేక సృజనాత్మక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. మొత్తంమీద చట్టరూపకం గానూ, పథకాల ద్వారానూ మరెంతోమంది అసంఘటితరంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్నది. ■

*7వ పేజీ తరువాయి...*

## భారతదేశంలో కార్మిక వ్యవస్థ - కొన్ని కీలక సమస్యలు

ఉంది. అలాగే ప్రస్తుతం దేశం బలం పుంజుకుంటున్న, వృద్ధి గమనంలో పురోగమిస్తున్న రోజుల్లో సామాజిక భద్రతాపరమైన అంశాలపై కూడా చర్చించడం అవసరం. వర్తమాన భారతంలో త్వరితగతిన పురోగమనం చోటు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో కార్మికశక్తి ఆవేదనలను పట్టించుకోకపోతే 'తక్కువ ధరలకే అందుబాటులో ఉన్న కార్మికశక్తి' వల్ల సమకూరే ప్రయోజనాలు పూర్తిగా అందుకోవడం అసాధ్యం అవుతుంది. కాని ప్రస్తుతం సైద్ధాంతికం గాను, అంతర్జాతీయ అనుభవాల పరంగాను ఈ విధమైన ధోరణి అనుసరించడంలో హేతుబద్ధత ప్రశ్నార్థకంగానే ఉంది. అవ్యవస్థీకృత కార్మికశక్తి గౌరవనీయంగా పని చేసుకుని తమ సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలంటే వారికి సార్వత్రిక సామాజిక భద్రత కల్పించడం అవశ్యం. ఇది సాధించాలంటే పౌష్టికాహారం, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక వసతులు సమాంతరంగా విస్తరించడం, మెరుగు పరచడంపై దృష్టి పెట్టాలి. ఇది కార్మికుల సామాజిక, భౌతిక స్థితిగతులను మెరుగుపరిచి అధిక శాతం కార్మికశక్తిని అభద్రత నుంచి వెలుపలికి తీసుకురా గలుగుతుంది. ■

# కార్మిక విధానాలు - కార్మిక సంక్షేమం... అంతర్జాతీయ సామ్యం



యాజమాన్యాలు, కార్మికుల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి సరైన యంత్రాంగాల ఏర్పాటుతో పారిశ్రామిక సంబంధాలు సజావుగా సాగేలా చూడాలి. కార్మికులకు సముచిత ఉద్యోగ భద్రత వాస్తవాన్ని గుర్తిస్తూనే వారిని వినియోగించు కోవడంలో యాజమాన్యాలకు వెసులుబాటు కల్పించాలి. కార్మికులను మరింత ఉత్పాదకంగా మలచేందుకు వీలుగా వారికి అవగాహన, శిక్షణ మెరుగు దిశగా మరింత కృషి అవసరం. పిల్లలందరికీ 10వ తరగతి ఉత్తీర్ణతను కనీస విద్యార్హతగా నిర్ణయించడంతోపాటు వృత్తివిద్యా శిక్షణకు మరింత ప్రాధాన్యమివ్వాలి.

దేశానికి వరంలాంటి కార్మికశక్తిని సమర్థంగా ఉపయోగించుకోవడం వేగవంతమైన ఆర్థికవృద్ధికి కీలకం. అలాగే ఉత్పాదకతలో విశిష్ట స్థానంగల కార్మికశక్తి మానవ సమన్వితమే తప్ప వస్తుగతమైనది కాదు. కాబట్టి కార్మిక విధానాలకు గణనీయ సామాజిక లేదా సంక్షేమ కోణం ఉండటమూ అవసరం. అందువల్లనే కార్మిక విపణి విధానాలపై భిన్నాభిప్రాయాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. ఇందులో భాగంగా సంఘాల ఏర్పాటుకు స్వేచ్ఛ, కనీస వేతన చట్టాలు, ఎంతోకొంత ఉద్యోగ భద్రత, నిరుద్యోగ భృతి, తొలగింపునకు గురైతే రాయితీతో పున:శిక్షణ సదుపాయాలు వంటివి ఉండాలని సామాజిక లేదా సంక్షేమాంశాన్ని నొక్కిచెప్పేవారంతా తరచూ చెబుతుంటారు (ఉదా॥ Standing and Tokman, 1991; ILO, 1990, Bhaduri, 1996 చూడండి). అయితే, ఉద్యోగ భద్రత నిబంధనలవంటి ప్రభుత్వ చర్యలవల్ల ఉపాధి అవకాశాలు, ఉత్పాదకత, వృద్ధి తగ్గి, దీర్ఘకాలంలో కార్మికులనే దెబ్బతీస్తాయన్నది కార్మిక విపణిలో 'సామర్థ్యం' అంశానికి అధిక ప్రాముఖ్యం ఇచ్చేవారి వాదన(ఉదా॥ Krueger, 1974; Olson, 1982; Lazear, 1990; Fallon and Lucas, 1991 and 1993; Mehta, 1995 చూడండి). వీరు తరచూ సూచించే విధానాలు ఇలా ఉంటాయి:

(i) పనికి తగిన జీతాలు, బోనస్, పదోన్నతితోపాటు సామర్థ్యానికి తగిన ప్రోత్సాహకాలిచ్చే విధానాలుండాలి. అలాగే తగిన విద్య, శిక్షణద్వారా కార్మికశక్తిని వీలైనంత ఉత్పాదకంగా రూపొందించాలి.

(ii) యాజమాన్యాలు, కార్మికుల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి సరైన యంత్రాంగాల ఏర్పాటుతో పారిశ్రామిక సంబంధాలు సజావుగా సాగేలా చూడాలి. దీనివల్ల సమ్మెలవంటి ఆందోళనలవల్ల వృథా అయ్యే పనిదినాల సంఖ్యను వీలైనంత కనిష్ఠ స్థాయికి తగ్గించవచ్చు.

(iii) ఆర్థిక వ్యవస్థకు ఎదురయ్యే కుదుపులను నేర్పుగా ఎదుర్కొనగలిగేందుకు, రంగాలవారీ అనుకూలతలో మార్పులకు తగినట్లు కార్మికశక్తి వినియోగంలో సరళతకు వీలు కల్పించాలి. ఆ మేరకు సులభ ఉద్వాసన, కార్మికుల పున:శిక్షణ వంటివాటిని అనుమతించాలి.

ప్రదీప్ అగ్రవాల్, ఆర్ బి ఐ ఛెయిర్ ప్రొఫెసర్ అఫ్ ఎకనామిక్స్, - హెడ్, ఆర్ బి ఐ ఎండోమెంట్ యూనిట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, న్యూ ఢిల్లీ. E-mail: pradeep@iegindia.org

(iv) కార్మిక విపణిలో విచ్ఛిన్నాన్ని, జోక్యాన్ని కనీస స్థాయిలో ఉంచాలి.

ఈ రెండు వాదనలూ వాస్తవానికి పరస్పర విరుద్ధమైనవే అయినా, రెండూ ముఖ్యమైనవి కావడంతోపాటు వాటిలో ఏదో ఒకటి ఎంచుకోవడంగాక రెండింటి మధ్యా సమతూకం సాధించడమే ప్రధానం. ఆ మేరకు ప్రపంచ దేశాల్లో అధికశాతం ఈ రెండు వైరుధ్యాల నడుమ సమదూరం పాటించే కార్మిక విధానాలను అనుసరిస్తు న్నాయి. ఒక దేశంలో నిరుద్యోగం, అభివృద్ధి స్థాయిలమీద కూడా ఈ విధానాల ఎంపిక కొంతవరకు ఆధారపడి ఉంటుంది. ఒక దేశం అభివృద్ధి చెందినదై, సంపూర్ణ ఉపాధి కల్పనకు దగ్గరలో ఉండి, కొద్దిమంది నిరుద్యోగులకు మాత్రమే మద్దతిస్తే సరిపోయే స్థితిలో ఉంటే సంక్షేమ విధానాలవైపు ఎక్కువగా మొగ్గుచూపగలదు. కానీ, పారిశ్రామికాభివృద్ధి తరుణదశలో ఉండి, ప్రత్యేకించి అధికశాతం ప్రజలు పూర్తి ఉపాధి లేదా లాభదాయక ఉపాధిలేనివారైన పక్షంలో సామర్థ్య సంబంధిత అంశాలపై ఎక్కువగా దృష్టి సారించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎగుమతులతోపాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చే స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థలున్న దేశాలైతే ప్రపంచ ఎగుమతి విపణులలో పోటీపడగలిగేలా తమ కార్మికశక్తి సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల అవి కూడా సమర్థత అంశానికే అధిక ప్రాముఖ్యం ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద తయారీవస్తు ఎగుమతిదారుగా ఉన్న చైనాను పాలిస్తున్నది కార్మిక ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ. అయినప్పటికీ కార్మికశక్తి సామర్థ్యం, పూర్తి ఉత్పాదకత లక్ష్యసాధనపరంగా వాస్తవిక కార్మిక విధానాలను ఆ దేశం అనుసరిస్తుం డటం గమనార్హం. కార్మిక క్రమశిక్షణ, ఉద్యోగ నిబంధనల ఉల్లంఘన, విధుల్లో నిర్లక్ష్యం లేదా లంచగొండితనం వంటి తీవ్ర అతిక్రమణలకు పాల్పడితే శాశ్వత ఉద్యోగులనైనా తొలగించేందుకు అక్కడి చట్టాలు అనుమతిస్తాయి. నిర్ణీత తేదీతో ముగిసిపోయే ఒప్పందంతో ఉద్యోగాలిచ్చే పద్ధతి ఉండటమేగాక ఆ తేదీ తర్వాత కొనసాగించకపోతే తెగతెంపుల వేతనం చెల్లించాల్సిన అవసరం లేదు. ఏదైనా సంస్థ ఉత్పాదకత లేదా నిర్వహణపరంగా (కీలక పునర్నిర్మాణం, వ్యాపారం లేకపోవడం లేదా ఎగుమతి విపణిలో ఒడుదొడుకులవల్ల ఉత్పత్తి తగ్గింపు) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పక్షంలో గణనీయ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకూ అనుమతి ఉంది. అయితే, అలాంటిది ఏదైనా అవసరమైతే కనీసం ఒక నెలముందుగా నోటీసు ఇవ్వడంతోపాటు ఏడాది సర్వీసుకు నెల జీతం వంతున తెగతెంపుల వేతనం చెల్లించాల్సి ఉంటుంది. అలాగే క్రమశిక్షణ రాహిత్యం లేదా తీవ్ర తప్పిదానికి పాల్పడి తొలగింపునకు గురైన వారుమినహా వ్యక్తిగతంగా తొలగించే ఉద్యోగులకూ ఇలాగే చెల్లించాలి. ఇక ఎగుమతి ప్రక్రియ మండళ్లలో కార్మిక చట్టాలు మరింత సరళంగా ఉండి... యాజమాన్యాల ఇష్టానుసారం నియామక, ఉద్వాసనలకు పూర్తి హక్కులిస్తాయి. ఎగుమతులలో అధిక అనిశ్చితి, వైవిధ్యం కోసం ఉత్పత్తిలో సౌలభ్యం దృష్ట్యానేగాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణ కోసమే ఇలాంటి విధానాలు అక్కడ అమలవుతున్నాయి. మొత్తంమీద క్రమశిక్షణగల, సమర్థ కార్మికశక్తిని రూపొందించడంలో ఈ చట్టాలు సహాయపడుతున్నాయి.

తూర్పు, ఆగ్నేయాసియాలోని ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలేషియా, తైవాన్, దక్షిణకొరియా వంటి అనేక ఇతర దేశాల్లోనూ సూక్ష్మస్థాయిలో కొన్ని వ్యత్యాసాలున్నా దాదాపు ఇలాంటి కార్మిక చట్టాలే అమలులో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలు బలపడేకొద్దీ ఆయా దేశాలు తమ కార్మిక చట్టాలను మరింత బలోపేతం చేశాయి. ఉద్యోగిని ముందుగానే తొలగించే పక్షంలో అతడు చివరి పనిదినంనాటి వేతనంతో సమానంగా వారి సర్వీసులో ఏడాదికి ఒక నెల జీతం వంతున తెగతెంపుల వేతనం చెల్లించేలా ఆ దేశాలు ఇప్పుడు చట్టం చేశాయి. అయితే, వారి సర్వీసు (ఉదా॥ 20 ఏళ్లు) కాలంతో నిమిత్తం లేకుండా ఇది గరిష్ఠంగా 8 నుంచి 12 నెలల జీతానికి సమానంగా మాత్రమే ఉండాలి. సింగపూర్ చట్టం ప్రకారం మూడేళ్లకన్నా తక్కువ కాలానికి కాంట్రాక్టు పద్ధతిలో నియమితులయ్యేవారికి లేదా మేనేజర్ల స్థాయిలో పనిచేసేవారికి తెగతెంపుల వేతనం చెల్లించనక్కర్లేదు. అనేక తూర్పు ఆసియా దేశాలలో నెలలకొద్దీ వేతనంతో సమానమైన భారీ మొత్తాన్ని ప్రోత్సాహకం (బోనస్) కింద చెల్లించే సంప్రదాయం కూడా ఉంది. అయితే, ఇది స్థిరంగా కాక సదరు సంస్థ లాభదాయకతతోనూ, తరచూ కార్మికుల వ్యక్తిగత ప్రతిభ మూల్యాంకనంతోనూ ముడిపడి ఉంటుంది. ఇది కార్మికుల మధ్య సహకార ధోరణిని పెంపొందించడమేగాక సంస్థ సమర్థంగా, సాఫీగా నడిచేందుకు దోహదపడుతుంది.

అనేక ఐరోపా దేశాల్లో కూడా ఇలాంటి చట్టాలే ఉన్నాయి (ఐరోపాలో తొలుత రూపొందిన కార్మిక రక్షణ చట్టం నుంచే కాలక్రమంలో తూర్పు ఆసియా దేశాలు ఆయా చట్టాలను అనువర్తింపజేసు కున్నాయి). అయితే, ఐరోపా దేశాలు మరింత అభివృద్ధి చెందినవి గనుక నిరుద్యోగ సమస్య చాలా తక్కువ కావడంతో కార్మిక చట్టాలు కొంతమేర ఉద్యోగులకే ఎక్కువ అనుకూలంగా ఉంటాయి.

అయినప్పటికీ కార్మికులలో క్రమశిక్షణ రాహిత్యం, అసమర్థత లేదా నిర్వహణ పరంగా ఎదురైన కష్టనష్టాలవల్ల ఉత్పత్తి తగ్గించాల్సి రావడం వంటి తీవ్ర పరిస్థితులలో ఉద్యోగుల తొలగింపునకు కూడా ఆ చట్టాల్లో అధికశాతం అనుమతిస్తాయి. భారతదేశం అనుసరిస్తున్న చట్టాలు 19వ శతాబ్దంలో బ్రిటన్ (UK)లో రూపొందినవే కాగా, ఆ దేశంలో అమలు చేస్తున్న అసంబద్ధ తొలగింపు చట్టం ప్రకారం యాజమాన్యాలు చట్టబద్ధంగా ఉద్యోగులను ఏ పరిస్థితులలో తొలగించవచ్చునంటే: (i) తొలగింపునకు 'సముచిత' కారణాలున్నప్పుడు; (ii) ఆ మేరకు పారదర్శక, సహేతుక ప్రక్రియ అమలవుతుంది. ఈ చట్టం కింద ఐదు (5) కారణాలను ఉద్యోగుల తొలగింపునకు సముచితమైనవిగా పరిగణిస్తారు. (i) అవసరంకన్నా అధికం (నిర్దేశిత బాధ్యతలు లేదా నిర్దేశిత పని ప్రదేశంలో ఉద్యోగులు అవసరానికి మించి ఉన్నపుడు యాజమాన్యం తొలగించినప్పుడు); (ii) దుష్ప్రవర్తన; (iii) అసమర్థత (పనితీరు సమస్యలు లేదా విధులు నిర్వర్తించలేని అశక్తత); (iv) చట్టబద్ధ బాధ్యతకు భంగం కలిగించేలా ఉద్యోగం కొనసాగింపు (ఉదా॥ అర్హత కోల్పోయిన డ్రైవర్‌ను విధులకు అనుమతించడం); (v) ఇవన్నీ కలగలసే బలమైన కారణం మరేదైనా ఉన్నపుడు.

బ్రిటన్‌తోపాటు కొన్ని ఐరోపా దేశాల్లో నిర్దిష్ట కాంట్రాక్టు కాలం ముగియడాన్ని కూడా తొలగింపుగానే పరిగణిస్తారు. కానీ, ఒక్క బ్రిటన్‌లో మాత్రమే సదరు ఉద్యోగి సర్వీసులో ఏడాదికి ఒక వారపు జీతం వంతున గరిష్ఠంగా 3 నెలల వేతనానికి సమానమైన మొత్తాన్ని తెగతెంపుల వేతనం కింద చెల్లించే విధానం అమలులో ఉంది. అయితే, పశ్చిమ ఐరోపా దేశాలన్నీ ఎంతో అభివృద్ధి చెందినవే అయినా- వాటిలో అత్యధిక ఆదాయం, సంపూర్ణ సామాజిక భద్రత వ్యవస్థగల దేశాలు కూడా నిరుద్యోగులకు సముచిత భృతిని కూడా అందజేస్తుండటం గమనార్హం. చివరగా గమనించాల్సిన అంశమేమిటంటే... కార్మిక రక్షణ నిబంధనల రూపంలోగల అన్ని చట్టాలనూ ఆయా దేశాల్లో కార్మిక కోర్టులు లేదా ధర్మాసనాలద్వారా మాత్రమే అమలు చేస్తారు. అందువల్ల భారత్‌లోలాగా కాకుండా (100 మంది ఉద్యోగులున్న సంస్థ ఒక్కరిని తొలగించాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి అయితే, కార్మిక సంఘాల వ్యతిరేకత తప్పదన్న భయంతో సహజంగానే ఏ రాజకీయ నాయకుడూ ఇందుకు అంగీకరించడు) దేశంలోని కార్మిక చట్టాలకు అనుగుణంగానే ఉద్యోగులను తొలగించినట్లు ఆయా సంస్థలు కోర్టులను ఒప్పించాల్సి ఉంటుంది. ఇక అమెరికాలో నిర్దిష్ట కార్మిక సంఘ ఒప్పందాలు అమలులో ఉండి, వాటిలోని షరతులను పాటించాల్సి ఉంటే తప్ప యాజమాన్యాలు ఇష్టానుసారం ఉద్యోగులను తొలగించేందుకు (ఎలాంటి తెగతెంపుల వేతనం చెల్లించకుండా!) అక్కడి కార్మిక చట్టాలు అనుమతిస్తాయి. అయితే, ఆ దేశంలో చక్కగా పనిచేసే సామాజిక భద్రత వ్యవస్థ అమలులో ఉండటంతోపాటు నిరుద్యోగ కార్మికులకు ఏడాదిపాటు జీవనభృతితోపాటు అవసరమైతే అదనపు శిక్షణ కూడా కల్పిస్తారు.

జపాన్‌లో దీనికి పూర్తిగా భిన్నమైన కఠిన కార్మిక చట్టాలుండటం మరో పార్శ్వం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పునర్నిర్మాణం సాగుతున్న తొలి సంవత్సరాలలో అక్కడి కంపెనీలపై ప్రభుత్వ ఒత్తిడి ఇందుకు సగం కారణం. అలాగే ఒకసారి ఉద్యోగంలో చేరితే జీవితాంతం కొనసాగే ఆ దేశపు సంప్రదాయం మరో సగం కారణం. ఇలా కార్మిక చట్టాలు, సంప్రదాయం ప్రధాన పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల తొలగింపు అక్కడ అత్యంత అరుదే. కానీ, ఇలా శాశ్వత ఉపాధిని కల్పిస్తున్నా కార్మిక సమర్థత, ఉత్పాదకతలను స్థిరంగా నిర్వహించడంలో జపాన్ తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంది. సంస్థ లాభదాయకత ఆధారంగా 3-4 నెలల జీతానికి సమానమైన ప్రోత్సాహకాలను అందజేయడం అక్కడ సర్వసాధారణం. దీంతోపాటు ఉద్యోగి వ్యక్తిగత ప్రతిభను కూడా ఇందుకు ప్రాతిపదికగా పరిగణించడం పరిపాటి. తద్వారా సంస్థ లాభదాయకతలో కార్మికులకూ వాటా లభించడం, తదనుగుణంగా కార్మికులతో పాటు సంస్థ కూడా సమర్థంగా పనిచేయడం సాధ్యమవుతాయి.

భారత్ వంటి వర్ధమాన... భారీ నిరుద్యోగ, తాత్కాలికోద్యోగ సైన్యంగల దేశం కార్మిక సంక్షేమ విధానాలవైపు మొగ్గు చూపడం కొంత ఆశ్చర్యకరమే. ఆ మేరకు సంఘటిత రంగంలోని కార్మికుల కోసం ప్రపంచంలోనే అత్యంత రక్షణాత్మక చట్టాలను అమలుచేస్తోంది. నిరుద్యోగ సమస్యేలేని వర్ధమాన దేశాల్లో కూడా ఇలాంటి పరిస్థితి కనిపించదు. కాబట్టే భారత్‌లో స్వల్ప (ఓ ఏడాది అంతకన్నా తక్కువ) అర్హత నిర్ణయ వ్యవధి (ప్రొబేషన్) తర్వాత ఉద్యోగం శాశ్వతమవుతుంది. సంస్థను నడవడం సమర్థనీయం కాకపోయినా ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వ అనుమతి లభించడం అరుదే (కార్మిక సంఘాల ఆగ్రహాన్ని ఏ రాజకీయ నాయకుడూ కోరుకోడుగనుక). ఇక ప్రభుత్వరంగ ఉద్యోగులకు వారి ప్రతిభ, పనితీరుతో నిమిత్తం లేకుండానే జీతాల్లో వార్షిక పెంపు యథావిధిగా సాగిపోతుంది. కష్టించి పనిచేయడానికి, సామర్థ్యం మెరుగుకు ప్రోత్సాహకం అనేదే లేని ఫలితంగా ఉత్పాదకతలో నాణ్యత లోపం, అధిక ధరలు, ఎగుమతుల క్షీణతకు

దారితీస్తోంది. అంతిమంగా ఇది స్వల్ప ఉద్యోగావకాశాలు, తక్కువ వేతనాలు, అత్యధిక నిరుద్యోగితకు కారణమవుతోంది.

ఉత్పాదకతను, సమర్థతను పణంగా పెట్టి... అందునా మన స్థాయి అభివృద్ధికితోడు సమర్థులైన లక్షలాది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులలో ఇంతటి రక్షణాత్మకత సబబేనా అన్నది మనం తరచి చూడాల్సిన అవసరం ఉంది. చైనా, తూర్పు ఆసియా, భారత్‌లలోని పరిస్థితులను పరిశీలిస్తే అత్యంత రక్షణాత్మక కార్మిక విధానాలు కార్మికులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించడంకన్నా ఎక్కువగా వారికి హాని చేస్తాయని తేలుతోంది. కార్మిక ఉత్పాదకతను దెబ్బతీసి, వస్తువుల ధరలు పెరగడానికి ఈ విధానాలు కారణమవుతాయి. ఉత్పత్తి వృద్ధికి తోడ్పడే ఎగుమతి విపణులలో మన ఉత్పత్తులు పోటీపడే స్థాయి లేనివి కావడంతో ఎగుమతులు క్షీణిస్తాయి. తత్ఫలితంగా ఉత్పాదకతలో వృద్ధి దిగనాసిల్లడమేగాక ఉపాధి కల్పన కూడా దెబ్బ తింటుంది.

తూర్పు ఆసియా దేశాల్లో కార్మిక చట్టాలు సాధారణంగా సమర్థ, సరళ కార్మిక వినియోగానికి మద్దతిచ్చేవిగా ఉంటాయి. చాలా దేశాలు ప్రశాంత పారిశ్రామిక సంబంధాలుగల వాతావరణం ఉండేవిధంగా చూస్తాయి. తదనుగుణంగా సమ్మెకు పిలుపునిచ్చే ముందు స్వచ్ఛంద, నిర్బంధ మధ్యవర్తిత్వానికి వీలుగా ఉపశమన వ్యవధి (దాదాపు ఒక నెల)ని అక్కడి చట్టాలు నిర్దేశిస్తాయి. కాబట్టి ఆ దేశాల్లో సమ్మెలు, పని స్తంభించడం వంటివి చాలా అరుదు. అంతేకాకుండా ఉద్వాసన చెల్లింపు (సర్వీసుకాలంలో ఏడాదికి నెల జీతం వంతున) చేయాల్సి ఉన్నప్పటికీ సంస్థలు కార్మికులను తొలగించే హక్కు కలిగి ఉంటాయి. ఈ విధానం కార్మిక వినియోగంలో సరళతతోపాటు కార్మికులలో క్రమశిక్షణను కూడా నిర్దేశిస్తుంది. తద్వారా పారిశ్రామికవేత్తలు కార్మికులను నియమించుకోవడానికి మొగ్గుచూపుతారు. అంతిమంగా అది వేగవంతమైన వృద్ధితో కూడిన ఉపాధి కల్పనకు, వేతనాలకు దోహదపడుతుంది. జపాన్ అనుసరిస్తున్న సరళ వేతన విధానాన్ని కొరియా, తైవాన్, మలేషియా, సింగపూర్ కూడా అమలు చేస్తున్నాయి. కంపెనీల లాభదాయకతపై కొంతమేర ఆధారపడి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంవల్ల వారు మరింత బాధ్యతాయుతంగా, సహకారాత్మకంగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఈ ప్రోత్సాహకం (ప్రమోషన్లు సహా) పనితీరును ముడిపెట్టడంవల్ల ప్రతి ఉద్యోగీ తన సామర్థ్యానికి తగిన ప్రోత్సాహకం పొందుతాడు. జపాన్ తరహాలో గణనీయ ఉద్యోగ భద్రత ఉన్న దేశాల్లోనూ ప్రోత్సాహకాలను అమలు చేయడమన్నది ఉత్తమ పనితీరును రాబడుతుంది. చివరగా, తూర్పు ఆసియా దేశాలన్నీ తమ కార్మికులకు సాధారణ అవగాహన, శిక్షణ కార్యక్రమాలను ఉత్తేజకరంగా మెరుగుపరచడం వారు మరింత ఉత్పాదకతను సాధించేందుకు తోడ్పడింది.

చైనా, జపాన్‌సహా తూర్పు ఆసియా దేశాలన్నీ అత్యంత క్రమశిక్షణ, స్ఫూర్తిదాయకత, సరళతగల సుశిక్షిత కార్మిక శక్తిని సృష్టించడంలో సఫలమయ్యాయి. కానీ, భారతదేశంలో సమర్థత, సంక్షేమం (రక్షణాత్మకత)ల నడుమ సమతూకం పాటించని కారణంగా సమర్థతాంశాల రీత్యా సూచికలన్నీ ప్రమాదకర క్షీణతవైపు జారుతున్నాయి. సమర్థత పెంపు లక్ష్యంలో తూర్పు ఆసియా దేశాలు సాధించిన వృద్ధినైనా అందుకోవడంలో భారత్‌కుగల విభిన్న చారిత్రక, సామాజిక నేపథ్యం అవరోధంగా ఉండొచ్చు. అయినప్పటికీ కార్మికశక్తి సమర్థతను మెరుగుపరిచే దిశగా దేశం తగినంత కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ మేరకు కింద పేర్కొన్న తూర్పు ఆసియా కార్మిక సమర్థత పెంపు విధానాలను మన దేశం వర్తింపజేసుకోవాలి. ఆ విధంగా ఉపాధి కల్పనలో, వాస్తవ వేతనాలలో వృద్ధిని సాధించడంద్వారా భారతీయ కార్మికుల దీర్ఘకాలిక సంక్షేమాన్ని మెరుగుపరచాలి:

(1) కార్మికులకు సముచిత ఉద్యోగ భద్రత వాస్తవాన్ని గుర్తిస్తూనే వారిని వినియోగించుకోవడంలో యాజమాన్యాలకు వెసులుబాటు కల్పించాలి. మనుగడ సాగించలేని సంస్థలను రాయితీల ప్రాతిపదికన కొనసాగించడం దీర్ఘకాలంలో భరించ సాధ్యంకాదన్నది స్పష్టం. పోటీని ఎదుర్కొనే క్రమంలో సాంకేతిక పునర్వ్యవస్థీకరణ లేదా ఉత్పత్తి తగ్గించాల్సి రావడం వంటి పరిస్థితులున్నపుడు మానవతా కోణంతో ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సంస్థలను అనుమతించాలి. అదే సమయంలో విధులు సరిగా నిర్వర్తించని, దుష్ప్రవర్తనకు పాల్పడే ఉద్యోగులను తొలగించడంలో యాజమాన్యాలకు కొంత స్వేచ్ఛనివ్వాలి. ఉద్వాసన ప్రక్రియ దుర్వినియోగం కాకుండా చూడటంలో భాగంగా తొలగింపు సకారణమేనని సదరు సంస్థలు న్యాయస్థానాల్లో నిరూపించేలా ప్రతిసమతూక పద్ధతిని అనుసరించవచ్చు. దాంతోపాటు ఉద్వాసన అక్రమమని తేలినపక్షంలో అదనపు నష్టపరిహారం లేదా తిరిగి నియమించేలా (మలేషియా తరహాలో) నిబంధన విధించవచ్చు. అన్ని పరిస్థితులలోనూ పూర్తి ఉద్యోగ భద్రత వల్ల కార్మిక క్రమశిక్షణను నిర్వహించడం చాలా కష్టం కావడమేగాక కార్మికులలో స్ఫూర్తి నశించి ఉత్పాదకత కూడా దెబ్బతింటుంది.

(2) ఉద్యోగి తొలగింపు వీలుకాని కాల వ్యవధిని 240 రోజుల నుంచి మూడేళ్లకు పెంచాలి. కంపెనీల లాభదాయకతలో (కార్మికులు, మేనేజర్లకు) వాటా కల్పించే జపాన్ తరహా సరళ వేతన పద్ధతిని, మంచి పనితీరు ఆధారంగా ప్రమోషన్ ఇవ్వడాన్ని ప్రవేశపెట్టాలి. కార్మికులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకుని, ఉత్పాదకతను పెంచడంలో మరింత సహకరించే ప్రోత్సాహకాలుగా ఇవన్నీ దోహదపడతాయి. భారత్ వంటి దేశంలో ఉద్యోగ భద్రతలను బలమైన సంప్రదాయంగా మలచి, ఉత్పాదకతను పెంచే మంచి, రాజకీయంగానూ ఆమోదయోగ్య మార్గంగా దీన్ని పరిగణించవచ్చు.

(3) మరింత సరళమైన కార్మిక విధానాలతో మనం ప్రయోగం చేయాలి. ఉదాహరణకు ఎగుమతుల పరిమాణంలో పెరుగుదల, సమర్థ-స్పర్థాత్మక కార్మిక శక్తి అవసరం దిశగా ఎగుమతి ప్రక్రియ మండళ్లలో ఈ విధానాలను అమలుచేసి చూడవచ్చు. మనం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకూ పనికొస్తుంది. ఎగుమతి మండళ్లలో ఉపాధి అవకాశాల సృష్టి వేగం పుంజుకోవడంవల్ల మరింత సామర్థ్యం ప్రాతిపదికగాగల కార్మిక చట్టాలపై కార్మికులు, కార్మిక సంఘాలలోగల భయాందోళనలు ఉపశమించే వీలుంటుంది.

(4) కార్మికులను మరింత ఉత్పాదకంగా మలచేందుకు వీలుగా వారికి అవగాహన, శిక్షణ మెరుగు దిశగా మరింత కృషి అవసరం. పిల్లలందరికీ 10వ తరగతి ఉత్తీర్ణతను కనీస విద్యార్హతగా నిర్ణయించడంతోపాటు వృత్తివిద్యా శిక్షణకు మరింత ప్రాధాన్యమివ్వాలి. ఇందులో మొదటి అంశం దీర్ఘకాలంలో సుస్థిర ఆర్థిక వృద్ధికి అత్యంత ఆవశ్యకం. అలాగే ప్రతి కార్మికుడికీ తలసరి భౌతిక మూలధనం అందుబాటును పెంచాలి. దేశీయంగానేగాక విదేశీయంగానూ పొదుపును, పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలు ఇందులో భాగంగా ఉంటాయి.

కార్మిక విధానంలో ఈ అంశాలను చొప్పించడంద్వారా భారత కార్మికశక్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచవచ్చు. అదే సమయంలో ఎగుమతి ప్రాధాన్య, కార్మిక సమర్థ పారిశ్రామిక విధానాల శ్రేణిని దీనితో జతకలిపితే ఉపాధి కల్పనలో వృద్ధి దూసుకుపోవడమేగాక ఉద్యోగుల తలసరి వాస్తవ వేతనం కూడా పెరిగి జమిలి ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఎగుమతి ప్రాధాన్య పారిశ్రామికీకరణ దిశగా భారత్ ఇప్పటికే అనేక సంస్కరణలను ప్రవేశపెట్టిన నేపథ్యంలో కార్మిక సంస్కరణలద్వారానూ గణనీయ లబ్ధిపొందగల స్థితిలో ఉంది. ఉపాధి కల్పనలో, ఉద్యోగుల సగటు వాస్తవ ఆర్జనలో వృద్ధి రూపంలో దేశానికి ఈ సంస్కరణల లబ్ధి సమకూరుతుంది. ■

---

*10వ పేజీ తరువాయి...*

### కార్మిక సంస్కరణలు: సవాళ్ళు... అవకాశాలు

అద్భుత చట్టం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శం కావాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర చట్టాన్ని అన్వయింప చేసుకోవచ్చు లేదా స్థానిక ప్రాధాన్యతలతో, కొద్దిపాటి మార్పులతో ఇదే తరహా చట్టాలను తెచ్చుకోవచ్చు. పైగా ఇటువంటి చట్టం దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులందరికీ ఒకే విధంగా అమలుజరిగితేనే అది సమర్థవంతమైన చట్టం అవుతుంది.

విస్తృత ప్రాతిపదికతో కూడిన సమగ్రమైన జాతీయ కార్మిక విధానాన్ని అభివృద్ధిపరచకుండా కార్మిక వనరుల వ్యవస్థలో విప్లవాత్మక చట్టపరమైన జోక్యం అసాధ్యం. అందుచేత భారత ప్రభుత్వం పరిశ్రమలను సంతృప్తి పరచడానికి కార్మిక చట్టాల్లో కొన్ని నిబంధనలను సవరించే తాత్కాలిక ప్రయత్నాన్ని కొనసాగించకుండా ముందుగా కార్మిక అంశాల పట్ల జాతీయ విధాన వ్యవస్థపై ఏకాభిప్రాయ సాధన దిశగా దృష్టి సారించాలి. గత 20 ఏళ్ళలో అనేక అధ్యయనాలు, సంప్రదింపులు, సంస్కరణలు జరిగినందున వాటాదారులందరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ.. జాతీయ కార్మిక విధానాన్ని రూపొందించడం సులభతరమే అవుతుంది. అత్యున్నత ఆటోమేటెడ్ తయారీ వ్యవస్థ అభివృద్ధిచెందుతున్న నేపథ్యంలో దేశంలో నిరుద్యోగ పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం నూతన అవకాశాలను సృష్టించడం తప్పనిసరి. 'మేక్ ఇన్ ఇండియా' ఇప్పటికే ఆకర్షణీయ పెట్టుబడులను రాబట్టడం ప్రారంభించినప్పటికీ అందుకను గుణంగా తయారీ రంగంలో ఉద్యోగాలు పెరగడంలేదు. కనుక భారత ప్రభుత్వం అధిక శాతం యువత పూర్తి శక్తి సామర్థ్యాలతో సేవారంగంలోకి ప్రవేశించేలా ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి పెట్టాలి. ఉన్నత విద్యతో కూడిన సమీకృత వృత్తి శిక్షణ ద్వారా దీన్ని సాధించాలి. యాజమాన్యాల చేతిలో దోపిడీకి గురవుతున్నామన్న భయం లేకుండా అత్యంత నైపుణ్యం గల యువత తయారీ, సేవారంగాల్లో ప్రవేశిస్తేనే కార్మిక సంస్కరణలకు అసలైన అర్థం, పరమార్థం ఏర్పడతాయి. కార్మిక చట్టాల్లో మార్పుల దిశగా భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన చర్యలు స్వాగతించదగినవే అయినా.. సామర్థ్యాల పెంపు ద్వారా కార్మిక శక్తి సాధికారతకు సమాన ప్రాధాన్యం కల్పించడం ద్వారా ఎంతైనా అవసరం.

■

ప్రత్యేక వ్యాసం

# మహిళల ఉపాధి : నిస్సహాయతలో నూతన ఆశ



వివిధ ప్రభుత్వాలు ఎన్నో ఉపాధి కల్పనా పథకాలు చేపట్టడం ద్వారా – మహిళల ఉపాధి, పని పరిస్థితులను మెరుగుపరచడం కోసం తీసుకున్న చర్యలు, విధానాలకు ఎంతో చరిత్ర ఉంది. మహిళలను స్వయం ఉపాధి కార్మికులుగా తీర్చిదిద్దడం – ఈ సమయంలో తీసుకున్న ముఖ్యమైన చర్యల్లో ఒకటి. అసంఘటిత రంగంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు, విస్తృతమైన మార్కెట్‌కు మధ్య సంబంధాలను విస్తరించడంలో సరళీకరణ ప్రభావం ప్రయోజనాలను మహిళలకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ చర్య తీసుకోవడం జరిగింది.

మహిళా ఉద్యోగుల భాగస్వామ్య శాతం (WPR) అతితక్కువగా ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి. ఆఫ్రికా ఉప ఖండం, మధ్య ప్రాచ్య దేశాలలోని చాలా దేశాల కంటే కూడా ఇది తక్కువగా ఉంది. పురుషుల భాగస్వామ్య శాతం కంటే ఇది చాలా తక్కువ (ILO, 2016). మహిళా ఉద్యోగుల భాగస్వామ్య రేటు విషయానికి వస్తే – ఇరాన్, పాకిస్తాన్, సౌదీ అరేబియాతో సహా – కేవలం కొన్ని దేశాలు మాత్రమే – భారత దేశానికంటే అధ్వాన్నంగా ఉన్నాయి. 2013లో దక్షిణ ఆసియాలో ఈ రేటు కేవలం 30.5 శాతంగా ఉండగా – చాలా ప్రాంతాలు, దేశాల్లో ఈ రేటు పెరిగినట్లు కనబడుతోంది. అయితే భారత దేశంలో ఒక్కసారిగా తగ్గడంతో – దక్షిణ ఆసియాలో ఈ రేటు బాగా పడిపోయింది. ఆర్థికాభివృద్ధి అధికంగా ఉన్న సమయంలో – మహిళా అక్షరాస్యత శాతం, విద్యా నమోదు శాతం సానుకూలంగా పెరుగుతున్నప్పటికీ – మహిళా ఉపాధి ఒక సవాలుగానే ఉండిపోయింది. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) వంటి భారీ స్థాయి గ్రామీణ ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించే సమయంలో ఇది కొంచెం అయోమయానికి దారితీసింది. 2004-05 లో మహిళా ఉద్యోగుల భాగస్వామ్య రేటు 28.2 శాతం ఉండగా – అది 2011-'12 లో 21.7 శాతానికి ఒక్కసారిగా పడిపోయింది. ఇది అప్పటికే కొనసాగుతున్న ఒక సంక్షోభం పై ప్రభావం చూపింది. ఈ తగ్గుదలతో – మహిళా ఉద్యోగుల భాగస్వామ్య రేటు పరంగా చూస్తే – 2010లో 83 దేశాలలో 68వ స్థానంలో ఉన్న భారతదేశం–2012లో 87 దేశాలలో 84 వ స్థానానికి తగ్గిపోయింది.

**మహిళా ఉపాధిలో పోకడలు, నమూనాలు :**

గణాంక విధానంలో స్వభావరీత్యా, అంతర్గతంగా కొన్ని సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయి. అంటే మహిళల పనిపై వివరాలు సమగ్రంగా, స్పష్టంగా లేవు. అయినప్పటికీ, ఈ వివరాలు పోకడలు, నమూనాల సమగ్ర స్వరూపాన్ని తెలియజేస్తాయి. 1990–2000 నుంచి 2004–2005 మధ్య కాలంలో మహిళా ఉపాధి కొంత మేర వృద్ధి చెందినట్లు కనబడుతోంది. ఆ సమయంలో మహిళల భాగస్వామ్య రేటు సుమారుగా మూడు శాతం పెరిగింది. 2004–2005 వరకూ మాత్రమే ఈ వృద్ధి కనబడింది. మహిళలకు

**నీతా ఎన్,** సీనియర్ ఫెలో (ప్రొఫెసర్), మహిళల అభివృద్ధి అధ్యయన సంస్థ, న్యూ ఢిల్లీ.
E-mail: neethapillai@gmail.com

సంబంధించిన ఇతర పురోగతికి విరుద్ధంగా – ఆ తర్వాత ఇది మరింతగా తగ్గినట్లు కనబడుతోంది. పనిలో పాల్గొనే రేటు కేవలం మహిళల్లో తక్కువగా ఉండటమే కాకుండా – పట్టణ మహిళల్లో ఇది నిలకడగా ఉండగా, గ్రామీణ మహిళల్లో ఇది గణనీయంగా పడిపోయింది.

| పట్టిక 1 : పురుషులు, మహిళల్లో – పనిలో పాల్గొనే రేటు లో పోకడలు – UPSS | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రౌండ్లు | మొత్తం | | గ్రామీణ ప్రాంతం | | పట్టణ ప్రాంతం | |
| | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు |
| 1993-1994 | 54.4 | 28.3 | 55.3 | 32.8 | 52.1 | 15.5 |
| 1999-2000 | 52.7 | 25.4 | 53.1 | 29.9 | 51.8 | 13.9 |
| 2004-2005 | 54.7 | 28.2 | 54.6 | 32.7 | 54.9 | 16.6 |
| 2007-2008 | 55.0 | 24.6 | 54.8 | 28.9 | 55.4 | 13.8 |
| 2009-2010 | 54.6 | 22.5 | 54.7 | 26.1 | 54.3 | 13.8 |
| 2011-2012 | 54.4 | 21.7 | 54.3 | 24.8 | 54.6 | 14.7 |

మూలం : జాతీయ నమూనా సర్వే వివరాలు, వివిధ రౌండ్లు

ఆర్థికవ్యవస్థలో అత్యధిక వాస్తవ వేతనాల సానుకూల ఆదాయ ప్రభావం, విద్యా కార్యక్రమాల సానుకూల ఫలితాలు – మహిళల ఉపాధి తగ్గడానికి ప్రధాన కారణాలుగా సాహిత్యంలో చూపించారు. అయితే, విద్యా రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగడం కానీ, కుటుంబంలో వాస్తవ ఆదాయంలో పెరుగుదల కానీ ఈ భారీ తగ్గుదల కారణాలను వివరించలేక పోతున్నాయి. పనిచేసే మహిళల్లో ఎక్కువ మంది గృహ సంబంధమైన పనులు చేయడానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో మహిళలపై సంరక్షణ బాధ్యతలు పెరుగుతున్నాయి. ఎగువ పొందుపరచిన గణాంకాలలో లెక్కించిన చాలా మంది మహిళలు పూర్తి సమయం పనిచేసే కార్మికులు కాదు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పాటు, గృహ సంబంధమైన ఇంటి పనులు చేయాలనే సామాజిక ఆకాంక్ష ఎక్కువగా ఉండటంతో – చాలా మంది మహిళలు పూర్తి సమయం ఉపాధిలో పాల్గొనలేక పోతున్నారు. మొత్తం మహిళా కార్మికుల్లో అటువంటి అనుబంధ కార్మికుల సంఖ్య 2011-12 లో కూడా దాదాపు 22 శాతం ఉంది. అనుబంధ కార్మికులు, ప్రధాన కార్మికులు – రెండు వర్గాల్లోనూ ఈ తగ్గుదలను గుర్తించినప్పటికీ – ప్రధాన కార్మికుల్లోనే ఇది ఎక్కువగా ఉంది. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న అట్టడుగు వర్గాలే – ఈ విషయంలో ఎక్కువగా ప్రభావితమైనట్లు సామాజిక బృందాల విశ్లేషణ ద్వారా తెలుస్తోంది (నీతా, 2014).

ఈ రంగాల గురించి విస్తృతంగా చూసినట్లయితే 2011-12లో వ్యవసాయ రంగంలో 62.3 శాతం మహిళలు ఉపాధి పొందగా, అనుబంధ రంగంలో కేవలం దాదాపుగా 20 శాతం మంది, సేవల రంగంలో 18 శాతం మంది ఉపాధి పొందారు. అనుబంధ రంగం విషయానికి వస్తే ఈ కాలంలో చేసే పనిని బట్టి నిర్మాణ రంగంలో మహిళల నిష్పత్తి పెరిగింది. వ్యవసాయ రంగ సంక్షోభం వల్ల దెబ్బతిన్న చాలా మంది కార్మికులు – సరళీకరణ అనంతర సమయంలో రియల్ ఎస్టేట్‌లో నెలకొన్న అభివృద్ధికి దోహదపడిన నిర్మాణ రంగం, దాని సంబంధమైన పనుల కోసం పరుగులు తీశారు. ఈ నేపథ్యంలో ఇతర గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ఎంతో వ్యథతో వలస పోయిన ఇంటి పనులు చేసే వారి వివరాలను గుర్తించి, పూర్తిగా నమోదుచేయ దమయ్యింది. ఇటుక బట్టీల వంటి వాటిలో సాధారణ పనులు చేసే కొంత మంది తీవ్ర శ్రమ దోపిడీకి గురౌతున్నారు. అప్పులలో కూరుకు పోయి, ఋణ బానిసత్వానికి గురై – కాంట్రాక్టర్ల అధీనంలో తమ జీవితాలను, శ్రమను ధారపోస్తున్నారు. ఎవరి వేతనం వారికి ఇవ్వకుండా జోడీకి (జంట లేదా

| పట్టిక 2 : విస్తృత పారిశ్రామిక విభాగాల్లో కార్మికుల విభజన – 1999-2000 నుంచి 2011-2012 వరకు | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **పరిశ్రమ** | **1999-2000** | | **2004-05** | | **2011-12** | |
| | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు |
| వ్యవసాయం | 52.7 | 75.4 | 48.6 | 72.8 | 42.5 | 62.0 |
| గనుల తవ్వకం | 0.7 | 0.3 | 0.7 | 0.3 | 0.6 | 0.3 |
| తయారీ రంగం | 11.5 | 9.5 | 12.4 | 11.3 | 12.6 | 13.4 |
| విద్యుత్తు, గ్యాస్ & నీటి సరఫరా | 0.4 | 0.0 | 0.4 | 0.0 | 0.4 | 0.1 |
| నిర్మాణ రంగం | 5.8 | 1.6 | 7.6 | 1.8 | 12.4 | 6.0 |
| సేవలు | 28.8 | 13.2 | 30.2 | 13.7 | 31.5 | 18.3 |
| **మొత్తం** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** |

మూలం : ఉపాధి, నిరుద్యోగ నివేదికలు, వివిధ రౌండ్లు, జాతీయ ప్రతిచయన సంస్థ.

దంపతులకు) ఒకే వేతనం ఇచ్చే మరొక విచిత్రమైన విధానం ఈ రంగంలో ఉంది.

**మహిళల ఉపాధి స్వభావం మరియు నాణ్యత :**

మహిళలు ఎటువంటి స్వభావం గల ఉపాధిలో ఉన్నారు? గ్రామీణ మహిళల్లో వేతనం లేని కార్మికులు / సహాయకులు పెద్ద సంఖ్య లో ( 41 శాతం) ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో తాత్కాలిక ప్రాతిపదికన పని చేసే కార్మికులు (35 శాతం) ఉన్నారు. వ్యవసాయం, వృత్తి పనులు చేసే కార్మికులు సంక్షోభంలో ఉన్నారు. కుటుంబ భారం మహిళలపై వదిలివేసి – పురుషులు వేతనంతో కూడిన పనుల కోసం బయటకు వెళ్తున్నారు. దీంతో మహిళలను– వేతనంతో కూడిన స్వయం ఉపాధి కలిగిన వారుగా లేదా స్వంత పనివారుగా నమోదు చేయడం జరిగింది. తాత్కాలిక కార్మికుల సంఖ్య ఈ కాలంలో బాగా తగ్గింది. సుమారు 4 శాతం. ఇక సాధారణ కార్మికుల సంఖ్య కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం మీద పోల్చుకుంటే చాలా తక్కువగా (6 శాతం) ఉంది.

పట్టణ మహిళా కార్మికుల విషయానికి వస్తే – గత 20 ఏళ్లలో సాధారణ కార్మికుల సంఖ్య 10 శాతం మేర పెరగడంతో – మొత్తం మీద పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు మనకు కనబడుతోంది. అయితే, పట్టణ ప్రాంతాల్లో మహిళల పనిలో భాగస్వామ్య రేటు చాలా తక్కువగా ఉంది. 2011–12 లో కేవలం 15 శాతం ఉంది. సాధారణ పనిని ఏ విధంగా నిర్వచిస్తామో అనే దానిపై ఇది ఆధారపడటంతో – మొత్తం మీద ధోరణి దెబ్బతింటోంది. ఇది కనీస వేతనంతో, మంచి పని పరిస్థితులతో కూడిన అధికారికమైన, సాధారణ పని కాదు. ఇది అంత మంచి పని కాక పోయినప్పటికీ – ఉపాధి కొనసాగే విధంగా – కాల పరిమితి నిర్దేశించకుండా ఉంటుంది. వీటిలో వేతనంతో కూడిన ఇంటి పనులు ఇంకా ఇతర సేవా రంగాలకు చెందిన దుకాణంలో సహాయకులు, రెసెప్షనిస్టులు వంటి వివిధ కాంట్రాక్టు ఉద్యోగాలు కూడా ఉంటాయి. ఆ విధంగా, పెరుగుతున్న అసంఘటిత రంగంలో భాగంగా ఎక్కువ సంఖ్యలో ఉన్న సాధారణ కార్మికుల గురించి కూడా చూడవలసిన అవసరం ఉంది. అదే విధంగా – వేతనాలతో కూడిన స్వయం ఉపాధిలో సుమారు ఒక శాతం పెరుగుదల రేటును కూడా మనం గమనించాలి. ఇది ఎటువంటి ఒక వైపు మహిళలు ఇతర కుటుంబ సభ్యుల కంటే స్వతంత్రంగా కొంత ఆదాయాన్ని అందుకుంటున్నారు. దాన్ని వారి ఇష్టాను సారం ఉపయోగించుకోవచ్చు. ఎక్కువగా వారి దైనందిన వినియోగానికి అవసరమైన ఖర్చులకోసం వినియోగిస్తారు. అయితే, ఈ స్వయం ఉపాధి పొందిన వారిలో ఎక్కువమంది చిన్న వ్యాపారవేత్తలు కాదు. కానీ – బీడీ, వస్త్రాలు, గాజులు, బొట్టు బిళ్ళలు తయారు చేయడం, ప్యాకేజింగ్ మొదలైన బాగా విస్తరిస్తున్నటు వంటి– ఇంటిలో ఉండి పనిచేసే కార్మికులకు అధిక అవకాశాలు కల్పించే రంగంలో భాగంగా వీరు పనిచేస్తున్నారు. ఇళ్లల్లో పనిచేసే ఇటువంటి పనులకు వేతనం రేటు చాలా తక్కువ. ఒక్కొక్క వస్తువుకు లేదా గంటకు వేతనాన్ని లెక్క కడతారు. చాలా ఎక్కువ గంటలు పనిచేయవలసి ఉంటుంది. జీవనం గడపడం కోసం చాలా శ్రమకు ఓర్చవలసి ఉంటుంది. అక్కడ కూడా కాంట్రాక్టర్ పై ఆధారపడవలసి ఉంటుంది. కొన్ని చోట్ల కార్మికురాలిగా కుటుంబపరమైన గుర్తింపు కూడా ఉండదు. కఠినతరమైన పని పరిస్థితుల్లో ఒక్కోసారి పని వదులుకోడానికి సైతం సిద్ధంగా ఉండాలి. దినదిన ప్రవర్ధమాన మవుతున్న ఈ రంగంలో ఉపాధి అవకాశాల కోసం – ఈ రంగానికి అవసరమైన సేవలను అందించడానికి ఉపయోగపడే వివిధ పనుల పంపిణీని జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఎక్కువ నిష్పత్తిలో మహిళలు ఉపాధి పొందుతున్న వాణిజ్యం, ఆతిథ్యం లేదా కమ్యూనికేషన్ రంగాల్లో మాత్రమే కాదు. విద్యా రంగం లోనూ, ఇంటి పనుల్లో (ఉద్యోగులు ఉన్న ప్రయివేటు ఇళ్లల్లో) వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. ఇంటి పనుల్లో వేతనాలు, పని పరిస్థితులు చాలా భిన్నంగా ఉంటాయి. పని సంబంధాలు స్థిరంగా, వ్యక్తిగత నియంత్రణలో స్పష్టంగా ఉంటాయి. ఈ కార్మికులకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో చట్టాలు లేకపోవడం ఒక సమస్యగా ఉంది. చాలా రాష్ట్రాలు వీరిని ఇంకా కనీస వేతన చట్టం పరిధిలోకి తీసుకురాలేదు. మహిళలకు ఒక స్వతంత్ర కార్మికురాలి హోదా కల్పించే విషయంలో బహుశా విద్య వారికి ఒక గొప్ప ఆశాజనకమైన వేదిక కాగలదు. దురదృష్ట వశాత్తూ, అన్ని స్థాయిల్లో విద్య ప్రయివేటీ కరణ పెరుగుతూ ఉండటంతో – ఈ రంగంలో పనిచేస్తున్న మహిళలు తరచుగా ఉద్యోగాల్లో అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొంటు న్నారు. అనేక విధాలుగా దోపిడీకి గురౌతున్నారు. వారికి రావలసిన వేతన బాకీలను పొందలేకపోతున్నారు.

గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే – అంగన్ వాడీ, ఆశా కార్యకర్తల వంటి అనేక రాష్ట్ర ప్రభుత్వ పథకాలు / కార్యక్రమాల నిర్వహణలో – పెరుగుతున్న ఈ పథకం కార్యకర్తలే కేంద్ర బిందువుగా ఉన్నారు. బహుముఖంగా పని బాధ్యతలు గల ఈ కార్మికులను – రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదు. కానీ వీరిని గౌరవ వేతనం మాత్రమే తీసుకునే అర్హత గల – కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారు. మహిళలు వేతనాలు పొందుతున్న సంరక్షణ పనులను పోలి ఉన్న ప్రాంతాలు మాత్రమే అభివృద్ధి ప్రాతాలుగా

పట్టిక 3 : సేవారంగానికి చెందిన విస్తృత పారిశ్రామిక విభాగాలలో కార్మికుల పంపిణీ – 1999–2000 నుంచి 2011–12

| సేవలు | 1999–00 | | 2004–05 | | 2011–12 | |
|---|---|---|---|---|---|---|
| | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు | పురుషులు | మహిళలు |
| వాణిజ్యం | 40.8 | 27.8 (12.0) | 41.3 | 24.4 (11.2) | 39.7 | 22.7 (11.0) |
| హోటళ్లు & రెస్టారెంట్లు | 4.8 | 5.1 (17.7) | 5.2 | 5.8 (19.5) | 6.2 | 5.2 (15.4) |
| రవాణా, గిడ్డంగులు & కమ్యూనికేషన్ | 18.3 | 2.7 (2.9) | 5.2 | 5.8 (2.8) | 6.2 | 5.2 (2.0) |
| ప్రజా పరిపాలన & రక్షణ | 12.1 | 7.5 (11.0) | 8.6 | 5.4 (11.8) | 6.8 | 4.4 (12.2) |
| విద్య | 6.8 | 21.1 (38.4) | 7.2 | 24.3 (41.9) | 7.6 | 27.0 (43.5) |
| ఇతర సామాజిక, సాంఘిక & వ్యక్తిగత సేవలు | 8.4 | 19.1 (31.2) | 7.0 | 9.3 (22.3) | 6.2 | 11.5 (28.6) |
| ఉద్యోగులను నియమించుకున్న గృహాలు | 0.7 | 6.7 (64.0) | 1.5 | 16.6 (70.9) | 1.2 | 11.7 (67.2) |
| ఇతర సేవలు | 8.0 | 10.1 20.1) | 9.9 | 11.5 (19.9) | 13.0 | 15.7 (20.7) |
| మొత్తం | 100.0 | 100.0 (16.7) | 100.0 | 100.0 (17.6) | 100.0 | 100.0 (17.8) |

మూలం : యూనిట్ స్థాయి సమాచారం, వివిధ రౌండ్లు, NSSO.

వివరాలు స్పష్టంగా తెలియాజేస్తున్నాయి. అదే మహిళల బాధ్యతగా ఉంది. ఈ కార్మికులకు జీతం / వేతనం / గౌరవ వేతనం వంటి స్థాయిల్లో చెల్లిస్తూ – సంరక్షణ పనిని – విలువలేని పనిగా కొనసాగిస్తున్నారు. నిరుద్యోగ వివరాలు – ఉపాధి సమస్యకు – ఉపయోగపడే సూచిక కాదు. ఎందుకంటే పేదవారు తన స్థాయి కంటే తక్కువ ఉద్యోగం చేస్తున్నా – చేయగలిగిన దాని కంటే తక్కువ ఉద్యోగం చేస్తున్నా – చేసినదానికి జీతం ఇవ్వకపోయినా – వారు ఏదో ఒక ఉపాధి లేకుండా జీవించలేరు. మార్కెట్ కు సంబంధించిన వ్యవహారాలతో పాటు – వంట చెరకు, పశుగ్రాసం సేకరణ, నీరు, అటవీ ఉత్పత్తుల సేకరణ, ఇంటి అవసరాలకోసం వస్త్రాలు నేయడం, నూలు వడకడం వంటి అనేక ఆర్థిక కార్యకలాపాలలో – మహిళలు – నిమగ్నమై ఉన్నారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు పనికి తగిన వేతనం లభించక పోవడంతో – నూతన ఉదారవాద ఆర్థిక విధానాలతో ఈ రంగాల్లో మహిళల శ్రమ క్రమంగా పెరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. మహిళలకు పనికి తగిన వేతనం లభించకపోవడానికి – అటువంటి పని అవకాశాలు లేకపోవడం, అటువంటి పనులకు హాజరు కాకపోవడం వంటి కారణాలతో పాటు – మహిళల రక్షణ, పిల్లల సంరక్షణ, ఇంటి బాధ్యతల ఒత్తిడి కూడా వారిపై ఉంటుంది. సమాన వేతన చట్టం, 1974 ఆమోదం పొంది అనేక సంవత్సరాలైన తర్వాత కూడా – స్త్రీ, పురుషుల మధ్య ఉన్న వేతన వ్యత్యాసం అదేవిధంగా కొనసాగుతూ – అన్ని వయస్సుల, తరగతుల, సమాజాల, ప్రాంతాల మహిళలపై ప్రభావం చూపుతోంది. ఈ చట్టం అమలు ఒక తీవ్రమైన ఆందోళన కలిగించే అంశంగా ఉంది. స్త్రీ, పురుషుల వేతన అసమానత భారతదేశంలోనే చాలా ఎక్కువగా ఉన్నట్లు – అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) ఇటీవల అధ్యయనం తెలియజేస్తోంది. ఒకే రకమైన పని చేస్తున్న మహిళల కంటే పురుషులకు 30 శాతం కంటే ఎక్కువ వేతనం లభిస్తోంది. తక్కువ వేతనం పొందుతున్న 60 శాతం మంది మహిళల్లో – కేవలం 15 శాతం మంది మాత్రావే అత్యధిక వేతనం పొందుతున్నవారు ఉన్నారు.

## రాష్ట్రాల జోక్యం

వివిధ ప్రభుత్వాలు ఎన్నో ఉపాధి కల్పనా పథకాలు చేపట్టడం ద్వారా – మహిళల ఉపాధి, పని పరిస్థితులను మెరుగుపరచడం కోసం తీసుకున్న చర్యలు, విధానాలకు ఎంతో చరిత్ర ఉంది. మహిళలను స్వయం ఉపాధి కార్మికులుగా తీర్చిదిద్దడం – ఈ సమయంలో తీసుకున్న ముఖ్యమైన చర్యల్లో ఒకటి. అనధికారిక రంగంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు, విస్తృతమైన మార్కెట్‌కు మధ్య సంబంధాలను విస్తరించడంలో సరళీకరణ ప్రభావం ప్రయోజనాలను మహిళలకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ చర్య తీసుకోవడం జరిగింది. మహిళలను దారిద్ర్యం నుండి విముక్తి కలిగించి, వీరి ఆర్థిక సాధికారతకు పోరాడే విధంగా అవసరమైన అన్ని విధానాలను వారికి అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో – సూక్ష్మ ఋణ సదుపాయాల సంస్థ, ప్రభుత్వేతర సంస్థల సహాయంతో స్వయం సహాయ బృందాలు

మొదలైనవి ఏర్పాటు చేయడమైనది. తదనుగుణంగా, సరళీకరణ అనంతర కాలంలో – వివిధ మంత్రిత్వ శాఖలు – మహిళల స్వయం ఉపాధిని పెంపొందించే దిశగా అనేక కార్యక్రమాలను ప్రారంభిం చాయి. అయినప్పటికీ, వ్యవసాయ రంగంలో తగ్గిన మహిళా ఉపాధిని ఇది పూడ్చలేక పోయింది.

ప్రారంభంలో ఉన్న సంక్షోభాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీర్చింది. అయితే ఉపాధి హామీ దినాలు పరిమిత సంఖ్య లో ఉండడం, శారీరక శ్రమతో కూడిన పనులపై ఎక్కువగా దృష్టి పెట్టడంతో–దీర్ఘకాలంలో ఇది మహిళల ఉపాధి సమస్యను పరిష్కరించ లేకపోయింది. వేతనంతో కూడిన ఉపాధిలో మహిళల భాగస్వామ్యం ముందుకు సాగకుండా – వారికి ప్రత్యేకంగా ఉండే బాధ్యతలు, నైపుణ్యాల అసమతుల్యతలు అవరోధాలుగా నిలిచాయి. ఈ ప్రధాన కారణంగానే – తమ ప్రసూతి అవసరాలు, పిల్లల సంరక్షణ కోసం సెలవులు తీసుకోవలసి రావడంతో – యువతులు – తమ ఉపాధి అవకాశాలను వదులుకుంటున్న సంగతి మనందరికీ తెలిసిందే. ప్రసూతి ప్రయోజనాల చట్టం (సవరణ) 2017 కింద ప్రసూతి సెలవులు పెరిగినప్పటికీ – దీని అమలు వ్యవస్థీకృత రంగానికి మాత్రమే పరిమితమై ఉంది. ఈ సవరణ ప్రకారం – గతంలో 12 వారాలుగా ఉన్న వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇప్పుడు 26 వారాలకు పెరిగింది. 50 మంది అంతకంటే ఎక్కువ మంది కార్మికులు ఉన్న సంస్థల్లో – క్రెచ్ (చిన్న పిల్లల సంరక్షణ) సదుపాయం–కల్పించాలని కూడా–ఈ చట్టం ప్రతిపాదిస్తోంది. యజమానుల విచక్షణతో కల్పించే – ఇంటినుంచి పనిచేసే సదుపాయానికి అదనంగా ఈ సదుపాయం కూడా ఉండాలి. అయితే, సవరించిన ఈ చట్టం అన్ని సంస్థలకు వర్తించదు. కనీసం 10 మంది కార్మికులు ఉన్న సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. తక్కువ వేతన పరిధిలో ఉన్న మహిళలు – ముఖ్యంగా అవ్యవస్థీకృత రంగంలో ఉన్న వారు కనీసం ఒక్క రోజు కూడా వేతనంతో కూడిన ప్రసూతి సెలవు పొందడానికి అర్హులు కారు. పట్టణ ప్రాంతంలో అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న విద్య, ఆదాయ స్థాయి ఎక్కువగా ఉన్న – వివాహితులైన మహిళా ఉద్యోగులు కూడా పిల్లలు పుట్టాక–వారిని చూసుకో డానికి ఎవరూ లేని కారణంగా – తమ ఉద్యోగాలను ఒదులుకుంటున్నారు. ప్రసూతి ప్రయోజనాలు మహిళా ఉద్యోగులందరికీ విస్తరించాలి. చట్టాన్ని చిత్తశుద్ధితో అమలుచేయాలి. అదీ ఇప్పుడు కావాల్సింది. దీనితోపాటు క్రెచ్ సదుపాయం అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. అది వారి జీవితంలోని సవాళ్ళను ఉద్యోగం ద్వారా ఎదుర్కోగలుగుతారు. మహిళా సిబ్బంది తక్కువగా ఉండటానికి కారణాల్లో ఒకటి – వారికి అనుకూలమైన ఉద్యోగాలు లేకపోవడం. అంటే – వారు చేయగలిగిన ఉద్యోగాలకు, వారికి అందుబాటులో ఉన్న ఉద్యోగాలకు మధ్య పొంతన లేకపోవడం. మహిళల విద్య, ఉపాధి – రెండూ "U" ఆకారానికి చెరోవైపునా ఉన్నట్లు ఉంది. మధ్య స్థాయిలో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాల రేటు చాలా తక్కువగా ఉంది. అందువల్ల మహిళలకు మాధ్యమిక విద్య, తృతీయ విద్య, వృత్తి, నైపుణ్యాల శిక్షణలో మరింత ఎక్కువగా పెట్టుబడులు పెట్టవలసిన అవసరం ఉంది. అదేవిధంగా, వివిధ విద్యా అర్హతలు, నైపుణ్యాలకు తగినట్లుగా – మహిళలకు – ఉపాధి అవకాశాలను కల్పించాలి. తక్కువ వేతనాలు, పని పరిస్థితులు సరిగా లేకపోవడం – మహిళలను నిరుత్సాహపరిచే అంశాలుగా ఉన్నాయి. ఫలితంగా – ఇంట్లో స్థోమతను బట్టి మహిళలు ఉద్యోగాలను వదిలివేస్తున్నారు. అప్రెంటీషిప్ చట్టం (ది అప్రెంటీషిప్ (సవరణ) చట్టం, 2014) కు చేసిన నూతన సవరణ ప్రకారం – యజమానులు పెద్ద సంఖ్యలో – పొడిగించిన కాలానికి అప్రెంటీసీలను చేర్చుకోవచ్చు. వారి విచక్షణతో పని గంటలను నిరయించవచ్చు, పెంచవచ్చు. దీంతో కార్మికులకు పని పట్ల నిరుత్సాహం ఏర్పడుతోంది.

ప్రాంతాల వారీగా, సమాజాల వారీగా వ్యత్యాసాలు ఉన్నపటికీ – సామాజిక, సాంస్కృతిక అవరోధాల వల్ల ఇప్పటికీ మహిళలు తక్కువ సంఖ్యలో ఉద్యోగాల్లో చేరుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలవారు తమ బాలికలను చదివించడానికి ఎక్కువగా అంగీకారం తెలియజేస్తున్నప్పటికీ – వారు దాన్ని ఉద్యోగాలు పొందటానికి అర్హతగా భావించడం లేదు. కుటుంబంలో నెలకొన్న పేదరికం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాల్లో చేరేవారిని మినహాయిస్తే – ఈ అడ్డంకులన్నిటినీ అధిగమించి ముందుకు వచ్చే మహిళలు చాలా తక్కువగా ఉన్నారు. ఆ విధంగా, స్పష్టంగా తెలియజేస్తున్న వివరాలను బట్టి – మహిళలు ఎక్కువగా అవ్యవస్థీకృత రంగంలోనూ, ఇంటి పనుల వంటి పాక్షిక నైపుణ్యం లేదా నైపుణ్యం లేని పనుల్లోనూ, వేతనం తక్కువగా ఉండే పనుల్లోనూ, తక్కువ ప్రయోజనాలు లేదా తక్కువ ఉద్యోగ భద్రత గల పనుల్లోనూ ఉపాధి పొందుతున్నారు. మహిళల భద్రత చుట్టూ పెరుగుతున్న ఆందోళన కూడా మహిళా ఉపాధికి ఒక స్పష్టమైన ప్రతిబంధకంగా ఉంది. కర్మాగారాల చట్టం 1948 సవరణల్లో భాగంగా – మహిళలకు రాత్రి పూట షిఫ్ట్‌ను నిషేదించాలన్న విషయం – కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అయితే, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిషేధాన్ని ఇప్పటికే ఎత్తివేశాయి. మహిళలకు పని ప్రదేశంలో భద్రత, సురక్షితమైన రవాణా వంటి అంశాలను సవరణలో పొందుపరిచినప్పటికీ, వీటిపై

సరైన పర్యవేక్షణ లోపించడంతో, వీటికి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వటంలేదు. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల సంఘటనలు పెరగడంతో – ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలు, నగరాలు, పట్టణాలు ఇలా ఎక్కడా రక్షణ లేదన్న అభద్రతాభావానికి ఆజ్యం పోసినట్లు అవుతోంది. ఇవన్నీ కలిసి మహిళలు ఉద్యోగంకోసం ఎక్కడికీ వెళ్లకుండా చేస్తున్నాయి. ఇటువంటి అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో – మహిళా కార్మికులు – ఈ సమస్యలన్నింటిపైనా గళమెత్తి అనేక నిరసనలు తెలియజేయడంతో – సాధికారత సూచనలు కనబడుతున్నాయి. మహిళల భాగస్వామ్యంతో పనిచేసే వారికంటే కార్మిక సంఘాలతో పనిచేసే వారి సంఖ్యే చాలా ఎక్కువగా ఉంది. కార్మిక సంఘాలు గల రెండు రంగాలను ప్రముఖంగా చెప్పుకో వచ్చు. ప్రభుత్వ పథకాల్లో పనిచేసేవారు, ఇళ్లల్లో పనిచేసేవారు. (ఇవి కూడా ఎక్కువగా మహిళలు మాత్రమే ఉన్న రంగాలే). వీటిలో అంగన్‌వాడీ కార్యకర్తలు చాలా కాలం నుంచీ సంఘటితమై ఉన్నారు. కాగా ఇళ్లల్లో పనిచేసే కార్మికులు ఇప్పుడు కొత్తగా, విస్తృతమైన విధానాల ద్వారా – తమ పనికి తగ్గ ప్రతిఫలం లభించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**ముగింపు వ్యాఖ్యలు :**

మహిళల ఉపాధి సమస్య ను పరిష్కరించేందుకు కేవలం తాత్కాలిక ప్రతిపాదనలు, చర్యలు తీసుకునే బదులు – రాష్ట్రాలు, యజమానులు ఒక ప్రాధాన్యతా ప్రాతిపదికన కలిసి – ఈ విషయమై – ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనవలసిన సమయం ఆసన్నమైంది. కార్మిక చట్టాలకు భారీ సవరణలు పరిశీలనలో ఉన్నాయి. ఈ సవరణల్లోని లింగ వివక్ష ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంది. ■

## ప్రసూతి సెలవు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవును 26 వారాలకు పెంచిన సంగతి తెలిసిందే. అయితే, ఇక్కడ మనం జాగ్రత్త పడవలసిన అంశమేమంటే ఈ సెలవును వినియోగించుకునేవారిపై అనుమానం వస్తే సంబంధిత విభాగాలు నిఘా పెట్టవచ్చు. ఏవైనా తేడాలు బయట పడితే ఆ ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలతోపాటు తీవ్రతను బట్టి క్రిమినల్ కేసులు కూడా పెట్టవచ్చని కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ హెచ్చరించింది.

## కొబో యుగం

ఇది 'రోబో'ల యుగం. అభివృద్ధి చెందిన దేశాలలో పెద్ద పారిశ్రామిక వేత్తలు కొన్ని కీలక బాధ్యతలకు రోబోలనే వినియోగిస్తున్నారు. కొందరు సాంకేతిక మేధావుల మనసులలో భవిష్యత్తులో ఈ రోబోలు కార్మికుల స్థానాన్ని ఆక్రమిస్తాయేమోననే శంక ఉదయించింది. అంటే మానవులకు ఉపాధి అవకాశాలు తగ్గటమే గదా! ఇది రోబోలు క్రమంగా కొలిగులుగా అవతరించే యుగం కనుక వారిని కొబోలనవచ్చునేమో!

### పాఠకులకు మనవి

**యోజన తెలుగు మాసపత్రిక పాఠకుల స్పందనలను ఆహ్వానిస్తోంది. యోజన పాఠకులు, చందా దారులు, శ్రేయోభిలాషులు పత్రికలో వచ్చే వ్యాసాలపై తమ సందేహాలు, సూచనలు, స్పందనను లేఖలు, ఈ–మెయిల్ (yojana_telugu@yahoo.co.in), ట్విట్టర్ (@TeluguYojana)ల ద్వారా తెలియచేయగలరు. యోజన నాణ్యతను మరింత మెరుగు పరచడానికి మీ స్పందన మాకు ఎంతో ఉపకరిస్తుంది.**

**The Editor,**
**Yojana (Telugu), Room No. 205,**
**Second Floor, CGO Towers;**
**Kavadiguda, Hyderabad - 500 080.**

– ఎడిటర్, యోజన

# బాలకార్మిక సంస్కరణలు - విశ్లేషణ



**బాలకార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986 ద్వారా 18 వృత్తులు మరియు 65 ప్రక్రియల్లో 14 ఏళ్ళలోపు బాలలను నిషేధించడం జరిగింది. దీన్ని2016లో చేపట్టిన సవరణతో బాలలు మరియు కిశోర కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986 ద్వారా ఏ వృత్తి లేదా ఉపాధిలో 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో తీసుకోవడాన్ని పూర్తి నిషేధించారు. ఈ చట్టం పద్నాలుగు ఏళ్లు పూర్తయి, పద్దెనిమిదేళ్లు నిండని వారిని కిశోరులుగా నిర్వచించింది.**

బాల కార్మిక చట్టం అనే ఇరుసు చుట్టూ లేత వయస్సులో కఠోర శ్రమ చేస్తున్న ఒక వర్గం యొక్క సమస్యల పరిష్కార వ్యూహాలు పరిభ్రమిస్తుంటాయి. చట్టాలు ఎల్లప్పుడు సాంఘిక కట్టుబాట్లు, ప్రజల ప్రవర్తన, వారి ఆలోచన, చర్యలు, ఆచార, సంప్రదాయాల నుండి ఉద్భవించే సాంఘిక దురాచారాలను రూపుమాపే సాధనంగా కూడ చూడబడ్డాయి. సామాజిక-ఆర్థిక వస్త్రంలో దృఢంగా అల్లుకుని సంక్లిష్ట సమస్యగా ఉన్న బాల కార్మిక వ్యవస్థలో చట్టం జోక్యం చేసుకోవడం అత్యవసరం. భారత దేశంలో జాతీయ బాల కార్మిక విధానం తన మూడు అంశాల్లో సాధారణ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రత్యేకంగా గుర్తించిన ప్రమాదకర వృత్తులలో బాలకార్మిక నిర్మూలనకు లక్షించింది. చట్టం లొసుగులు, నిబంధనల నడలింపులు లేని సమర్థవంతమైన ఆయుధంగా ఉండాలి. ఇది సమర్థవంతంగా అమలుకు నోచుకునేదై ఉండాలి. బాలకార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986ను 2016లో సవరించి ప్రాథమికంగా అన్ని వృత్తులు మరియు ప్రక్రియల్లో బాలలను నిషేధించడంతో పాటు వారిని ఉచిత మరియు నిర్బంధ విద్య చట్టం, 2009 ప్రకారం పాఠశాలల్లో చేర్పించే సదుపాయం కల్పించారు. అలాగే ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియల్లో కిశోర ప్రాయంలో ఉన్న వారికి ఉపాధి కల్పించడాన్ని నిషేధించడంతో పాటు, అంతర్జాతీయ కార్మిక సంస్థ కన్వెన్షన్ 138 మరియు కన్వెన్షన్ 182లకు అనుగుణంగా కిశోర కార్మికుల పని నిబంధనలు మార్పు చేయడానికి యత్నించారు. ఐఎల్ఓ తీర్మానం 138 అనేది కనీస వయస్సు ఒప్పందం. దీని ప్రకారం పనిలో ప్రవేశించే కనీస వయస్సు నిర్బంధ విద్య పూర్తయిన వయస్సు కంటే తక్కువ ఉండరాదు. అంటే 15 ఏళ్లకు తక్కువ ఉండరాదు. అలాగే ఐఎల్ఓ కన్వెన్షన్ నెంబరు 182 అనేది "అధ్వాన స్థాయిలో బాలల శ్రమ" గురించి చెబుతుంది. ఇందులో అధికరణ ఒకటి ప్రకారం అధ్వాన స్థాయిలో ఉన్న బాల కార్మిక వృత్తులను తక్షణమే రద్దు చేయడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ వ్యాసంలో భారతదేశంలో బాలలు పనిచేసే పరిస్థితుల దృష్టికోణంలో బాల కార్మిక చట్టంలో ఇటీవల చేపట్టిన సంస్కరణలపై చర్చించడం జరిగింది.

**హెలెన్ ఆర్. శేఖర్,** సీనియర్ ఫెలో, వి.వి.గిరి జాతీయ కార్మిక సంస్థ, నోయిడా.
E-mail: helensekar@gmail.com

బాలకార్మికులు అనే పదం ఒకదాని కొకటి వ్యతిరేకంగా ఉద్భవించిన కవల పదాలు. 'బాల' అనే మాట అమాయకత్వం మరియు సున్నితత్వానికి ప్రతీకగా నిలుస్తుండగా, మరోవైపు 'కార్మిక' అనే పదం పని మరియు శ్రమను సూచిస్తుంది. అన్ని కాలాల్లో బాల కార్మికులు ఉన్నట్టు చరిత్ర చెబుతోంది. పనిద్వారా పిల్లలు నమ్మకం మరియు స్వీయ గౌరవం పొందడమే కాకుండా ఇది సాంఘికీకరణ ప్రక్రియకు దోహదమవుతుందనే నమ్మకం ఉంది. లేత వయస్సు నుండి నైపుణ్యం పొందడం ద్వారా సంప్రదాయ నైపుణ్యాలు సంరక్షింప బడడంతో పాటు నైపుణ్యాలు ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తాయి.

అయితే బాలల మానసిక మరియు శారీరక ఆరోగ్యాన్ని కోల్పోయే పరిస్థితుల్లో ఎక్కువ గంటలు పని చేయడం జరుగుతుండడంతో దీనిలోని గుణాత్మకత లోపిస్తోంది. బాల్యం తన విద్యా మరియు ఇతర హక్కులూ కోల్పోతోంది.

తల్లిదండ్రుల రుణం తీర్చడానికి బాలలు కార్మికులుగా మారి తక్కువ వేతనాలకే పని చేయాల్సి వస్తోంది. బాలకార్మికుల్లో చెల్లింపు/చెల్లింపు లేని బాల కార్మికులు, కట్టుబానిసలు, కుటుంబంతో కలిసిపోయి పని చేసే బాలకార్మికులు, స్వయం ఉపాధి బాలలు, గృహ/పరిశ్రమ పనులు చేసే బాలలు, వలస/వలసేతర బాల కార్మికులు తదితర రకాలు మనకు కనిపిస్తాయి. వివిధ విశ్లేషణలు, మూలాల్లో వివిధరంగాల్లో అసంఘటిత ఆర్థిక వ్యవస్థలైన వ్యవసాయం, పశు పోషణ, అటవీ, తయారీ, ఆహారోత్పత్తులు మరియు ఇతర సేవా రంగాల్లో బాల కార్మిక వ్యవస్థ మనకు కనిపిస్తుంది.

కొన్ని వృత్తుల్లో మొదటి నుంచి చివరి వరకూ అన్ని ప్రక్రియల్లో బాల కార్మికుల తోడ్పాటు కనిపిస్తోంది. ముడి పదార్థాలు సేకరించడం నుండి వస్తు ఉత్పత్తి వరకూ వారి తోడ్పాటు ఉంటోంది. ఆర్థిక రంగాలతో సంబంధంలేకుండా అన్ని చోట్ల బాలలు అనారోగ్యకరమైన పరిస్థితులు మరియు విష రసాయనాల భారిన పడుతున్నారు. వివిధ తయారీ యూనిట్లలో పని చేస్తున్న బాలలు ధాతువులు మరియు ధూళి బారిన పడుతున్నారు. ఉధాహరణకు సిలికోసిస్ (గాజు తయారీ), ఆస్బెస్టోసిస్ (సిమెంట్ పలక తయారీ),ఆస్త్మా (పట్టు, వస్త్ర, కార్పెట్), క్షయ (బీడి తయారీ), ధనుర్వాతం (చెత్త సేకరణ), కంటి వ్యాధులు (ఎంబ్రాయిడరీ) తదితర వ్యాధులకు గురవుతున్నారు. ఉదాహరణకు ఇత్తడి పరిశ్రమలో ఇత్తడి మౌల్డ్ కొలిమి ప్రక్రియను పరిశీలిస్తే...ఈ కొలిమిలో పని చేసే బాల కార్మికులు కొలిమి నిరంతరం వెలుగుతూ ఉండడానికి చేతితో చక్రం తిప్పుతూ ఉండాలి మరియు కొలిమి క్రింద భూగర్భంలో ఉండే మరుగుతున్న లోహాన్ని పరిశీలించి రసాయనాలు వేస్తూ ఉండాలి. రసాయన పొడి కలిపిన ఇత్తడి కాస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటే, కొలిమి ముఖద్వారం నుండి వచ్చే నీలం మరియు ఆకుపచ్చ జ్వాలలను గమనించి పట్టకార సహాయంతో మూసతో మరుగుతున్న లోహాన్ని అచ్చుల్లో పోయడంలో పెద్దలకు సహాయం చేయడం జరుగుతోంది. బాలలు ఎటువంటి పాదరక్షలు లేకుండానే ఈ ప్రక్రియలు చేస్తుంటారు. సుమారు 1100 డిగ్రీల సెల్సియస్ వేడి ఉన్న ఈ కొలిమి వద్ద పని చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రమాదకర విషవాయువులను పీల్చాల్సి ఉండడంతో పాటు కాలిపోయే ప్రమాదం కూడా ఉంది. మౌల్డ్‌లలో లోహం వేసేటప్పుడు కాలిపోవడం, కళ్లకు ప్రమాదాలు జరగడం, జారిపడిపోవడం, నిరంతరం చక్రం పట్టుకోని ఉండడం వల్ల చేతి వేళ్ల నొప్పులు, పాలిషింగ్ చేయడం ద్వారా వచ్చే ధూళితో శ్వాస సంబంధిత వ్యాధులైన అంకెలోసిస్, స్పాండలైటిస్ మరియు శాశ్వత వెన్నువైకల్యాలకు గురవుతున్నారు. పాలిషింగ్, ఎలక్ట్రోప్లేటింగ్, స్ప్రే పెయింటింగ్, తాళాల తయారిలో బాల కార్మికులు వృత్తిపరమైన ప్రమాదాలకు గురవుతున్నారు. గ్లోబల్ సప్లయి గొలుసులో బాల కార్మిక వ్యవస్థ అనుపానులు తెలుసుకోవడంపై దృష్టిసారించాలి. ఇది బాలల సర్వోముఖ అభివృద్ధికి నిరోధకంగా ఉంది.

రాజ్యాంగంలోని అధికరణాల్లో స్పష్టీకరించిన విధంగా భారత ప్రభుత్వం కూడా బాల కార్మిక సమస్యను పరిష్కరించ డానికి క్రియాశీలంగా పని చేస్తోంది. వివిధ కార్మిక చట్టాలను ఎప్పటికప్పుడు బాలలకు అనుగుణంగా సవరణలు చేయడం జరిగింది. బాల కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడంతో పాటు, జాతీయ బాల కార్మిక విధానం యొక్క లక్ష్యాలను మరియు ప్రాధాన్యతలను సాధించడానికి వనరులనూ కేటాయించింది. ఈ విధానం ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియల్లో పని చేస్తున్న బాలల పునరావాసాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక క్రమమైన మరియు నిరంతర విధానం ఉండేలా ప్రయత్నిస్తుంది. ప్రభుత్వం పని నుంచి విముక్తి పొందిన మరియు రక్షించబడిన బాలల పునరావాసం కోసం వివిధ పథకాలను అమలు చేస్తోంది. పునరావాస ప్రాజెక్టుల తయారీ మరియు వాటి ప్రణాళిక, అమలు మరియు పర్యవేక్షణకు ఒక ప్రత్యేక కార్యదళాన్ని (టాస్క్ ఫోర్స్) ఏర్పాటు చేసింది.

బాలల విద్య హక్కు చట్టం 2009 (రైట్ ఆఫ్ చిల్డ్రన్ టూ ఫ్రీ అండ్ కంపల్సరీ యాక్ట్,2009) ద్వారా, భారత ప్రభుత్వం విద్యా హక్కును బాలల ప్రాథమిక హక్కుగా మార్చుచేసింది. 6-14 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలలందరికి ఉచిత మరియు నిర్బంధ విద్య అందించడం జరుగుతోంది. బాల

కార్మిక విధానం యొక్క పురోగతి బాలల పాఠశాల హాజరును పెంచడమే కాకుండా, బాల కార్మికుల సంఖ్య 2001లో 12.7 మిలియన్లు ఉండగా, 2011 నాటికి 10.1 మిలియన్లకు తగ్గించడంలో ప్రతిబింబిస్తుంది. జాతీయ సాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) నివేదిక ప్రకారం బాల కార్మికుల సంఖ్య 2009-10లో 9.07 మిలియన్లు ఉండగా, 2004-05 నాటికి 4.98 మిలియన్లకు తగ్గింది.

బాలకార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986 ద్వారా 18 వృత్తులు మరియు 65 ప్రక్రియల్లో 14 ఏళ్ళలోపు బాలలను నిషేధించడం జరిగింది. దీన్ని2016లో చేపట్టిన సవరణతో బాలలు మరియు కిశోర కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986 ద్వారా ఏ వృత్తి లేదా ఉపాధిలో 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో తీసుకోవడాన్ని పూర్తి నిషేధించారు. ఈ చట్టం పద్నాలుగు ఏళ్లు పూర్తయి, పద్దెనిమిదేళ్లు నిండని వారిని కిశోరులుగా నిర్వచించింది. 18 ఏళ్ళలోపు బాలలు ఫ్యాక్టరీస్ చట్టం1948లో నిర్దేశించిన విధంగా గనులు, పేలుడు, విపత్తు గల వృత్తులు లేదా ప్రక్రియల్లో పూర్తిగా నిషేధించబడ్డారు. చట్టంలోని ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియలను సమీక్షించ డానికి సాంకేతిక సలహా కమిటీ (టిఏసి)ని నియమించడం జరిగింది. ఈ కమిటి రెండు భాగాలుగా తన నివేదికను సమర్పించింది. పార్ట్ 'ఏ' భాగంలో ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియల్లో కిశోరులు పని చేయడాన్ని నిషేధించడాన్ని పొందుపరిచారు. అలాగే పార్ట్'బి'లో ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియల్లో పిల్లల సహకారం తీసుకోడాన్ని నిషేధించ డాన్ని పొందుప రిచారు. పార్ట్ 'ఏ' లో తొమ్మిది కేటగిరీల వృత్తులు మరియు ప్రక్రియలు తెలుప బడ్డాయి. ఇందులో భూగర్భ మరియు నీటి సంబంధిత పనులను పేర్కొన్నారు. అలాగే ప్రమాదకర ప్రక్రియలున్న పరిశ్రమల జాబితాను పొందుపరిచారు. సిఫార్సు జాబితాలో ఫెర్రస్ మరియు నాన్-ఫెర్రస్ లోహశోధన, రసాయన పరిశ్రమలు, కర్మాగారాలు, విద్యుత్ తయారీ పరిశ్రమలు, సిమెంట్, రబ్బరు, పెట్రోలియం, మూడు రకాల ఎరువుల పరిశ్రమలు, ఔషధ మరియు మందుల పరిశ్రమలు, కాగితం గుజ్జు, పెట్రో రసాయన పరిశ్రమలు, రంగులు మరియు వర్ణద్రవ్యాలు, విద్యుత్, లెదర్ టానింగ్, కిణ్వనప్రక్రియ, గాజు మరియు పింగాణీ, పశువధశాలలు, నిర్మాణ పరిశ్రమ మొదలైనవి ఉన్నాయి.

పాఠశాల సమయం తర్వాత, సెలవుల్లో, వారి వారి కుటుంబాలు లేదా కుటుంబం సంస్థల్లో బాలలు సహకరించ డానికి మినహాయింపులు ఇచ్చారు. ఈ చట్టంలో కుటుంబం అర్థం బాలల తల్లి, దండ్రులు, సోదరుడు, సోదరి మరియు తండ్రి యొక్క సోదరి మరియు సోదరుడు, తల్లి సోదరి మరియు సోదరుడు. అలాగే పాఠశాల యొక్క నిర్వచనం విద్యా హక్కు చట్టం, 2009లో చెప్పబడిన "స్కూల్" 'షెడ్యూల్ ప్రమాణములు మరియు నిమయాలకు అనుగుణంగా ఉండాలి. అలాగే 'సహాయం' కూడా పూర్తిగా స్వచ్ఛందంగా మరియు ప్రమాదకర వృత్తులు లేదా ప్రక్రియల్లో 'ఉపాధి' కాకుండా ఉండాలి. ఎటువంటి సందర్భాలలో బాలల విద్య ప్రభావితమవ్వరాదు.

బాలలు మరియు కిశోర కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, 1986 ఉల్లంఘనులను కఠినంగా శిక్షిస్తుంది. ఇందులో సెక్షన్ 3 లేదా 3 ఏ ప్రకారం ఒక యజమాని శిక్షించతగిన నేరానికి పాల్పడితే ఆరు నెలలకు పైబడి లేదా రెండేళ్ల వరకూ కారాగార శిక్ష ఉంటుంది. లేదా శిక్ష లేదా జరిమానా రూ.25 వేల నుంచి రూ. 50 వేల వరకూ జరిమానా విధించబడతాయి. ఒకే విధమైన నేరాన్ని పునరావృతం చేస్తే ఏడాది నుంచి మూడేళ్ల వరకూ కారాగార శిక్షా విధించవచ్చు. ఈ సిఏఎల్పిఆర్ చట్టం సెక్షన్ 3 లేదా 3 (ఏ) లకు విరుద్ధంగా బాలలను వాణిజ్య ప్రయోజనాల కోసం అనుమతించే తల్లిదండ్రులు మరియు సంరక్షకులనూ శిక్షించవచ్చు. మొదటి పర్యాయం నేరానికి శిక్ష లేనప్పటికీ రెండోసారి నేరం చేస్తే తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు పదివేల రూపాయల వరకూ జరిమానా విధిస్తారు. ఈ చట్టం పని ప్రదేశం నుంచి రక్షించబడిన బాలలు మరియు కిశోరులకు పునరావాసం కల్పించడానికి చైల్డ్ అండ్ అడోలెసెంట్ లేబర్ రీహెబిలిటేషన్ ఫండ్ను ఏర్పాటు చేసింది. ఈ చట్టం సక్రమంగా అమలు పర్చడానికి జిల్లా మెజిస్ట్రేట్లకు అధికారాలు కల్పించడానికి ప్రభుత్వాలను ఆదేశించింది. అలాగే నియమిత తనిఖీలు మరియు పర్యవేక్షణకు ప్రభుత్వం చర్చలు తీసుకోవాలని సూచించింది. ఈ బాల కార్మిక చట్టం సవరణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం పద్నాలుగేళ్లలోపు వయస్సు ఉన్న బాలు లందరూ పాఠశాలల్లో చేరడంలో జోక్యం చేసుకోవడంతోనే సఫలీకృతమవుతుంది. అలాగే బాల కార్మికుల గుర్తించి, రక్షణతో పాటు వారిని విద్యా సంస్థల్లో పునరావాసం కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక పునరావాసం కల్పించాల్సి ఉంది. అలాగే వలస మరియు అంతరించిపోతున్న సామాజిక వర్గాల్లో వృత్తి నైపుణ్యాలు పెంపొందింపజేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర వాటాదారులకు అవగాహన పెంపొందిం చడం, శిక్షణ, సామర్థ్య పెంపు మరియు సామాజిక పరివర్తన ద్వారా భారతదేశంలో బాలకార్మిక చట్టలను సమర్థవంతంగా అమలు చేయగలం. ■

నూతన అవకాశాలు

# యంత్ర యుగం



**నైపుణ్యాలేమీ అవసరం లేకుండా కేవలం మానవ శ్రమతో చేసే పనులు, ప్రమాదకరమైన ప్రదేశాల్లో చేసే పనులకు యంత్రాలను వినియోగించడం మంచిది. సమగ్ర ఆర్థికాభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం సాంకేతికతను అందిపుచ్చుకోవడం తప్పనిసరి. నిరంతర వ్యాపారాభివృద్ధి కోసం నైపుణ్యాలను పెంపొందించుకోవడం, తిరిగి శిక్షణ పొందడం కీలకమైనవి. ఇందుకోసం మన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలలో మార్పులు చేసి మరిన్ని వృత్తి విద్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యంత అవసరం.**

గత రెండు దశాబ్దాల కాలంలో తయారీ రంగం గణనీయమైన వృద్ధిని సాధించింది. సాంకేతికత, ప్రపంచీకరణ, వేగవంతమైన సమాచార వ్యవస్థలో మార్పుల వల్ల వస్తువుల తయారీ, సేవలు, వాటి వితరణలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అనేక రంగాల్లో, మానవశ్రమ స్థానంలో యంత్రాలు వచ్చేశాయి. జ్ఞాన సంబంధమైన నైపుణ్యాలను కూడా యంత్రాలు ప్రదర్శిస్తున్నాయి. సుదీర్ఘకాలంలో యాంత్రీ కరణ ప్రభావం మరింత ఎక్కువగా ఉండనున్నది. దీని వల్ల నైపుణ్యాలు లేని శ్రామికులకు నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదముంది. యాంత్రీకీకరణ వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగు తున్నాయి. వ్యవసాయ రంగం, తయారీ రంగం, వస్తువుల పంపిణీ నిర్వహణ లో మౌలిక మైన మార్పులు చోటు చేసుకుంటు న్నాయి. ఉత్పాదకత ను పెంచేందుకు ఎక్కువ కార్మిక శక్తి అవసరమైన చోట రోబోలు రానున్నాయి. నిజానికి, వినూత్న అన్వేషణలు, అధిక ఉత్పాదకతకు అవసర మైన ఉద్యోగాల కల్పనకు మానవ వనరులను వినియోగించుకునేలా యాంత్రీకరణ ఒక అవకాశాన్ని కల్పిస్తున్నది. ఇందులో సాంకేతికతను అందిపుచ్చుకోవడం, దానికి అలవాటు పడడమే కీలకం. కార్మిక శక్తి, యంత్రాలు రెండూ పరస్పరం పోటీపడే విరుద్ధమైన వర్గాలుగా భావించవలసిన అవసరం లేదు. యాంత్రీకరణ, ఉత్పాదకత, ఉపాధి కల్పన వీటి నిరంతర సమన్వయం కోసం ప్రణాళికలు రూపొందించవలసిన అవసరం వుంది.

**సాంకేతికత తీరుతెన్నులు:**

గత దశాబ్దంలో వివిధ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనడంలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం అగ్రగామిగా నిలిచింది. అత్యంత వేగవంతమైన సమాచార వ్యవస్థ ద్వారా అందుబాటులోకి వచ్చిన డేటాతో ఉత్పాదకతను విశ్లేషించడానికీ, అవస రాలను తెలుసుకోవడానికీ, ఉత్పత్తి పంపిణీ లోటుపాట్లను తెలుసుకొనే అవకాశం కలుగుతోంది. అత్యంత వేగవంతమైన అంతర్జాలం సహకారంతో దూరం నుంచి కూడా యంత్ర పరికరాలను నియంత్రించ గలుగుతున్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ ఓ టి) వంటి విప్లవాత్మక ఆవిష్కరణలు జరిగిన ప్రస్తుత సమయంలో

**రింటూ నాథ్,** శాస్త్రవేత్త-ఎఫ్, విజ్ఞాన్ ప్రసార్, కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం, న్యూ ఢిల్లీ.
E-mail: Rnath@vigyanprasar.gov.in

వాషింగ్ మెషీను మొదలు కొని కాఫీ మెషీను, విద్యుద్దీపం, కారు, విమాన ఇంజనుతో సహా అనేక యంత్రాలను ఐఓటి ద్వారా నియంత్రించ గలుగుతున్నారు. ఒక అంచనా ప్రకారం 2020 నాటికి ప్రజలతో సహా 26 బిలియన్ల పరికరాలు ఒక భారీ నెట్‌వర్క్‌తో అనుసంధానం కలిగి వుంటాయి. ఇక రాబోయే రోజుల్లో మెషీను-ప్రజలు, మెషీను-మెషీను, ప్రజలు-ప్రజలకు మధ్య సంబంధాలుంటాయి. నిజానికి త్వరలో ప్రారంభంకానున్న స్మార్ట్ సిటీల రూప కల్పనలో ఐ ఓ టి ఒక ముఖ్య పాత్ర వహించ నున్నది. ప్రస్తుతం కర్మాగారాలు, తయారీ రంగంలో పారిశ్రామిక, యాంత్రిక రోబోలు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. సాధారణంగా మనుష్యులు పని చేయడానికి వీలు లేని ప్రమాదకరమైన ప్రదేశాల్లో రోబోలను వినియోగిస్తున్నారు. ఎటువంటి లోపాలు లేకుండా అత్యధిక ఉత్పాదకత సాధించాల్సిన పరిశ్రమల్లో కూడా రోబోలను ఉపయోగిస్తున్నారు.

**కార్మికుల పై ప్రభావం:**

సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్న తయారీ సంస్థలు ఆర్థిక అవకాశాలను ప్రోత్సహించడంలోనూ, ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడంలో ఎంతో తోడ్పడతాయి. ప్రపంచవ్యాప్తంగా వున్న అనేక పారిశ్రామిక సంస్థలు అధిక ఉత్పాదకతను సాధించడానికి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికీ నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చు కుంటున్నాయి. యంత్రాల వినియోగం వల్ల ప్రమాదకరమైన పని ప్రదేశాల్లో ఇబ్బందులను తగ్గించవచ్చు. అయితే, యంత్రాల వినియోగంవల్ల పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయే పరిస్థితులు కూడ ఎదురుకావచ్చు. తయారీరంగంలోనూ, వ్యవసాయ రంగంలోనూ నైపుణ్యాలు లేని కార్మికులు, పనివారు పెద్ద సంఖ్యలో తమ ఉపాధి కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చు. అనేక దేశాల్లో కార్మికుల వాటా తగ్గిపోతోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2015లో జి-20 ఏంప్లాయిమెంట్ వర్కింగ్ గ్రూప్ కు సమర్పించిన నివేదికలో పేర్కొంది. 1990 -2009ల మధ్య అభివృద్ధి చెందిన 30 దేశాలకుగాను 26 దేశాల్లో జాతీయ ఆదాయం లో కార్మికులకు ఇచ్చే పరిహారం వాటా తగ్గిందని తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ పరిస్థితి అస్పష్టంగా వుంది. అయితే, అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే, ఆసియా, ఉత్తర ఆఫ్రికా లోని పలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కార్మికుల ఆదాయం తగ్గుదల ఎక్కువగా కనిపిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ పేర్కొంది. అనేక అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో కార్మికుల వాటాతగ్గి పోతూ వుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**అభివృద్ధి దిశగా మార్పు :**

సాంకేతికత అభివృద్ధి, వేగవంతమైన మార్పులు ఉపాధి అవకాశాల పై ప్రభావం చూపుతాయి. యంత్రాల వల్ల కొన్ని ఉపాధి అవకాశాలు తగ్గిపోవచ్చు. కానీ, ప్రస్తుతమున్న ఉద్యోగాల్లో కొన్ని మార్పులు జరుగుతాయి. సాంకేతికత వల్ల డిజైనింగు, తయారీ రంగం, రోబోల నిర్వహణ తదితర రంగాల్లో కొన్నిమిలియన్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని ఆశిస్తున్నారు. కొత్త వ్యాపార ధోరణుల వల్ల ఇతర ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అయితే, సరైన నైపుణ్యాలు లేకపోతే ఈ ఉద్యోగాలు పొందడం కష్టం. ఉద్యోగాల తరహా, అవి అందుబాటులో వుండే ప్రదేశాలు మారడం వల్ల శ్రామికులు పెద్దసంఖ్యలో వలస వెళ్లే అవకాశ ముంటుంది. వ్యవసాయ రంగంలో, తయారీ రంగంలోనూ కీలక పాత్ర పోషిస్తున్న మహిళా శ్రామికులకు ఈ మార్పుల వల్ల ఇబ్బందులు ఏర్పడతాయి. ఇందుకు తగినట్లుగా సాంకేతికతలో మార్పులు చేసి దాన్ని మహిళా శ్రామికులకు అందుబాటు లోకి తీసుకురావాల్సిన అవసరముంది.

**సామాజిక సమానత్వం :**

సాంకేతికత వల్ల ఎక్కువ నైపుణ్యత అవసరమున్న ఉద్యోగాలు పెరగడంతో పాటు ప్రస్తుతమున్న ఉద్యోగాల నాణ్యత కూడ పెరుగుతుంది. దీనితో ఉత్పాదకత పెరిగి వేతనాల పెరుగుదలకు అవకాశమేర్ప డుతుంది. మారుతున్న సాంకేతికత పరిస్థితులకు అనుగుణంగా శ్రామికులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవలసిన అవసరముంది. తయారీ రంగంలో శ్రామికులు అత్యధిక వేతనాలు పొందగలిగేలా ఉత్తమ నైపుణ్యాలను కలిగి వుంటే వారు ఎక్కువ ఆదాయం పొందుతారు. దీంతో వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి. సాంకేతిక అభివృద్ధి వల్ల ఏర్పడే కొత్త ఉద్యోగాలతో సామాజిక అవరోధాలు తొలగిపోయి లైంగిక సమానత్వం ఏర్పడుతుంది. ఉదాహరణకు కొన్ని ఉద్యోగాల్లో పురుష కార్మికులే పని చేయగలరని భావిస్తుంటారు. ఇందులో మార్పుల వల్ల ఇటువంటి అవరోధాలు తొలగిపోతాయి.

**సవాళ్ళు :**

కొత్త కొత్త సాంకేతిక ఆవిష్కరణల ప్రయోజనాలను ప్రజలు వినియోగించుకు నేలా చేయడం ఏవ్యాపారానికైనా ఎంతో మేలు చేస్తుంది. యంత్రాల సహకారంతో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకొని, నిరంతర ప్రణాళిక లేకుండా మానవ వనరులకు బదులు యంత్రాల ద్వారానే ఉత్పత్తి సాధిస్తా మనుకుంటే అది సుదీర్ఘకాలంలో వ్యాపార రంగంపై ప్రతికూల ప్రభావం చూపు తుంది. ప్రస్తుతమున్న శ్రామికులపై పడే ప్రభావం

*తరువాయి 58వ పేజీలో...*



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1) పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ పురస్కార్ కింద, జాతీయ స్థాయిలో ఇచ్చే బహుమతి ఎంత ఇవ్వ దలిచారు?
   ఎ) రూ. 10 లక్షలు బి) రూ. 25 లక్షలు
   సి) రూ. 2.25 లక్షలు డి) రూ. 5 లక్షలు
2) పంటల పండుగ 'మాఘ్ బిహు' ఏ రాష్ట్రములో జరుపు కుంటారు ?
   ఎ) తమిళనాడు బి) అసోం
   సి) కర్ణాటక డి) మహారాష్ట్ర
3) 2016 సరస్వతి సమ్మాన్ అవార్డు ఎవరికిచ్చారు?
   ఎ) మహాబలేశ్వర్ సాయిల్ (కొంకణి భాషలో 'హాథాన్' అనే నవల రాశారు)
   బి) పద్మ సచ్ దేవ్
   సి) వీరప్ప మొయిలి డి) గోవింద్ మిశ్రా
4) "షాపూర్ కంది డ్యాం" ఏ నది మీద నిర్మిస్తున్నారు? వివరాలేవీ?
   ఎ) రావి నది మీద, గురుదాస్ పూర్ జిల్లాలో నిర్మిస్తున్నారు
   బి) ఎత్తు: 55.5 మీటర్లు
   సి) దీని ద్వారా 5,000 హెక్టార్ల భూమి పంజాబ్‌లోను , 32, 173 హెక్టార్ల భూమి J & K సాగులోకి వస్తుంది, 206 MW విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది
   డి) పైవన్నీ
5) పెర్మనెంట్ ఇండస్ కమిషన్ (PIC) మీటింగ్ ఈ సంవత్సరం ఎక్కడ నిర్వహిస్తారు ?
   ఎ) కాబూల్ బి) లాహోర్
   సి) పెషావర్ డి) కరాచీ
6) ఇండస్ వాటర్ ట్రియాటి (సింధు జలాల ఒప్పందం) ప్రకారం భారత దేశానికీ ఏ దిశలో ఉన్న నదుల నీటి వాడకం పై పూర్తి హక్కులు ఉన్నాయి ?
   ఎ) చీనాబ్
   బి) ఈస్టర్న్ ఇండస్ నదులపై (బియాస్, రావి, సట్లేజ్)
   సి) జీలం డి) కాబుల్ నది
7) అరుణాచల్ ప్రదేశ్ లో 'తేజు' వివరాలేవీ?
   ఎ) ఇక్కడ కమర్షియల్ తేజ్ ఎయిర్ పోర్ట్ నిర్మించారు
   బి) దీనికి దగ్గర లో ప్రవహించే 'లోహిత్' నది మీద 9.15 కి.మి. పొడవైన వంతెన నిర్మిస్తున్నారు
   సి) దీనికి దగ్గరలో పరశురాం కుండ్ ఉంది. ఇక్కడ ఉన్న హిమాలయన్ రేంజ్ దగ్గర ఉన్న 'హంప్', రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ప్రసిద్ధి చెందింది . ఇక్కడే అక్టోబర్ 16, నుండి నవంబర్ 16, 1962 ఇండియా – చైనా సైనికుల మధ్య యుద్ధం జరిగింది. డి) పైవన్నీ
8) విక్రంశిల గాంజెటిక్ డాల్ఫిన్ శాంక్చ్యువరి ఎక్కడుంది?
   ఎ) భోపాల్ బి) భాగల్ పూర్ దగ్గర (బీహార్)
   సి) రాంచి డి) కాశి
9) 29 చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉన్న ట్రంకేట్టీవి ఎక్కడుంది?
   ఎ) లక్ష ద్వీప్ బి) నికోబార్ దీవులలో
   సి) మాల్దీవులు డి) కరిబియన్ దీవులు
10) నాశి II దీవి, గహరి మాత శాంక్చువరి ఏ రాష్ట్రములో ఉంది ?
   ఎ) తమిళనాడు బి) ఒడిశా
   సి) గుజరాత్ డి) కర్ణాటక
11) ది స్పెసిఫైడ్ బ్యాంకు నోట్స్ (సేసేషన్ అఫ్ లయబిలిటీస్) యాక్ట్ 2017 ప్రకారం వ్యక్తులు ఏ పాత నోట్లను 10 కన్నా ఎక్కువ, మరియు అధ్యయనం కోసం 25 కన్నా ఎక్కువ కల్గి ఉండటం వల్ల రూ.10,000 లేక 5 రెట్లు జరిమానా విధించవచ్చును ?
   ఎ) పాత రూ.500 నోటు & పాత రూ.1000 నోటు
   బి) పాత రూ.10,000 నోటు
   సి) పాత రూ. 100 నోటు
   డి) పాత రూ. 50 నోటు
12) ఓకర్ కలర్డ్ పాటరీ (OCP) సంస్కృతి పరిఢవిల్లిన గంగా – యమునా రెండు నదుల మధ్య గల ధోబ్, సహరన్‌పూర్ జిల్లాలో విరివిగా దొరికినవి ఏవి? క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నాటి సంస్కృతి దశను నార్త్ ఇండియన్ తామ్ర యుగం ఆఖరి దశ అంటారు)
   ఎ) రాగి గొడ్డళ్ళు & కుండ పెంకులు
   బి) గవ్వలు సి) ముత్యాలు
   డి) మట్టి బొమ్మలు
13) సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (CSO) లెక్కల ప్రకారం 2016 – 17 (రెండవ అడ్వాన్స్ ఎస్టిమేట్స్ ప్రకారం), భారత దేశానికి చెందిన ఏది కరెక్ట్?
   ఎ) GDP వృద్ధి రేటు : 7.1 %
   బి) GVA వృద్ధి రేటు : 6.7%
   సి) వ్యవసాయ రంగ వృద్ధి రేటు : 4.4 %
   డి) పైవన్నీ
14) CSO లెక్కల ప్రకారం 2016–17లో, సర్వీసెస్ సెక్టార్ వృద్ధి రేటు 7.9% కాగా, భారత దేశ పారిశ్రామిక రంగ వృద్ధి రేటు ఎంత ?
   ఎ) 5.8% బి) 6.9%
   సి) 8.2% డి) ఇవేవి కావు
15) ఇటీవల సార్క్ సెక్రటరీ జనరల్ పదవి కోసం ఏ దేశాన్ని నిర్ధారించారు ?
   ఎ) పాకిస్తాన్ (అమ్జాద్ హుస్సేన్ & సియాల్ ఈ పదవి చేపట్ట వచ్చును)
   బి) నేపాల్ సి) భూటాన్ డి) శ్రీలంక
16) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గంగా నది లీన్ సీజన్ ఫ్లో సమయంలో, నది మధ్య నుండి వంద మీటర్ల వరకు కాంప్పింగ్ ఆక్టివిటీ ఎక్కడ నిషేధించించారు?
   ఎ) శివపురి నుండి రిషికేష్ (ఇక్కడ ఎకో టూరిజం, రాఫ్టింగ్ నిర్వహిస్తూ ఉంటారు)
   బి) కాశి నుండి పాట్నా
   సి) అలహాబాద్ నుండి కాశి
   డి) ఇవేవి కావు
17) బంగ్లాదేశ్‌తో సరి హద్దు గల రాష్ట్రాలు ఏవి?
   ఎ) పశ్చిమ బెంగాల్ ( 2,216.7 కి.మి. )
   బి) అస్సాం(263 కి.మి.) & మేఘాలయ (443 కి.మి.)
   సి) త్రిపుర (856 కి.మి.); మిజోరం 318 కి.మి.)
   డి) పైవన్నీ (సరిహద్దు రేఖ పొడవు బ్రాకెట్లలో, సుమారుగా తెల్పబడింది)
18) ఆర్మీలోకి తీసుకున్న 'స్వాతి' ఏమిటి?
   ఎ) వెపన్ లొకేటింగ్ రాడార్
   బి) 50 కి.మి. దూరంలో ఉన్న ఆయుధాలను పసిగట్టేస్తుంది.
   సి) శత్రువుల గన్స్ ఇట్టే పసిగడ్తుంది.
   డి) పైవన్నీ
19) మాధవ గాడ్గిల్ కమిటీ పశ్చిమ కనుమలలో ఎకలాజికల్ సెన్సిటివ్ ఏరియా (ESA) ఏర్పాటు చేయాలన్నది. డా॥ కస్తూరి రంగన్ కమిటీ, ఎంత ప్రాంతంలో దీన్ని ఏర్పాటు చెయ్యాలన్నది? (చదరపు కి.మి.లలో)

ఎ) 3,117 బి) 60,000
సి) 887 డి) 500

20) 1914 సిమ్లా అగ్రిమెంట్ ప్రకారం ఏ సరిహద్దు రేఖ ఏర్పాటయ్యింది ?
ఎ) రాడ్ క్లిఫ్ లైన్ బి) మెక్ మహోన్ లైన్
సి) డ్యూరాండ్ లైన్ డి) ఇవేవి కావు

21) బండీ పూర్ వద్ద కిషన్ గంగా నది (జీలం నది ఉప నది) మీద నిర్మించే కిషన్ గంగా ప్రాజెక్ట్ వివరాలేవీ?
ఎ) స్థాపిత సామర్థ్యం : 330 MW
బి) ప్రాజెక్ట్ విలువ : రూ. 5,783 కోట్లు
సి) రాష్ట్రము పేరు : J & K
డి) పైవన్నీ

22) రాట్లే ప్రాజెక్ట్ వివరాలేవీ ?
ఎ) దొండా వద్ద , చీనాబ్ నది మీద నిర్మిస్తున్నారు
బి) స్థాపిత సామర్థ్యం : 850 MW
సి) ప్రాజెక్ట్ విలువ : రూ. 6400 కోట్లు
డి) పైవన్నీ

23) క్రీస్తు శకం ఒకటవ శతాబ్దంలో బౌద్ధ సంస్కృతి పరిఢవిల్లిన ఫణిగిరి ఎక్కడుంది?
ఎ) సూర్యపేట జిల్లా, తెలంగాణా రాష్ట్రము
బి) మంచిర్యాల్
సి) ఆదిలాబాద్ డి) భద్రాది

24) యూనివర్సల్ బేసిక్ ఇన్ కం (UBI) గురించిన పుస్తకం "రియల్ ఫ్రీడమ్ ఫర్ ఆల్" రచయిత ఎవరు?
ఎ) ఫిలిప్ వాన్ పారిజ్స్ బి) అరుంధతి రాయ్
సి) అనిత దేశాయ్ డి) కిరణ్ దేశాయ్

25) 2017లో ఇచ్చిన 89వ ఆస్కార్ అవార్డులలో ఏవి కరెక్ట్?
ఎ) ఉత్తమ చిత్రం : "మూన్ లైట్"
బి) ఉత్తమ నటి : కేసీ ఎఫ్లెక్ ( సినిమా పేరు : 'మాంచెస్టర్ బై సీ' )
సి) ఉత్తమ నటి : ఎమ్మా స్టోన్ ( సినిమా పేరు: 'లా లా ల్యాండ్')
డి) పైవన్నీ.

26) ఇటీవల వయోలా దేవిస్‌కు ఏ సినిమాలో నటించినందుకు ఆస్కార్ అవార్డు వచ్చింది ?
ఎ) ఫెన్సెస్ బి) హాక్సా రిడ్జ్
సి) జూటోపియా డి) ఫైపర్

27) మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ మీటింగ్‌లు ఇటీవల ఇక్కడ నిర్వహించారు?
ఎ) న్యూయార్క్ బి) బార్సెలోనా, స్పెయిన్
సి) పారిస్ డి) జెనీవా

28) ఏప్రిల్1, 2017 నుండి SBI లో ఏ బ్యాంకులు విలీనం అయ్యాయి ?
ఎ) స్టేట్ బ్యాంకు అఫ్ హైదరాబాద్ & స్టేట్ బ్యాంకు అఫ్ మైసూరు
బి) స్టేట్ బ్యాంకు అఫ్ పాటియాలా; స్టేట్ బ్యాంకు అఫ్ ట్రావెన్కోర్
సి) స్టేట్ బ్యాంకు అఫ్ బికనీర్ & జైపూర్
డి) పైవన్నీ

29) తెలంగాణా లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఎంత మంది MLC లు ఉంటారు ?
ఎ) 117 బి) 40 సి) 30 డి) 35

30) ప్రపంచంలోనే పురాతనమైన ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ INS విరాట్ వివరాలేవీ?
ఎ) బరువు: 27,800 టన్నులు
బి) గత 30 సంవత్సరాలుగా పనిచేస్తోంది.
సి) మార్చ్ 6, 2017 సర్వీస్ నుండి రిటైర్ అయ్యింది డి) పైవన్నీ

31) దేనిచేత 'భారత ఆర్థికాభివృద్ధి నడిపించ బడుతోంది మరియు వేగవంతం అయ్యింది' అని IMF & OECD నివేదికలు తెలుపుతున్నాయి ?
ఎ) వినిమయ డిమాండ్ & యాక్సల రేటెడ్ స్ట్రక్చరల్ రిఫార్మ్స్.
బి) ద్రవ్యోల్బణం సి) ఎగుమతులు
డి) సాఫ్ట్ వేర్

32) భారత దేశ బ్యాంకింగ్ & ఫైనాన్సియల్ సెక్టార్ చర్చలలో ఏ అంశాలు ఉంటున్నాయి ?
ఎ) ట్విన్ బాలెన్స్ షీట్ ప్రాబ్లం
బి) సెంట్రలైజ్డ్, పబ్లిక్ సెక్టార్ అసెట్స్ రీహాబిలిటేషన్ ఏజెన్సీ (PARA) ఏర్పాటు. దీన్నే 'బాడ్ బ్యాంకు' అని కొందరు అంటున్నారు.
సి) ఇంద్ర ధనుష్ II; అస్సెట్ క్వాలిటీ రివ్యూ (AQR) ని మార్చ్ 31, 2017 లోపల పూర్తి చేయటం. డి) పైవన్నీ

33) స్టీల్ అథారిటీ అఫ్ ఇండియా (SAIL) కి చెందిన ఏ ప్లాంట్‌లను అమ్మదలచుకున్నారు?
ఎ) ఎల్లాయ్ స్టీల్ ప్లాంట్
బి) సేలం స్టీల్ ప్లాంట్
సి) విశ్వేశ్వరయ స్టీల్ ప్లాంట్ డి) పైవన్నీ

34) 2017-18లో కేంద్ర ప్రభుత్వం స్ట్రాటజిక్ డిజ్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా ఎంత ధనం సంపాదించ దల్చింది? (రూ. కోట్లలో)
ఎ) 2,000 బి) 15,000
సి) 3,000 డి) 6,000

35) హైదరాబాద్‌ను క్రీస్తు శకం 1591లో స్థాపించినది ఎవరు ?
ఎ) ఇబ్రహీం కుతుబ్ షా
బి) మొహమ్మద్ కులీ కుతుబ్ షా
సి) అబ్దుల్లా కుతుబ్ షా
డి) అబుల్ హసన్ తానాషా

36) ఔరంగజేబ్ ఫతే దర్వాజా గుండా వెళ్లి ఎప్పుడు గోల్కొండని జయించాడు ?
ఎ) క్రీ.శ. 1687 బి) క్రీ. శ.1656
సి) క్రీ.శ. 1767 డి) క్రీ. శ.1757

37) ఇటీవల నర్మదా నది మీద బాగా పొడవైన కేబుల్ స్టేడ్ బ్రిడ్జ్ ఎక్కడ నిర్మించారు ?
ఎ) ఓంకారేశ్వర్ బి) భరూచ్, గుజరాత్
సి) అమరకంటక్ డి) సూరత్

38) THAAD వివరాలేవీ?
ఎ) టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్సు సిస్టం ఇది.
బి) శత్రు దేశాల నుండి వచ్చే క్షిపణులను ఆకాశంలోనే నాశనం చేస్తుంది.
సి) దీన్ని USA ఏర్పాటు చేస్తోంది.
డి) పైవన్నీ

39) వేర్సాలిస్ కాజిల్ (భవనం) ఎక్కడుంది?
ఎ) పారిస్ దగ్గర, ఫ్రాన్స్
బి) బెర్లిన్ సి) వియన్నా డి) రోమ్

40) టోక్లాయ్ టీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎక్కడుంది?
ఎ) నీల్ గిరిస్ బి) జోర్హాట్, అస్సాం
సి) కోయంబత్తూర్ డి) కోల్‌కత

41) 'స్టార్ట్ అప్' కంపనీకి ఉండే లక్షణాలు ఏవి?
ఎ) భారతదేశంలో రిజిస్టర్ అయి ఉండాలి (5 సంవత్సరాల కంటే ముందుగా కాదు)
బి) వార్షిక టర్నోవర్ రు. 25 కోట్లు మించరాదు, గతంలో ఏ సంవత్సరంలో కూడా.
సి) ఇన్నోవేషన్, అభివృద్ధి, కొత్త ఉత్పత్తులు, ప్రాసెస్, సర్వీసెస్ (టెక్నాలజీ & ఇంటెలె క్చువల్ ప్రాపర్టీ చేత అనగా సాంకేతికత & మేథో సంపత్తి చేత నడపబడేవి)
డి) పైవన్నీ (దీని సమగ్ర నిర్వచనానికి, కృషి కొనసాగుతోంది)

42) "ది పజిల్ పీపుల్-మెమాయిర్స్ అఫ్ ఏ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్" రచయిత ఎవరు?
ఎ) డా॥ థామస్‌స్టార్జల్ బి) సంజీవ్ సన్యాల్
సి) చైతన్య పడుకొనే డి) రవి వెల్లోర్

43) జన్నారండీర్ రీహాబిలిటేషన్ సెంటర్ (DRC) ఎక్కడుంది?
ఎ) నిజామాబాదు
బి) కవ్వాల్ టైగర్ రిజర్వు, మంచిర్యాల జిల్లా.
సి) వరంగల్ డి) ఖమ్మం

44) కెనడా, నార్వేల తర్వాత జీతంతో కూడిన ప్రసూతి సెలవు ఎక్కువ వారాల పాటు ఇచ్చే దేశం ఇప్పుడు భారత్. మెటర్నిటీ బెనిఫిట్ (సవరణ) బిల్, 2016ను పార్లమెంట్ ఆమోదించింది. దీని వల్ల భారత్‌లో మహిళా ఉద్యోగినులకు ఎన్ని వారాల ప్రసూతి సెలవు, జీతంతో కూడినది, లభిస్తుంది?
ఎ) 50 బి) 26 సి) 44 డి) 60

45) ఇండియన్ కౌన్సిల్ అఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ICAR) గుర్తించిన కొత్త బి.టి.కాటన్ వెరైటీ విత్తనాలు ఏవి? వివరాలు ఏవి?
ఎ) PAU Bt. 1, F 1861 & RS 2013
బి) ఇవి అన్నీ Cry1AC అనే జన్యువుని కలిగిఉన్నాయి (ఇది కాయ తొలుచు పురుగుని చంపగలదు)

సి) పంజాబ్, హర్యానా, రాజస్తాన్ రాష్ట్రాలలో బి.టి. ప్రత్తి పంట విస్తారంగా పండిస్తారు.
డి) పైవన్నీ

46) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ ఎక్కడుంది?
ఎ) గాంధీనగర్ బి) నాగపూర్, మహారాష్ట్ర
సి) చండీఘర్ డి) కటక్

47) కంది వలస నది చేత, బంగాళాఖాతంలో ఏర్పడిన 'కానియాన్ సిస్టం' (లోతైనకందకం లాంటిది) దేనికి దగ్గరలో ఉంది?
ఎ) కొవ్వాడ, శ్రీకాకుళం జిల్లా బి) కాకినాడ
సి) సూర్యలంక డి) చెన్నై

48) G-4 (గ్రూప్ అఫ్ ఫోర్)లో ఉన్న దేశాలు ఏవి?
ఎ) బ్రెజిల్ బి) జెర్మనీ సి) ఇండియా, జపాన్
డి) పైవన్నీ (UNO యొక్క సెక్యూరిటీ కౌన్సిల్‌లో 15 ఏళ్ల వరకు వీటో పవర్‌లేని శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్నాయి, సయ్యద్ అక్బరుద్దీన్ నాయకత్వంలో)

49) ప్రస్తుత భారత రాష్ట్రపతి పదవీ కాలం జూలై 25, 2017 నాటికి ముగుస్తుంది. ఎన్నికలు నిర్వహిస్తే, ఇప్పుడు ఎవరెవరు ఎన్నికల్లో పాల్గొంటారు ?
ఎ) రాష్ట్రాలలో ప్రజల చేత ఎన్నుకోబడిన అసెంబ్లీ సభ్యులు (సుమారు: 4120 మంది)
బి) రాజ్యసభలో ఎన్నుకోబడిన సభ్యులు (233)
సి) లోక్‌సభలో ప్రజల చేత ఎన్నుకోబడిన సభ్యులు (543)
డి) పై అందరూ (బ్రాకెట్‌లలో వారి సంఖ్య చూపబడింది) (దీన్ని 'ఎలెక్టరల్ కాలేజ్' అంటారు)

50) 27 ఐరోపా దేశాలు సభ్యులుగా ఉన్న యురోపియన్ యూనియన్‌కు, ఇటీవల ప్రెసిడెంట్‌గా రెండవ సారి కూడా ఎన్నిక అయ్యింది ఎవరు ?
ఎ) క్రిస్తియా నో రోనాల్డో బి) డోనాల్డ్ టస్క్
సి) గారెత్ బాలే డి) జార్జ్ ఈ. కర్రీ

51) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (CIFT) ఎక్కడుంది?
ఎ) కాకినాడ బి) చెన్నై
సి) కొచ్చి, కేరళ డి) కార్వార్

52) USA లో న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజి, వాల్ స్ట్రీట్‌లో ఉంది. ఇక్కడ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఛార్జింగ్ బుల్ (దూసుకొస్తున్న ఎద్దు) కు ఎదురుగా 50 అంగుళాల ఎత్తున్న 'ఫియర్ లెస్ గర్ల్' శిల్పాన్ని ఏర్పాటు చేసిన ఆర్టిస్ట్ ఎవరు ?
ఎ) క్రిస్టెన్ విస్ బెల్ బి) సుదర్శన్ పట్నాయక్
సి) ఎం.ఎఫ్.హుస్సేన్ డి) అహ్మద్ జేవైల్

53) ప్రాకృతం, తమిళ- బ్రాహ్మి లిపిల కన్న చాలా ప్రాచీనమైనది సింధు నాగరికత లిపి. ఇప్పటివరకు దొరికిన 3700 టెక్స్టులలో 417 సింబల్స్ కనుగొన్నా మని ఇటీవల ఎవరు తెలిపారు? (ఇందుకోసం అధునాతన కంప్యూటర్ నెట్వర్క్ వాడారు).
ఎ) డా॥ ఐరావతం మహదేవన్
బి) రణోజోయ్ అధికారి & సతీష్ పళనియప్పన్
సి) రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ
డి) ఇవేవి కావు.

54) క్రీస్తు పూర్వం 196 సంవత్సరం లో ఏర్పాటు చేసిన 'రోసెట్ట స్టోన్'లో గల మూడు భాగాలేవి? (ఇది సుమారు క్రీస్తు శకం 18 వ శతాబ్దంలో దొరికింది). దీని వల్ల పాశ్చాత్య లిపులు అర్థం చేసుకునే వీలు కలిగింది.
ఎ) మొదటి రెండు భాగాలు ప్రాచీన ఈజిప్షియన్ హీరో గ్లైఫిక్ & డెమోటిక్ స్క్రిప్టులలో ఉన్నాయి.
బి) కింద ఉన్న మూడవ భాగంలో ప్రాచీన గ్రీకు భాషలో లిపి ఉంది.
సి) అన్ని మూడు భాగాలలో ఉన్న ఆజ్ఞ ఒకటే కావటం చేత హీరో గ్లైఫిక్‌ను చదివే 'కీ' సులభంగా దొరికింది
డి) పైవన్నీ

55) 2017 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ రాష్ట్రములో ఏ పార్టీకి అత్యధిక సీట్లు లభించాయి ?
ఎ) ఉత్తర ప్రదేశ్ : BJP : 312 సీట్లు
బి) పంజాబ్ : INC : 77 సీట్లు
సి) ఉత్తరాఖండ్: BJP : 57 సీట్లు
డి) పైవన్నీ

56) 2017లో మణిపూర్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు లభించాయి ?
ఎ) INC : 28 బి) BJP : 21
సి) నాగా పీపుల్స్ ఫ్రంట్ : 4 డి) పైవన్నీ

57) 2017లో గోవా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి పదవి ఎవరు చేపట్టారు?
ఎ) మనోహర్ పార్రికర్ బి) లక్ష్మీకాంత్ పర్సేకర్
సి) మృదులా సిన్హా డి) జయంత్ సిన్హా

58) తేయాకు తోటలు గల రాష్ట్రాలు ఏవి ?
ఎ) అస్సాం ; హిమాచల్‌ప్రదేశ్
బి) కేరళ, కర్నాటక, తమిళనాడు
సి) త్రిపుర, పశ్చిమ బెంగాల్
డి) పై 7 రాష్ట్రాలలో తేయాకు పండుతోంది (మొత్తం విస్తీర్ణం : 4.1 లక్షల హెక్టార్లు)

59) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?
ఎ) హిప్పాలస్ : గ్రీక్ నావికుడు
బి) బాక్ట్రియా : నేటి ఆఫ్ఘనిస్తాన్‌లో ఉంది.
సి) స్ట్రాబో : గ్రీకు భౌగోళిక శాస్త్ర వేత్త
డి) పైవన్నీ

60) 'యూరోపా' అనే గురు గ్రహ చంద్రుని పరీక్షిం చటానికి 'యూరో పా క్లిప్పర్' అనే అంతరిక్ష నౌకను పంపించే సంస్థ ఏది ?
ఎ) ఇస్రో బి) నాసా
సి) CERN డి) ఇవేవి కావు

61) ప్రస్తుతం చంద్రుని మీద 200 కి.మి. ఎత్తు లో పరిభ్రమిస్తున్న చంద్రయాన్ - 1 మిషన్‌ను ఎప్పుడు ప్రయోగించారు ? ( దీని ఉనికి గురించి ఇటీవల నాసా తెలిపింది)
ఎ) 2010 బి) అక్టోబర్ 22 , 2008
సి) 2012 డి) 2014

62) PFRDA ఛైర్మన్ ఎవరు ?
ఎ) హేమంత్ G. కాంట్రాక్టర్
బి) U.K. సిన్హా
సి) అరవింద్ పనగారియా
డి) T.S. విజయన్

63) e-వాలెట్స్ (లేక) ప్రిపైడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (PPI) కి ఏది ముఖ్యం ?
ఎ) ఇంటెగ్రిటీ బి) సెక్యూరిటీ
సి) కాన్ఫిడెన్షియాలిటి డి) పై మూడు

64) వలస పక్షులు ప్రతి ఏటా సందర్శించే రోపార్ వెట్ ల్యాండ్ సరస్సు ఎక్కడుంది ?
ఎ) పంజాబ్ బి) మేఘాలయ
సి) అస్సాం డి) సిక్కిం

65) ఇటీవల వార్తల్లో ఉన్న 'ఫాపు' దీవి, ఏ దేశంలో ఉంది?
ఎ) మాల్దీవులు బి) కెనడా
సి) చైనా డి) జపాన్

66) వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (WGC) లెక్కల ప్రకారం 2017 లో భారతదేశంలో బంగారం డిమాండ్ ఎంత ఉండ వచ్చును? (టన్నులలో)
ఎ) 650 కి - 750 కి మధ్య
బి) 600 సి) 800 డి) 950

## జవాబులు (ఏప్రిల్ - 2017)

| | | | |
|---|---|---|---|
| 1-బి | 18-డి | 35-బి | 52-ఎ |
| 2-బి | 19-బి | 36-ఎ | 53-బి |
| 3-ఎ | 20-బి | 37-బి | 54-డి |
| 4-డి | 21-డి | 38-డి | 55-డి |
| 5-బి | 22-డి | 39-ఎ | 56-డి |
| 6-బి | 23-ఎ | 40-బి | 57-ఎ |
| 7-డి | 24-ఎ | 41-డి | 58-డి |
| 8-బి | 25-డి | 42-ఎ | 59-డి |
| 9-బి | 26-ఎ | 43-బి | 60-బి |
| 10-బి | 27-బి | 44-బి | 61-బి |
| 11-ఎ | 28-డి | 45-డి | 62-ఎ |
| 12-ఎ | 29-బి | 46-బి | 63-డి |
| 13-డి | 30-డి | 47-ఎ | 64-ఎ |
| 14-ఎ | 31-ఎ | 48-డి | 65-ఎ |
| 15-ఎ | 32-డి | 49-డి | 66-ఎ |
| 16-ఎ | 33-డి | 50-బి | |
| 17-డి | 34-బి | 51-సి | |

■

### ఆదాయపుపన్ను రిటర్నును సకాలంలో దాఖలు చేయకపోతే భారీ జరిమాన:




వర్తమాన ఆర్థిక సంవత్సరపు ఫైనాన్స్ బిల్లుప్రకారం, వ్యక్తులు ఆదాయపు పన్ను రిటర్నును సకాలంలో దాఖలు చేయకపోతే, భారీ జరిమానా చెల్లించవలసి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 271ఎఫ్ ప్రకారం, ఈ జరిమానా రూ. 5,000/– చెల్లించాల్సి ఉంటుంది. అయితే నూతన సవరణ ప్రకారం, డిసెంబర్ 31 లోపు దాఖలుచేస్తే రూ. 5,000/– లు, ఆ తరువాత దాఖలుచేస్తే రూ. 10,000/–లు జరిమాన చెల్లించాలి. అయితే, వ్యక్తి ఆదాయం సాలుకు ఐదు లక్షలు మించకపోతే, జరిమాన గరిష్ట పరిమితి వెయ్యి రూపాయలు మాత్రమే! ఏప్రిల్ 1, 2018 నుండి దాఖలు చేయాల్సిన రిటర్నులకు ఈ నియమం వర్తిస్తుంది. ఆదాయం ఉండి, పన్ను పరిధిలోకి రానివారు కూడ ఈ రిటర్నును దాఖలుచేయాలి.

### అసమంజస ఆదాయాలు:




ఆపరేషన్ క్లీన్ మనీ కార్యక్రమంకింద ఆదాయపు పన్ను శాఖ చేపట్టిన చర్యలలో మొత్తం 17.92 లక్షలమంది ఆస్థులు వారి తెలిసిన ఆదాయవనరులకన్నా అధికంగా ఉన్నట్లు తెలిసింది. వినగదీకరణ సమయంలో ఈ మొత్తాలు డిపాజిట్ అయినట్లుతెలుస్తున్నది. వీరందరికీ సంజాయిషీకోరుతూ నోటీసులు జారీ చేయగా, కేవలం 12 లక్షలమంది మాత్రమే స్పందించారు. ఇవన్నీ పరిశీలనలో ఉన్నాయి. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద వెల్లడించిన వివరాలు కూడ పరిశీలనలో ఉన్నాయి.

### పన్ను వసూళ్లలో పెరుగుదల:




పరోక్షపన్ను వసూళ్లు ఫిబ్రవరి 2017 నాటికి 22.2 శాతం పెరిగి రూ. 7.72 లక్షల కోట్లవద్ద నమోదయ్యాయి. దీనిలో సెంట్రల్ ఎక్సైజ్ వారిది 36.2 శాతంతో సింహభాగం. ఇదేకాలానికి ప్రత్యక్ష పన్ను వసూళ్ళు 10.7 శాతం పెరిగి, 6.17 లక్షలకోట్లవద్ద నమోదయ్యాయి. ప్రత్యక్షపన్నులలో పారిశ్రామిక పన్ను ఆదాయం 11.9 శాతంగానూ, వ్యక్తిగత ఆదాయపు పన్ను 20.8శాతంగాను ఉన్నాయి.

### ఒక రోజులోనే పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే సదుపాయం:




ఉద్యోగులందరికీ, ప్రావిడెంట్ ఫండ్‌తో అవినాభావ సంబంధం ఉంటుంది. ఉద్యోగుల వ్యక్తిగత అవసరాలకోసం ఈ నిధినుండి సొమ్ము తీసుకుంటూ ఉంటారు. దీనికోసం దరఖాస్తు పెట్టుకోవడం, నెలల తరబడి ఆలస్యంగా సొమ్ము చేతికందడం, కొండొకచో, అధికారులు దరఖాస్తును తిరస్కరించడం మనం చూస్తూనే ఉన్నాము. అయితే ఇప్పుడు ఈ ప్రక్రియనంతా ఆన్‌లైన్ చేయడంతో ఉద్యోగులకు కేవలం ఒక్కరోజులోనే సొమ్ము తీసుకునే వెసులుబాటు కలిగింది. ఇకపై పిల్లల వివాహానికి సొమ్ము తీసుకోడానికి శుభలేఖను సమర్పించనవసరం లేదు. ఒకే ఒక్క ఫారం పూర్తిచేసి, ఆధార్ సహితంగా సమర్పిస్తే చాలు. ఉద్యోగులు ఇకపై తమ అధికారులకు కాక, నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో సమర్పిస్తే చాలు

### విద్యా సంస్థలకు సేవ పన్ను మినహాయింపు:



విద్యార్థులకు సేవలనందిస్తున్న విద్యా సంస్థలను సేవ పన్ను నుండి మినహాయిస్తూ, కేంద్రం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రీ స్కూల్ నుండి, వృత్తివిద్యా సంస్థలు, ప్రొఫెషనల్ విద్యా సంస్థలు, వారు విద్యార్థుల కందించే రవాణా, మధ్యాహ్న భోజనం, వంటి అన్ని కార్యకలాపాలనూ ఈ పన్నునుండి మినహాయిస్తూ ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

**మూలధన ఆస్తులపై కాలప్రమాణం:**



కంపెనీలచట్టం సెక్షన్లు 54, 54బి, 54డి, 54ఎఫ్ ల ప్రకారం ఏదేని సంస్థ తమ భవనాలు, భూములవంటి ఆస్థులను మూలధన ఆస్థులుగా ప్రకటించాలంటే, ఇంతవరకూ అవి కనీసం 36 నెలలు ఆ సంస్థ అధీనంలో ఉన్నట్లు నిరూపించాలి. ఇప్పుడు ఈ కాలవ్య వధిని 24 నెలలకు తగ్గిస్తూ, ఫిబారవరి 28న జారీచేసిన ఫైనాన్స్ బిల్లులో ప్రకటించారు. అయితే, లీజు, తాకట్టులో ఉన్న ఆస్థులకు కూడ ఈ సౌలభ్యం వర్తిస్తుందా అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

**నూతన ఆర్.బి.ఐ. యాప్:**




రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తన వెబ్ సైటును నవీకరించి, ఒక యాప్ ను ప్రారంభించింది. బ్యాంకువారి పత్రిక ప్రకటనలు, IFSC / MICR కోడ్‌లు, మారకపు రేట్లు, శలవలు వంటి అనేక విషయాలు ఈ యాప్ లో ఉంటాయి.

**దీర్ఘ పనిగంటలు మహిళలకు హానికరం:**




మహిళలకు వారానికి 40 కన్నా అధికంగా పని గంటలు ఉంటే అది వారి ఆరోగ్యానికి హానికరమని ఒక సర్వేలో తేలింది. క్యాన్సర్ గుండె జబ్బులు వంటి ప్రమాదాలు అధికమని సర్వే వివరించింది. అయితే ఇదే అధిక పనిగంటలు పురుషుల ఆరోగ్యానికి మంచిదని ఈ సర్వే తెలియచేస్తున్నది. 1978 నుండి 2009 వరకు జరిగిన నేషనల్ లాంగిట్యూడినల్ సర్వేలో ఈ విషయాలు తెలిశాయి. సర్వే వివరాలు వృత్తి, పర్యావరణ వైద్యానికి సంబంధించిన THE JOURNAL OF OCCUPATIONAL AND ENVIRONMENTAL MEDICINE లో ప్రచురించారు. మహిళలకు వారి 30 సంవత్సరాలలోపు ఉండే జీవనవిధానమే, వయసు మీరిన తరువాత వారి అనారోగ్యాలకు కారణమని సర్వే ఉవాచ. ఇంటికి సంబంధించిన బాధ్యతలు కూడ ఉండటంతో మహిళలకు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్వే తీర్మానించింది.

**కార్మిక చట్టాల సూక్ష్మీకరణ:**



వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలలోని దాదాపు 5.85 కోట్ల సంస్థలలో కార్మిక చట్టాలనిర్వహణను ప్రభుత్వం మరింత సులభసాధ్యం చేసింది. తమ వద్ద పనిచేసే ఉద్యోగులు, వారి హాజరు, జీతభత్యాలు, లోన్లు వంటి వివరాలను నిర్వహించే రిజిష్టర్ల సంఖ్యను 56 నుండి, కేవలం ఐదుకు తగ్గించారు. 2013-14 లెక్కలప్రకారం మనదేశంలో మొత్తం 5.85 కోట్ల వ్యవసాయ, వ్యవసాయేతర సంస్థలున్నాయి. దీనిలో 4.54 కోట్ల సంస్థలు వ్యవసాయేతర రంగంలో ఉన్నాయి. ఈ ఐదు రిజిష్టర్లను కూడ, త్వరలో ప్రారంభంకానున్న శ్రమసువిధ పోర్టల్ ద్వారా నిర్వహించవచ్చు.

**అమ్మతనం మరింత ఎత్తుకు:**



మానవ జాతి ఉనికికి 'అమ్మ' ప్రాధాన్యం ఎంతో మనందరికీ తెలుసు. ఇప్పుడు ఈ గొప్పతనాన్ని మరింత ఎత్తుకు పెంచే నిజం ఒకటి బయటకు వచ్చింది. అదేమిటంటే, పిల్లలకు పుట్టుకతో వచ్చే మేధస్సు కేవలం అమ్మనుంచే సంక్రమిస్తుందట! వివరాలలోకి వెళితే, ఇటీవల జరిగిన ఒక జెనెటిక్ అధ్యయనంలో మానవ మేధస్సుకు మూలం X క్రోమోజోమ్‌లోనే ఉన్నట్లు కనుగొన్నారు. బిడ్డకు X క్రోమోజోమ్ తల్లి నుండే సంక్రమిస్తుంది. ఇంత వరకూ వైద్యులు బిడ్డకు మేధస్సు తల్లి, తండ్రి ఇద్దరి నుండి సంక్రమిస్తుందని నమ్ముతూ వచ్చారు. క్రోమోజోముల వివరాల్లోకి వెళితే, ఈ వివరాలు తెలుస్తాయి. స్త్రీలకు రెండు X క్రోమోజోములుంటే, పురుషునికి X, Y క్రోమోజోములు రెండూ ఉంటాయి. ఒక క్రోమోజోములో వేలకొద్దీ జీన్‌లు ఉంటాయి. ఒక లక్షణానికి సంబంధించిన తల్లి జీన్ చైతన్యవంతమైతే, అదే తండ్రికి సంబంధించిన జీన్ నిర్వీర్యమవుతుంది. బిడ్డలో స్పష్టంగా కనబడే లక్షణాలైతే తల్లినుండి సంక్రమిస్తాయి. ఇలాంటి లక్షణాలు X క్రోమోజోముల్లోనే ఉంటాయి. తల్లికి ఈ X క్రోమోజోములు రెండు ఉంటాయి కనుక, మేధస్సు తల్లినుండే బిడ్డకు సంక్రమిస్తుందని నిపుణులు తీర్మానించారు.

■

# సాంఘిక సంక్షేమానికి బాట - తెలంగాణ బడ్జెట్ 2017-18

**కేంద్ర బడ్జెట్ 2017-18 వినూత్న రీతిలో సాగింది. అదే బాటలో తెలంగాణ బడ్జెట్ కూడా కొత్త పద్ధతులు పాటించింది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయానికి స్వస్తి పలికి ప్రగతి పద్దు, నిర్వహణ పద్దును ప్రవేశపెట్టారు. 2017-18 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ.1,49,446 కోట్లుగా ఈటల ప్రకటించారు. బడ్జెట్ కేవలం కేటాయింపులకే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయికి చేరే విధమైనట్టి పథకాల రూపకల్పన జరిగింది. ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన సామాజిక వర్గాలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో మోస్ట్ బ్యాక్‌వర్డ్ కాస్ట్స్ దృక్కోణం ప్రవేశపెట్టారు.**

ప్రజలకు సంక్షేమాన్నందించడమే మహోన్నత న్యాయం అని అంటారు ప్రఖ్యాత తత్త్వవేత్త సిసిరో.. ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రజాస్వామిక స్వేచ్ఛతో పాటు అట్టడుగు వర్గాల సంక్షేమం కూడా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. అభివృద్ధి ఫలాలు కింది స్థాయి వరకూ చేరితేనే ప్రజలకు ఆరోగ్యం, విద్య, జీవనప్రమాణాలు మెరుగవుతాయి. ప్రభుత్వాలు ఆర్థికాభివృద్ధి, స్థూల దేశీయోత్పత్తి, తలసరి ఆదాయాల్లో ఎంత వృద్ధి సాధించినప్పటికీ, అన్ని వర్గాలకు సమానంగా వాటి ఫలాలు అందకపోతే వృథా ప్రయాసగా మిగిలిపోతుంది. దేశంలోని వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం ద్వారా పలు అధికారాలు ఇవ్వడం జరిగింది. తద్వారా భారతదేశం సంక్షేమ శ్రేయో రాజ్యంగా ఎదిగేందుకు దోహద పడింది.

ముఖ్యంగా భారత రాజ్యాంగం తనకు తానే సంక్షేమరాజ్యంగా ప్రకటించు కుంటున్నది. 16వ అధికరణ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశం, 39వ అధికరణ (సి) ప్రకారం సంపద ఒక్క దగ్గరే కేంద్రీకరించకుండా చూడాలి. 46వ అధికరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, తదితర బలహీన వర్గాల ఆర్థిక ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. సంక్షేమ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే భారత రాజ్యాంగం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. రాజ్యాంగ పీఠిక మరియు ఆదేశిక సూత్రాలలో సంక్షేమ రాజ్యం యొక్క లక్ష్యాన్ని స్పష్టంగా పొందుపరిచారు. భారత ప్రజలకు న్యాయం, సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ భద్రత కల్పిస్తుందని రాజ్యాంగ పీఠిక హామీ ఇస్తుంది. దీన్ని పరిగణలోకి తీసుకొని అటు కేంద్రం, అలాగే పలు రాష్ట్రాల ప్రభుత్వాలు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను వ్యాప్తిలోకి తెస్తున్నాయి. ఇటీవలి తెలంగాణ బడ్జెట్ 2017-18 ఈ కోవలోకి చెందినదే కావడం విశేషం.

తెలంగాణ బడ్జెట్ 2017-18ను ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశ పెట్టారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం మంత్రి ఈటల రాజేందర్‌కు ఇది నాలుగోసారి. సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రతీ బడ్జెట్‌లోనూ పలు వర్గాలను దృష్టిలో ఉంచుకొని కొత్త పథకాలకు రూపకల్పన జరుగుతోంది. ఈ సారి బడ్జెట్లో వెనుకబడిన తరగతులకు పలు సంక్షేమ పథకాలను రూపొందించారు. కేంద్ర బడ్జెట్ 2017-18

**ఎం. కృష్ణ ఆదిత్య,** సీనియర్ పాత్రికేయుడు, హైదరాబాద్.
చరవాణి - 9160409918

వినూత్న రీతిలో సాగింది. అదే బాటలో తెలంగాణ బడ్జెట్ కూడా కొత్త పద్ధతులు పాటించింది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయానికి స్వస్తి పలికి ప్రగతి పద్దు, నిర్వహణ పద్దును ప్రవేశపెట్టారు. 2017-18 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ. 1,49,446 కోట్లుగా ఈటల ప్రకటించారు.

ఇక బడ్జెట్‌లో ప్రత్యేకత చాటుకున్న విషయానికి వస్తే వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలే కీలకంగా చెప్పుకోవచ్చు. బడ్జెట్ ప్రవేశానంతరం సీఎం కేసీఆర్ సంపద సృష్టి జరగాలి, అది పేదవాళ్ళకు పంపిణీ కావాలి అన్న మాటలు దార్శనికతతో కూడుకున్నవి. అనాదిగా సమాజ సంపదకు మూలకారకులు బలహీనవర్గాలకు చెందిన కుల వృత్తులవారే అన్నది చారిత్రక వాస్తవం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంతో పాటుగా అనేక అనుబంధ వృత్తుల సమాహారం. కానీ, ప్రపంచీకరణ ప్రభావం, యాంత్రీకరణ వల్ల పల్లెల్లో కులవృత్తులన్నీ ఛిన్నాభిన్నమై పోయాయి. ఈ నేపథ్యంలో కులవృత్తులు, చేతివృత్తులు, వ్యవసాయాధారిత వృత్తులకు ఎలాంటి ఆదరణ అందిస్తే వారు స్వయం పోషకంగా ఎదిగి సంపద సృష్టిలో భాగస్వాములవుతారో ఒక లోతైన అధ్యయనంతో తెలంగాణ బడ్జెట్ కూర్పు జరిగింది.

తెలంగాణ బడ్జెట్‌లో ఈ దఫా సామాజికవర్గ ప్రాతిపదికగా సామాజిక సంక్షేమంపై దృష్టిసారించారు. వ్యవసాయాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి ఉద్యోగ-ఉపాధులు, మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం వంటివి యథావిధిగా కొనసాగినా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ, సమాజానికీ వ్యవసాయంతో పాటుగా ఆయువుపట్టు అయిన వృత్తిపనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడం ఈ బడ్జెట్‌లోని ప్రత్యేకత. పలు తరగతులకు ప్రత్యేక కేటాయింపులు సాగించినప్పటికీ గ్రామీణం, మౌలిక వసతులు, గృహకల్పన, మంచినీళ్ళు, సాగునీళ్ళు, ఐటీ-పరిశ్రమలు మొదలైన రంగాల ప్రాధాన్యాన్ని బడ్జెట్‌లో తగ్గించకపోవడం గమనార్హం. వ్యవసాయం దాని అనుబంధరంగాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఆర్థికమంత్రి సమర్పించిన 47 పుటల బడ్జెట్ పత్రంలోని 85 అంశాలలో సగం కన్నా ఎక్కువగా కొత్త సంక్షేమ విధానం గురించి వివరించడానికే కేటాయించారు.

బడ్జెట్ కేవలం కేటాయింపులకే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయికి చేరే విధమైనట్టి పథకాల రూపకల్పన జరిగింది. ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన సామాజిక వర్గాలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో మోస్ట్ బ్యాక్‌వర్డ్ కాస్ట్స్ దృక్కోణం ప్రవేశపెట్టారు. న్యాయబద్ధంగా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావడానికి ఎదురుచూస్తున్న వర్గాలివి. ఎంతో కాలంగా ఈ అట్టడుగువర్గాల వారి బాధలు అరణ్యరోదనగా ఉండేవి.

బడ్జెట్‌ను స్థూలంగా పరిశీలిస్తే ఐదు విధాలుగా భిన్న సామాజిక సంక్షేమ పథకాలను బడ్జెట్‌లో పొందుపరిచారు.

1. వేతన పెంపు, మెరుగైన పని పరిస్థితులు.
2. వృత్తి కులాలకు సామాజిక సంక్షేమ పథకాలు.
3. మొత్తం సంక్షేమ కేటాయింపులలో 28 శాతం ఎస్సీ, ఎస్టీలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూపంలో కేటాయింపు.
4. ఆసరా పింఛన్ల రూపంలో సామాజిక భద్రత. దీనిని ఇప్పుడు నిరాశ్రయులు, ఒంటరి మహిళలకు వర్తింపజేశారు. కల్యాణ లక్ష్మీ తోడ్పాటు కూడా రూ. 50వేల నుంచి రూ. 75 వేలకు పెంచారు.
5. మహిళా శిశు సంక్షేమ పథకంలో భాగంగా తల్లికి పన్నెండు వేలు ఇవ్వడంతోపాటు, నవజాత శిశువుకు ఆరు వందల రూపాయల విలువ గల కిట్ అందజేస్తారు. ఆడశిశు వు అయితే తల్లికి మరో వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తారు.

ఇక బడ్జెట్‌లో మరో ముఖ్య విషయం. సామాజిక వర్గాల బడ్జెట్ కేటాయింపుల ప్రాతిపదికన ముఖ్యంగా కుల వృత్తులకు ఇతోధిక సహాయం అందింది. ఇందులో భాగంగా గొల్ల కురుమలకు ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. వచ్చే రెండేండ్లలో 4 లక్షల యాదవ కుటుంబాలకు 84 లక్షల గొర్రెల పంపిణీ చేయాలని నిర్ణయించారు. అర్హత గల ప్రతీ కుటుంబానికి 20 గొర్రెలు, ఒక పోతును 75 శాతం సబ్సిడీతో ఇవ్వాలని ముందుకువచ్చారు. అలాగే చేపల వేటపై ఆధారపడ్డ గంగపుత్ర, ముదిరాజుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు లక్షలాది మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేపల పట్టడాన్ని పరిశ్రమ హోదా కల్పించింది. అన్నిటికి మించి, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌ను గుర్తించి, వెయ్యి కోట్ల రూపాయల కార్పస్‌తో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్నారు. ఈ విధంగా బీసీలకు ప్రత్యేకించి రూ. 5,070 కోట్ల రూపాయల కేటాయింపు జరిగింది. దీనికి అదనంగా సబ్సిడీ బియ్యం, ఉచిత కరెంటు, రైతు రుణాల రద్దు, ఆరోగ్య, విద్యా సౌకర్యాల వంటివి కలిపితే భారీ కేటాయింపు అవుతుంది.

ప్రధానంగా గొర్రెల పెంపకం, ఉన్ని సేకరణ గొల్లలకు, కురుమలకు సంబంధించినది కాగా రెండింటినీ యాదవులనే ఒకే గొడుగు కింద చేర్చారు. భారతదేశంలో అత్యధిక గొర్రెలు మేకల సంపద ఉన్న రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలది ప్రథమ స్థానం. అందులో తెలంగాణ గణనీయమైన స్థానంలో ఉంది.. దాదాపు

నాలుగున్నర లక్షల కుటుంబాలకు ఇవే జీవనాధారంగా ఉన్నాయి.

క్షురకులు, రజకులకు కొత్త పథకాలు బడ్జెట్‌లో ఉన్నాయి. నాయీ బ్రాహ్మణులు, రజకులకు ప్రత్యేక తోడ్పాటునందించేలా బడ్జెట్లో కేటాయింపులు చేయడం హర్షణీయం. అత్యాధునిక సెలూన్ షాపుల కోసం ప్రభుత్వమే పెట్టుబడి భరించ బోతున్నది. రజకుల వృత్తిని ఆధునికీకరించే విధంగా వాషింగ్ మెషీన్లు, డ్రయ్యర్లను, ఇస్త్రీ పెట్టెలను అందించాలని నిర్ణయించింది. వారి కోసం రూ.500 కోట్లను బడ్జెట్లో ప్రతిపాదించింది.

అలాగే చేనేత కార్మికులు బాధిత వర్గంగా తోడ్పాటు అవసరమే. అయితే రాష్ట్రంలో మగ్గాలు పదివేల లోపే ఉన్నాయని ఒక అంచనాగా ఉంది. వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పనిలోకి తేవాల్సిన అవసరం ఉంది. దీని కోసం మూడు దశలుగా ప్రణాళికను సిద్ధం చేసింది.

1. చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయడం.
2. నూలు, కెమికల్స్ రాయితీ మీద ఇవ్వడం.
3. మార్కెటింగ్ సదుపాయం కల్పించడం. పెద్ద సంఖ్యలో మరమగ్గాలను ఆధునీకరించేలా చర్యలు తీసుకుం టున్నది. ప్రతీ కార్మికుడికీ నెలకు రూ.15 వేలు వచ్చేలా మరమగ్గాల యాజమాన్యాలను ప్రభుత్వం ఒప్పిం చింది. ఈసారి బడ్జెట్లో కూడా నేతన్నల కోసం రూ.1200 కోట్లు కేటాయిం చింది.

ముఖ్యంగా తెలంగాణలో ఒక్కో కులానికి ఒక్కో వృత్తి అనుసంధానమై ఉన్నది. ఇట్టి పరిస్థితుల్లో అన్నివృత్తులకు ఆర్థిక సహాయం అందించి, అభివృద్ధి వైపు పయనించేలా చేయూత నివ్వడం హర్షదాయకమే. అలాగే వృత్తులను నమ్ముకున్న వారికి వృత్తులను లాభసాటిగా మార్చుతూనే, ప్రత్యామ్నాయమార్గాల్లో అభివృద్ధి లక్ష్యాలను ఎంచుకొనే వారికోసం విద్య ప్రధాన వనరుగా ఉంటుంది. ఈ భావనతోనే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రత్యేక గురుకులాలను ఏర్పాటుచేసి కేజీ టు పీజీ ద్వారా నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నారు. 51 గురుకులాలను ఇప్పటికే ప్రారంభించారు. అలాగే విదేశాల్లో చదువు కోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ. 20 లక్షలు ఆర్థిక సహాయం కూడా అట్టడుగు వర్గాలకు ఊతమిచ్చే పథకాలు కావడం గమనార్హం. జనాభాకు అను గుణంగా జిల్లాల్లో కొత్త స్టడీసర్కిళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పేదరికంలో మగ్గుతున్న మైనారిటీలకు ప్రత్యేక గురుకులాల ఏర్పాటు ఒక ఊరటగా చెప్పవచ్చు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా చితికిపోయిన మైనార్టీల బతుకుల్లో ఒక భరోసాను నింపే ప్రయత్నం గురుకులాల ఏర్పాటు. మైనారిటీ విద్యార్థుల కోసం 201 గురుకుల పాఠశాలలను మంజూరు చేశారు. ఇందులో భాగంగానే వారికి ఈ బడ్జెట్‌లో రూ.1250 కోట్లు కేటాయించారు.

ఇక బడ్జెట్‌లో మరో ప్రధాన అంశం- మిషన్ భగీరథ. ఈ ఏడాది చివరి నాటికి మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా సాగుతుంది. ఈ బడ్జెట్‌లో కూడా మిషన్ కాకతీయకు రూ. మూడు వేల కోట్లు కేటాయించారు. సాగునీటి రంగానికి మొదటి నుంచి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం ఈ సారి కూడా ఆ రంగానికి రూ. 25 వేల కోట్లు కేటాయించింది. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ నాలుగో దఫా కోసం కూడా నాలుగు వేల కోట్లు కూడా విడుదల చేసింది.

పెద్దనోట్ల రద్దు సమస్య ఎదురైనప్పటికీ 13.1 శాతానికి చేరుకోవడం ద్వారా మన రాష్ట్రం డబుల్ డిజిట్ వృద్ధిని సాధించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొత్తం రెవెన్యూ రాబడులను, పన్ను, పన్నేతర ఆదాయాలను పరిశీలిస్తే.. రాష్ట్రం మొత్తం రెవెన్యూ రాబడులు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సమానంగా ఉన్నాయి. దీన్ని బట్టి తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడి ఏ మేర ప్రగతిని సాధించిందో బేరీజు వేయవచ్చు.


భారత రాజ్యాంగంలోని సామ్యవాద లక్ష్యాన్ని నిర్దేశించుకొన్న నేపథ్యంలో ప్రజల జీవితాల్లో అంతరాలను తొలిగించి, అభివృద్ధి ఫలాలను అందరికీ సమానంగా పంచడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యత కావాలి. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందజేస్తూ, సమాజంలోని బలహీనవర్గాల వారందరినీ ఆర్థిక స్వావలంబన వైపు మళ్ళించడమే సామాజిక న్యాయానికి పర్యాయంగా నిలవాలి. ■

## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

*సీనియర్ ఎడిటర్*

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ - 2017-18




**ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ప్రగతి పథంలో దూసుకు పోవడానికి కొత్తగా 13 పథకాలకి, కార్యక్రమాలకి నిధులు కేటాయించారు. సామాజిక అభివృద్ధికి దోహదపడే గ్రామీణ మౌలిక సదుపాయాలు, పట్టణ గృహ నిర్మాణం, అత్యంత ప్రాధాన్యతగల అంశాలుగా, గ్రామీణ అభివృద్ధి, నీటిపారుదల, విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, పరిశ్రమలు ప్రాధాన్య రంగాలుగా బడ్జెట్ ఆవిష్కృతమైంది.**

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో ఈసారి సంక్షేమ ముద్ర బలంగా కనిపించింది. 2017-18 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శాసన సభలో ప్రవేశపెట్టారు. నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతిలోని శాసనసభలో ఈ ఆర్థిక సంవత్సరానికి - రూ.1,56,999 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 1,25,912 కోట్లు కాగా, క్యాపిటల్ వ్యయం రూ. 31,081 కోట్ల రూపాయలు, రెవెన్యూలోటు రూ.416 కోట్ల రూపాయలు. ఆర్థికలోటు రూ.23,054గా ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు పార్శ్వాలుగా చేసుకొని మరింత మెరుగైన ఆర్థిక ప్రగతి సాధించే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారు. ఈసారి బడుగు, బలహీన వర్గాలకు (బి.సి.లకు) ఆర్థికంగా వెనుక బడిన వర్గాలు (ఈ.బీ.సీ.)ల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే ప్రస్తుత బడ్జెట్ 15 శాతం ఎక్కువ. ఇందులో వివిధ కేటాయింపులను పరిశీలిస్తే ఏ రంగానికి ఎంత అవసరమో అంతే కేటాయించారు. పెంచాల్సిన చోట పెంచి, తగ్గించాల్సిన చోట తగ్గించారు. ఉదాహరణకు చూస్తే- గత ఏడాది బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించగా, ఈసారి రూ. 75 కోట్లకు కుదించారు. నిధులు అంత ఖర్చు పెట్టే పరిస్థితి లేదని తెలియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆయా పద్దుల కింద కేటాయించిన బడ్జెట్ తక్కువైతే మరింత ఖర్చు పెట్టేందుకు సిద్ధమని ప్రకటించారు.

ఈసారి బడ్జెట్‌లో సంక్షేమ ముద్ర బలంగా కనిపించింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బీ.సీ. సంక్షేమానికి రూ.10 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. అలాగే ఎస్సీలకు రూ.9847 కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.3,529 కోట్ల రూపాయలు కేటాయించారు. మరో పక్క మైనారిటీలకు రూ.840 కోట్లు కేటాయింపులు చేశారు. గత రెండేళ్ళ నుంచి ఆంధ్రలో కాపు ఉద్యమం బలపడటం, ధర్నాలు, నిరాహార దీక్షలు జరిగిన నేపథ్యంలో అప్పుడు ప్రకటించిన విధంగానే కాపు కార్పోరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించడం విశేషం. తొలిసారిగా క్రైస్తవ కార్పోరేష్‌కు రూ.37 కోట్లతో క్రైస్తవుల జీవన అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. ఇవన్నీ కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వివిధ సామాజిక అంశాలు పరిగణనలోకి

**రామ్‌మనోహర్ శివకోటి,** సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్
E-mail: shivakoti1965@gmail.com

తీసుకుని చేసిన కేటాయింపులేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బీ.సీ.ల లోను ఎం.బీ.సీ. కార్పోరేషన్ ద్వారా అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. అలాగే అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.695 కోట్లు కేటాయించడం సాహసంతో చేసిన నిర్ణయమని ఆర్థిక పరిశీలకులు అంటున్నారు. వివిధ వర్గాల సంక్షేమానికి మొత్తం రూ.25,986 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఈసారి బడ్జెట్‌లో ప్రధానంగా రెండు అంశాలను కీలకంగా తీసుకుంది. మొదటిది ఉమ్మడి సంక్షేమం. రెండోది నిర్దిష్టంగా కులాలు, వర్గాలకు మేలు చేయడం. తద్వారా ప్రజల ఆదరాభిమానాలు పొందగలం అన్నది ప్రభుత్వం ఆలోచన. తెలుగు దేశం ప్రభుత్వం గత ఎన్నికలలో నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీని ఇచ్చింది. ఇందుకు తగ్గట్టుగా ఈ పద్దు కింద రూ.500 కోట్లు కేటాయించారు.

### అభివృద్ధి-ప్రగతి-జోడు గుర్రాలుగా

ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ప్రగతి పథంలో దూసుకు పోవడానికి కొత్తగా 13 పథకాలకి, కార్యక్రమాలకి నిధులు కేటాయించారు.

సామాజిక అభివృద్ధికి దోహదపడే గ్రామీణ మౌలిక సదుపాయాలు, పట్టణ గృహ నిర్మాణం, అత్యంత ప్రాధాన్యతగల అంశాలుగా, గ్రామీణ అభివృద్ధి, నీటిపారుదల, విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, పరిశ్రమలు ప్రాధాన్య రంగాలుగా బడ్జెట్ ఆవిష్కృతమైంది. గ్రామాల్లో వెలుగులు పంచే పంచాయితీ రాజ్- గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.21.140 కోట్ల నిధులు అందిస్తున్నారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది 31.18 శాతం అదనం.

పల్లె జనాభా అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. అందుకే సాగునీటి రంగానికి పెద్దపీట వేశారు. గత బడ్జెట్ కంటే ఈసారి 60 శాతం అదనపు నిధులు కేటాయించారు. అలాగే గ్రామాలలో మౌలిక సదుపాయాల కోసం రూ.12 వేల కోట్లు ఇవ్వనున్నారు. మరో పక్క ఉపాధి హామీ పథకానికి రాష్ట్ర నిధులు కలపడం ద్వారా రోడ్లు, చెరువులు, కుంటలు, అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆర్థిక రంగం అభివృద్ధికి పరిశ్రమలే కీలకం. అలాగే ఉద్యోగాల కల్పనకి పరిశ్రమలే ఆధారం. పరిశ్రమలు కొత్తవి రావాలంటే మౌలిక వసతులు కల్పించాలి. ఈ నేపథ్యంలో పరిశ్రమలకు ఇచ్చే నిధులను 113 శాతం పెంచారు.

### కీలక రంగాలకు కేటాయింపులు

| | |
|---|---|
| నీటిపారుదల రంగం | - రూ.12,726 కోట్లు |
| బీ.సీ.సంక్షేమం | - రూ.10,000 కోట్లు |
| ఎస్సీ సంక్షేమం | - రూ. 9,847 కోట్లు |
| వ్యవసాయం | - రూ. 9,091 కోట్లు |
| ఆరోగ్య కుటుంబ సంక్షేమం | - రూ. 7,021 కోట్లు |
| శాంతి భద్రతలు | - రూ. 5,221 కోట్లు |
| రుణమాఫీ | - రూ. 3,600 కోట్లు |
| ఎస్టీ సంక్షేమం | - రూ. 3,528 కోట్లు |
| పరిశ్రమల రంగం | - రూ. 2,086 కోట్లు |
| గృహ నిర్మాణం | - రూ. 1,457 కోట్లు |
| కాపు సంక్షేమం | - రూ. 1,000 కోట్లు |
| మైనారిటీ సంక్షేమం | - రూ. 840 కోట్లు |
| బ్రాహ్మణ సంక్షేమం | - రూ. 75 కోట్లు |

### తగ్గుతున్న రెవెన్యూ లోటు

రెవెన్యూ లోటు క్రమంగా తగ్గుముఖం పడుతుండటం ప్రభుత్వానికి ఊరట కలిగించేదిగా ఉంది. 2016-17 బడ్జెట్‌లో రూ.4,868.26 కోట్ల రెవెన్యూ లోటు అంచనా వేయగా అది ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి రూ.4597.49 కోట్లకు తగ్గుతుందని అంచనా వేశారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం లోటు గణనీయంగా తగ్గి కేవలం రూ.415.80 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు.

### కేంద్ర నిధులతో అప్రమత్తంగా

సాధరణంగా ఏ రాష్ట్ర ప్రభుత్వం అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులపై భారీగా అంచనాలు వేసుకుని బడ్జెట్ పరిమితిని పెంచడం ఒక అలవాటుగా ఉంది. కానీ ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరించింది. ఈసారి కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల కింద వాస్తవిక దృక్పథంతో సాగారు. 2016-17లో రూ.27,663 కోట్ల (సవరించిన అంచనాలు) కేంద్రం గ్రాంట్లు రాగా ఈసారి 37,548 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఇందులో ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు, విదేశీ సహాయంతో చేపట్టే ప్రాజెక్టులకు (ఈఏపీ) రూ.3వేల కోట్లు వస్తాయని అంచనా వేశారు. తద్వారా కేంద్రం పన్నుల్లో వచ్చే వాటాల్లో పెంపుదలను బడ్జెట్‌లో చూపించలేదు. కాబట్టి కేంద్ర పన్నుల్లో, వాటాలో పెరుగుదలతోపాటు ఈఏపీ కింద వచ్చే నిధులు రూ.3 వేల కోట్లను దాటే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనివల్ల ఆర్థిక కార్యక్రమాలకు అదనపు సాయం లభించినట్లేనని పేర్కొంటున్నాయి.

### నిరుద్యోగ భృతి

నిరుద్యోగులకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి భృతి ఇవ్వాలని బడ్జెట్‌లో నిర్ణయించారు. ఇందుకోసం రూ.500 కోట్లు కేటాయించారు. అలాగే కొత్తగా మరో 13 పథకాలను కొత్త బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలు శాఖలను అనుసంధానం చేస్తూ నిధులు కేటాయించారు. ఇందు కోసం బడ్జెట్‌లో రూ.330 కోట్లు ప్రతిపాదించారు. టూరిజం అధారిటీకి - రూ.200 కోట్లు "అన్న క్యాంటీన్ల"కు రూ.200 కోట్లు, పట్టణాల్లో

*తరువాయి 43వ పేజీలో...*

**సామాజిక దృక్పథం**

**డా॥ అంబేద్కర్ జయంతి ప్రత్యేక వ్యాసం**

# అంబేద్కర్ దార్శనికత : వర్తమాన సమాజంపై ప్రభావం



**దేశంలో తరతరాలుగా పేరుకొని పోయిన సామాజిక వివక్షతను ఎదుర్కొని దేశ రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన అంబేద్కర్ జీవన ప్రయాణం ఆద్యంతం అనేక అవాంతరాలను అధిగమిస్తూ, సవాళ్లను పరిష్కరిస్తూ, అవరోధాలను అనుకూలంగా మార్చుకుంటూ నేటి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అంబేద్కర్ ఒక మాటన్నారు. ఇంతకాలం మన కష్టాలకు, నష్టాలకు, బాధలకు బ్రిటిష్ వారిని నిందించేవారం. ఇప్పుడు దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇకపై ఏ పొరపాటు జరిగినా దానికి మనల్ని మనమే నిందించుకోవాలన్నారు.**

భారతీయ సమాజం పరిణామశీలతలో నిరంతరం ఒక నేపథ్య సంగీతంలా ప్రభావాన్ని ప్రసరింప చేస్తున్న సిద్ధాంతకర్తల్లో అంబేద్కర్‌ని ప్రముఖంగా పేర్కొనాల్సి ఉంది. భారత రాజ్యాంగ నిర్మాతగా కీర్తిని గడించిన అంబేద్కర్‌కి స్థానిక భారతీయ సమాజం రూపురేఖలు, పరిమితులపై అపారమైన అవగాహన ఉంది. బ్రిటీష్ వారి నుంచి మనకు స్వాతంత్ర్యం సంక్రమించిన తరువాత స్వపరిపాలన దిశగా తొలి అడుగులు వేయాల్సి వచ్చినపుడు ముందు దేశానికి ఒక విధానం రాజ్యాంగం అవసరమైంది. ప్రజాస్వామ్యంలోకి అడుగుపెట్టిన భారతదేశానికి ప్రజాస్వామ్య విలువలతో కూడిన రాజ్య నిర్మాణం అవసరమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేయడం, వాటి నుంచి స్ఫూర్తిగా తీసుకున్న అంశాలను స్థానిక దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా మల్చడంలో బాబా సాహెబ్ అంబేద్కర్ తొలి విజయం సాధించారు.

ముందుగా ఇక్కడి నుంచి ప్రారంభిద్దాం. బ్రిటిష్‌వారిపై భారతీయుల ప్రధాన పోరాటం అహింసాయుతమైనది. ప్రపంచానికి సరికొత్త పోరాట సాధనాన్ని అందించిన ఘనత జాతిపిత మహాత్మా గాంధికే చెందుతుంది. అహింసాపూరితంగా సాధించిన భారత స్వాతంత్ర్య ఫలాలను దేశంలో అన్ని వర్గాలకు అన్ని ప్రాంతాలకు అన్ని జాతులకు సమానంగా అందించే బృహత్తర బాధ్యత రాజ్యాంగ నిర్మాతలపై పడింది. రాజ్యాంగ రచనకి నేతృత్వం వహించిన అంబేద్కర్ ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మనకు అనుపమానమైన రాజ్యాంగాన్ని అందించారు. 1947 నాటి భారత్‌లోని పరిస్థితులనే కాకుండా భవిష్యతరాల అవసరాలు, మార్పులను కూడా పసికట్టి రాజ్యాంగంలో పొందుపరిచిన అనేక అంశాల ఫలాలను ఇప్పటికీ, ఎప్పటికీ దేశ ప్రజలు అనుభవిస్తూనే ఉంటారు. గతాన్ని అధ్యయనం చేసి, వర్తమానానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాలకు తగిన రీతిలో రూపొందించిన భారత రాజ్యాంగానికి కాలానుగుణంగా తనను తాను మార్చుకొనే స్వభావాన్ని అందివ్వడం కూడా అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. నాడు రచించిన రాజ్యాంగం శాశ్వతం కాదని, ప్రతి సందర్భంలో, ప్రతి జాతి అవసరంలో, ప్రతి దేశ ప్రయోజనంలో రాజ్యాంగ సవరణకి

**జి.దత్తాత్రేయ,** సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.
E-mail: socratis469@yahoo.com

చట్టసభలకు సంపూర్ణ అధికారాలను కట్టబెట్టడంలోనూ అంబేద్కర్ దూరదృష్టి సుస్పష్టం.

**అంబేద్కర్ అందరి వాడు:**

దేశంలో బడుగు, బలహీన, నిమ్న జాతుల అభ్యున్నతి కోసం జీవితాంతం పనిచేసిన అంబేద్కర్ కేవలం కొందరి వాడే కాదు. యావత్ జాతి జనుల రాజ్యాంగ నిర్మాత. కలకాలం గుర్తించుకోదగ్గ దార్శనికుడు. దేశ ప్రగతి చక్రాలకు, పారిశ్రామిక పురోగతికి, విద్యా, విజ్ఞానాల వికాసానికి, ప్రపంచదేశాలతో సంబంధాలకు పురోగామిక రాజ్యాంగాన్ని ఆయన మనకు అందించారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో 14, ఏప్రిల్, 1891లో జన్మించిన అంబేద్కర్ బాంబే యూనివర్శిటీ నుంచి రాజనీతి, ఆర్థిక శాస్త్రాల్లో పట్టా పుచ్చుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1947లో రాజ్యాంగ పరిషత్ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా, తరువాత దేశ తొలి న్యాయశాఖ మంత్రి గానూ సేవలందించారు. దేశంలో తరతరాలుగా పేరుకొని పోయిన సామాజిక వివక్షతను ఎదుర్కొని దేశ రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన అంబేద్కర్ జీవన ప్రయాణం ఆద్యంతం అనేక అవాంతరాలను అధిగమిస్తూ, సవాళ్లను పరిష్కరిస్తూ, అవరోధాలను అనుకూలంగా మార్చుకుంటూ నేటి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

రాజ్యాంగాన్ని రూపొందించడానికి ముందు అంబేద్కర్ ఒక మాటన్నారు. ఇంతకాలం మన కష్టాలకు, నష్టాలకు, బాధలకు బ్రిటిష్ వారిని నిందించేవారం. ఇప్పుడు దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇకపై ఏ పొరపాటు జరిగినా దానికి మనల్ని మనమే నిందించుకోవాలన్నారు. మన భవితకి మనమే విధాతలమని పేర్కొన్న అంబేద్కర్ దేశంలో అన్ని రంగాల పురోగతికి బాటలు వేసే విధంగా రాజ్యాంగంలో అనేక అధికరణలను రూపొందించారు. అయితే ఇక్కడే అంబేద్కర్ తన దార్శనికతను ప్రదర్శించారు. రూపొందించిన రాజ్యాంగం ఎప్పటికీ విఫలమవదనీ, కాలానుగుణంగా మార్పులు, చేర్పులతో భారత రాజ్యాంగం సజీవంగా, నిత్య యవ్వనంతో అలరారు తుందని, అయితే ఏవేని వైఫల్యాలకు కేవలం రాజ్యాంగాన్ని అమలు చేసే వారే బాధ్యత వహించాలని కూడా దిశా నిర్దేశం చేశారు.

భారతదేశ రాజ్యాంగ రూపకల్పన నాటికి అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులపైనా అంబేద్కర్‌కి సంపూర్ణ అవగాహన ఉంది. రెండు ధృవ ప్రపంచాలుగా విడిపోయిన పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అత్యంత విలక్షణమైన లక్షణాలను దేశ రాజ్యంగానికి అనువర్తింప చేయడంలో అంబేద్కర్ ప్రదర్శించిన ప్రతిభ అనుమానమైంది. రాజ్యాంగమంటే రాజ్య లక్షణం. పరిపాలన, నిర్ణయాధికారం, విధానల కల్పన, భవిష్యత్ దర్శనం వంటివి అందులో ఇమిడి ఉంటాయన్న సత్యాన్ని గుర్తెరిగిన ఆయన కుల, మత, ప్రాంత, జాతి వంటి అనేక అసమానతలతో ఉన్న సువిశాలమైన భారతదేశ ప్రజలను ఏకత్రాటిపైకి తీసుకొని రావడంలో, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి రాజ్యానికి సామ్యవాద, లౌకిక వాద లక్షణాలను అపాదించారు. దీంతో ఆసేతు హిమాచలం అనేక పాయలుగా విడిపోయిన జాతి జనులను అఖండ స్రవంతిలోకి తీసుకొని రావడంలో అంబేద్కర్ దార్శనికత ఫలాలను నేటికీ మనం అనుభవిస్తూనే ఉన్నాం.

**తెలంగాణ ఏర్పాటుకి దోహదపడిన అంబేద్కర్ దార్శనికత:**

రాష్ట్రాల ఏర్పాటుపై నాడు అంబేద్కర్ రాజ్యంగంలో ఏర్పరిచిన అధికరణాలను వర్తమాన పరిస్థితుల పరిణామాలపై అనువర్తిస్తే ఆయన దూరదృష్టి మనకు అర్థమవుతుంది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణకి అంబేద్కర్ సుస్పష్టమైన విధానాన్ని రూపొందించారు. ఆయా రాష్ట్రాలకు పునర్ వ్యవస్థీకరణపై హక్కులు కల్పిస్తే తద్వారా విభజన జరగదని ముందే గుర్తించారు. పెద్ద పెద్ద రాష్ట్రాల్లో విస్తరణ పరంగా, ఇతరత్రా వివక్షతకు గురవుతున్న ప్రాంతాలు విడివడి, ప్రత్యేక రాష్ట్రాలుగా అవతరించడానికి సంపూర్ణ అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికే దఖలు చేసిన దార్శనికుడు కూడా అంబేద్కరే. చిన్న రాష్ట్రాలుగా విడివడడానికి పెద్ద రాష్ట్రాలు ఎన్నటికీ అంగకరించవని, రాష్ట్రాల విభజనకి ఆయా అసెంబ్లీల ఆమోదం ఉంటే చాలని రాజ్యాంగంలో ప్రకరణ 3ను కూడా బాబా సాహేబ్ రూపకల్పన చేశారు. బాబా సాహేబ్ అంబేద్కర్ దూరదృష్టి కారణంగానే నేటి తెలంగాణా నుంచి ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల ఏర్పాటు సాకారమైంది.

దేశం నుంచి విడిపోయే హక్కు ఏ రాష్ట్రానికీ లేకపోయినా, అవి స్వయం సమృద్ధితో బలంగా ఉండాలని ఆకాంక్షించిన అంబేద్కర్ కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాల విషయంలో సమతుల్యతను సాధించే దిశగా రాజ్యాంగంలో అనేక ఏర్పాట్లను చేశారు. రెవెన్యూ పంపిణీలోనూ అంబేద్కర్ దిశానిర్దేశం అనుపమానమైంది. కానీ, నేడు కేంద్రం ఇచ్చే గ్రాంట్లపై రాష్ట్రాలు అత్యధికంగా ఆధారపడడాన్ని ఆనాడే అంబేద్కర్ వ్యతిరేకించారు. రాష్ట్రాలు తమ వనరుల కోసం కేంద్రంపై ఆధారపడే పరిస్థితి రాకూడదన్నారు. ఆర్థిక అవసరాల కోసం రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై అమితంగా ఆధారపడితే, వాటి స్వీయ ప్రతిపత్తికి భంగం కలుగుతుందని హెచ్చరించారు. రాజ్యాంగంలోని 252వ అధికరణ దేశంలో సమాఖ్య స్ఫూర్తికి

అంబేద్కర్ అందించిన బహుమానంగా చెప్పాలి.

అదే సమయంలో రాష్ట్రాల స్వీయ నిర్ణయాధికారాలకు అంబేద్కర్ హద్దులు ఏర్పరచారు. దేశ ప్రయోజనాల ముందు అన్ని రాష్ట్రాల అధికారాలు ద్వితీయస్థాయికి చేరతాయి. దేశంలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక అధికారాలను, ప్రతిపత్తిని కట్టబెట్టడాన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. జమ్ము, కాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 ప్రకరణనూ ఈ కారణంతోనే వ్యతిరేకించారు. తద్వారా దేశ సమగ్రత దెబ్బ తింటుందని భావించారు. ప్రత్యేక ప్రతిపత్తితో సమస్య పరిష్కారం కాకపోతే, అది మరింత తీవ్రమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు.

దేశ ప్రయోజనాలకు భంగం కలిగినప్పుడు, సార్వభౌమాధికారానికి విఘాతం ఏర్పడినప్పుడు మినహా మరెప్పుడూ, ఏ రాజకీయ ప్రయోజనం కోసమూ అత్యవసర పరిస్థితిని విధించరాదని రాజ్యాంగంలోని 352 ప్రకరణలో అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు.

అయితే అమెరికాలాగా దేశంలోని రాష్ట్రాలకు స్వయం నిర్ణయాధికారంతో విడిపోయే హక్కు లేదు. అంతర్గతంగా వాటి ఇష్టానుసారంగా విభజించుకొనే హక్కు లేదు. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సంబంధాల కారణంగానే దేశ సమగ్రత, అభివృద్ధి ఆధారపడి ఉంటాయి. అంబేద్కర్ రూపొందించిన 252వ అధికరణ ప్రపంచ దేశాలకే సరికొత్త మార్గాన్ని చూపిందంటారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల కన్నా బలంగా ఉండాలని, అదే సమయంలో రాష్ట్రాలు తమ ప్రాంత అవసరాలకు అనుగుణంగా స్వతంత్ర్యంగా నిర్ణయాలు, విధానాలు రూపొందించుకోవాలని అంబేద్కర్ భావించారు. తాజాగా రూపొందిన తెలంగాణ వంటి రాష్ట్రాలు అంబేద్కర్ రాజ్యంగ భావ జాలం నుంచి స్ఫూర్తి పొందుతూనే ఉన్నాయి.

**అంబేద్కర్ మార్గంలో తెలంగాణా విధానాలు:**

అనేక అంతరాలుగా ఉన్న భారత సమాజంలో సమానత్వ సాధన కోసం అంబేద్కర్ ప్రభోధించిన విధానాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయబూనుకోవడంలో తాజా బడ్జెట్ సజీవ ఉదాహరణగా నిలుస్తుంది. బలహీన, బడుగు, నిమ్న వర్గాల సమున్నతి కోసం అనేక కేటాయింపుల వెనుక కూడా అంబేద్కరిజం ప్రభావం కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన పశుపోషణకి తెలంగాణా బడ్జెట్ పెద్ద పీట వేయడమే దీనికి ఉదాహరణగా చెప్పాలి. పశు సంపద వృద్ధికి ప్రాధాన్యమిచ్చిన తెలంగాణ బడ్జెట్ 2017-18 అనేక ఇతర వర్గాలకూ నికరమైన కేటాయింపులు జరిపింది. జనాభాలో అత్యధికుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తే దానికి అనుగుణంగా నేటికీ దేశంలోని అనేక రాష్ట్రాలు ఆయన చూపిన మార్గంలో ప్రయాణిస్తున్నాయి. అన్ని వర్గాల సమాన అభివృద్ధి సాధించే వరకు ప్రతి దశలో అంబేద్కర్ ఆలోచనలు ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి స్ఫూర్తి ఇస్తూనే ఉంటాయి.

తెలంగాణాలో అత్యధికులుగా ఉన్న నిమ్న వర్గాలు, వారు నివసించే గ్రామీణ ప్రాంతాలకు దీర్ఘకాలికంగా ఆర్థిక స్వావలంబన కోసం జల వనరుల సృష్టికి ఇక్కడి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. మిషన్ కాకతీయ ద్వారా కాకతీయుల నాటి గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధితో గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు.

అంబేద్కర్‌ని ఎక్కువ దళిత జన బాంధవుడిగా చూడడం మనకు అలవాటుగా ఉంటుంది. అయితే అంతకన్నా ఎక్కువగా దేశంలోని సకల సమాజాలను అంబేద్కర్ దార్శనికత ప్రభావితం చేసింది. రాజ్యాంగంలోని 14, 15 (2), 16, 17, 23, 24 ప్రకరణల కారణంగా జాతి జనులందరికీ ప్రాథమిక హక్కులు సంక్రమించాయి. ఈ కారణంగానే దేశంలో ఎవరైనా, ఏ స్థాయికి చెందిన వారైనా, ఏ సామాజిక వర్గానికి, ప్రాంతానికి, ఆర్థిక స్థితికి చెందిన వారైనా దేశ ప్రధాని వరకు ఎదిగే సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అంబేద్కర్ దార్శనికత జాతి జనులకు అందించింది. దీనికి తాజా ఉదాహరణగా ఎక్కడో మారుమూల గుజరాత్‌లో ఒక ఛాయ్ వాలా నేడు దేశ ప్రధాని కావడమే కాకుండా అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను మునుపెన్నడూ లేనంతగా ఇనుమడింప చేయడమేనని చెప్పాలి. దేశ పౌరులకు నిరంతర హక్కుల కల్పనలో అంబేద్కర్ రాజ్యంగంలో పొందుపరిచిన అంశాలు తరువాత అనేక ఇతర దేశాలకు కూడా అదర్శంగా నిలిచాయి.

**ఉమ్మడి పౌర స్మృతి:**

భారతదేశం అనేక మతాలకు , విశ్వాసాలకు, ఆచార వ్యవహారాలకు పుట్టినిల్లు. అందరిని కలుపుకొని పోయే లక్షణమున్న భారత్‌లో ఆయా మత విశ్వాసాలు ఆధునిక అవసరాలకు అనుకూలంగా మార్పులకు లోనవనప్పుడు అది ఆయా మత విశ్వాసాలను పాటించే ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఎవరి మత విశ్వాసాలు వారివే అయినా, సాంఘిక ఆచరణలో మాత్రం ప్రజాస్వామ్య లక్షణం ఉండాలని అభిలషించిన అంబేద్కర్ ఆనాడే ఉమ్మడి పౌరస్మృతిని సిఫార్సు చేశారు. దేశంలో ప్రజలందరికీ ఉమ్మడి స్మృతి ఉండడంతో వారి సర్వతోముఖాభివృద్ధి సమానంగా జరుగుతుందని భావించారు. అంబేద్కర్

ఆలోచనలతో ఏకీభవించేవారు కూడా ఆయన ప్రబోధించిన ఉమ్మడి పౌరస్మృతిని అంగీకరించకపోవడం విచిత్రంగా కనిపిస్తుంది. కుల, మత, ప్రాంతీయ రాజకీయాలు తలెత్తకుండా సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికన దేశ ప్రజాస్వామ్య నిర్మాణానికి అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలోనూ, వెలుపలా జవజీవాలం దించారు. నాడు రూపొందించిన రాజ్యాంగమే అంతిమమని, అది ఎప్పుడూ, ఎలాంటి మార్పులకు లోనవదని అంబేద్కర్ ఎన్నడూ అభిలషించ లేదు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ సవరణలకు కూడా రాజ్యాంగంలో వెసులు బాటు కల్పించడంతో, భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా మారుతున్న ప్రతి దశలోనూ తనను తాను మార్చుకుంటూ నిత్య యౌవనశీలిగా ఉంచడంలో అంబేద్కర్ ఆలోచనలే ప్రధానమని చెప్పాలి. 1947 ఆగస్టు 29న అంబేద్కర్ నేతృత్వంలో ఏర్పడ్డ రాజ్యాంగ ముసాయిదా కమిటీ ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. ముసాయిదా రాజ్యాంగాన్ని 26, నవంబర్, 1949లో రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు సాధించింది.

**కొన్ని అంబేద్కర్ మాటలను గుర్తు చేసుకుందాం:**

'మనుషులకు మరణం ఉంటుంది. ఆలోచనలకూ మరణం ఉంటుంది. మొక్కకు నీరు ఎలా అవసరమో ఆలోచనలకు ప్రచారం అంతే అవసరం.' 'రాజ్యాంగంలో 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' పదాలను నేను ఫ్రెంచ్ విప్లవం నుంచి తీసుకున్నానని కొంతమంది అపోహపడ్డారు. అయితే వాటిని నా గురువు గౌతమబుద్ధుడు నాకు అందించారు' ■

*39వ పేజీ తరువాయి...*

## ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ - 2017-18

| బడ్జెట్ స్వరూపం | | | రూ.కోట్లలో |
|---|---|---|---|
| | | సవరించిన అంచనా | బడ్జెట్ అంచనా |
| **వివరాలు** | **2015-16** | **2016-17** | **2017-18** |
| రెవెన్యూ వసూళ్ళు | 88,648 | 1,07,709 | 1,25,496 |
| మూలధన వసూళ్ళు | 60,593 | 25,022 | 31,492 |
| మొత్తం వసూళ్ళు | 1,49,601 | 1,32,731 | 1,56,988 |
| రెవెన్యూ వ్యయం | 95,950 | 1,12,306 | 1,25,912 |
| మూలధన వ్యయం | 14,172 | 14,178 | 21,959 |
| రుణాలు | 673 | 725 | 1,119 |
| మూలధన చెల్లింపులు | 38,640 | 5,555 | 8,009 |
| మొత్తం వ్యయం | 1,49,435 | 1,32,764 | 1,56,999 |
| రెవెన్యూ లోటు | 7,302 | 4,597 | 416 |
| ద్రవ్య లోటు | 21,863 | 19,163 | 23,054 |

తాగు నీటికి రూ.101 కోట్లు, ఐ.టీ.శాఖలో నూతన ఆవిష్కరణలకు రూ.100 కోట్లు, ఎన్.టి.ఆర్ సజల స్రవంతికి రూ.100 కోట్లు ఉపాధి హామీ నిధులతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.87 కోట్లు, అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖకు రూ.60 కోట్లు, మచిలీపట్నం ప్రాంత సాధికార సంస్థకు రూ.50 కోట్లు, ఎన్.టి.ఆర్ జలసిరికి రూ.44 కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్‌కు రూ.40 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం విశేషం.

వ్యవసాయానికి, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యత, మరోపక్క పరిశ్రమలకు మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం కీలకంగా చేసుకుని, ఆర్థిక సమతూకం పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా రూపొందించిన ఈ బడ్జెట్ ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలకు అనుగుణంగా అమలు జరుగుతుందని ఆశిద్దాం.


### ఏ.పీ.కి ప్రత్యేక ప్యాకేజీకి రాజముద్ర

ఐదుకోట్ల మంది ఆంధ్రులు - ఎపుడెపుడా అని ఎదురు చూస్తున్న ప్రత్యేక ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. స్వరాష్ట్రంలో నూతన రాజధానిలో కొత్త శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన మొదటి రోజునే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించడం విశేషం. కేబినెట్ ఆమోదించిన ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికయ్యే వ్యయాన్ని నూటికి నూరు శాతం కేంద్రమే భరిస్తుంది. ప్రధాని మోదీ నివాసంలో జరిగిన ■

**మనవి**

**కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తమ సూచనలను mygov.in వెబ్‌సైట్ ద్వారా పంపవచ్చు లేదా 1800 117 800 (టోల్ ఫ్రీ) నెంబరుకు తెలియచేయవచ్చు.**

# తెలంగాణ బడ్జెట్ లక్ష్యం సకల జనుల సంక్షేమం




**ముఖ్య మంత్రి కే. చంద్రశేఖర రావు 2017-18 బడ్జెట్‌ను పేదల అనుకూల బడ్జెట్ అని పేర్కొన్నారు. సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్‌ను రుపొందించామని ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రధానంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను పునరుజ్జీవింపచేసే లక్ష్యంతో బడ్జెట్ రూపొందించినట్లు ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. నిజమే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపచేసే లక్ష్యం స్వాగతించదగినదే. ప్రగతి పద్దు రూ. 88 వేల కోట్లలో సింహభాగం సంక్షేమ రంగానికే కేటాయించారు.**

తెలంగాణ కొత్తరాష్ట్రం. చిన్నరాష్ట్రం కూడా. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల సంఖ్యను 10 నుంచి 31కి పెంచినా, ఆర్థికంగా అందివచ్చే జిల్లాలు మాత్రం నాలుగంటే నాలుగు మాత్రమే. ఇంకా కొంచెం విపులంగా చెప్పు కోవాలంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్, రాజధాని నగరాన్ని అనుకుని ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలు మాత్రమే ఆర్థిక కార్య కలాపాలకు నెలవుగా ఉన్నాయి. రాష్ట్ర తలసరి ఆదాయం (జీఎస్డీపీ) లో 52 శాతం ఈ నాలుగు జిల్లాల నుంచే వస్తుంది. అంటే తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మూలాలు ఎక్కడ ఉన్నాయో అర్థంచేసు కోవడం ఏమంత కష్టంకాదు. అదలాఉంటే రాష్ట్రతలసరి ఆదాయం (రూ. 1,58,360) జాతీయ తలసరి ఆదాయం సగటు కంటే ఎక్కువ. ఈ ఒక్క సంవత్సరమే కాదు. రాష్ట్ర ఆవిర్భావం నాటి నుంచి రాష్ట్ర తలసరిఆదాయం వృద్ధిరేటు జాతీయ వృద్ధిరేటు కంటే ఎక్కువగానే ఉంటూవస్తోంది. అయితే జిల్లాలవారీగా చూస్తే రాష్ట్ర నగటు విషయంలో కూడా మళ్ళీ ఆనాలుగు జిల్లాలలే సగటు గీతకు పైనున్నాయి. మిగిలిన 27 జిల్లాలు గీత దిగువనే ఉన్నాయి. ఈవివరాలన్నీ రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ 2017-18 వార్షిక బడ్జెట్‌తో పాటుగా శాసన సభకు సమర్పించిన సామాజిక-ఆర్థిక సర్వేలో ప్రకటించిన వివరాలు. నిజానికి బడ్జెట్ కంటే ఆర్థికసర్వే గణాంకాలే ఆర్థికపరిస్థితి వాస్తవ చిత్రాన్ని ప్రతిబింబిస్తాయని ఆర్థిక నిపుణులు అంటారు. అలాగే బడ్జెట్ అధ్యయనానికి సర్వే గణాంకాలే ఆధారంగా నిలుస్తాయి.

### ఇదీ బడ్జెట్

ఇక ఆవిషయాన్ని అలాఉంచి నేరుగా బడ్జెట్ విషయంలోకి వస్తే మార్చి 13 వ తేదీన రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ 2017-18 వార్షిక బడ్జెట్ పద్దును రాష్ట్ర శాసనసభకు సమర్పించారు. ఆర్థికమంత్రి తమ బడ్జెట్ ప్రసంగం తొలి పలుకుల్లోనే పేర్కొన్నట్లుగా రాష్ట్ర ఆవిర్భావం నాటి నుంచి ఆయనే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. ఆక్రమంలో ఇది నాల్గవబడ్జెట్. ఇది ఒక విధంగా మంచి సంప్రదాయం.

ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ వరసగా ప్రవేశ పెట్టిన నాలుగు బడ్జెట్లను గమనిస్తే దేని కది ప్రత్యేకంగా కనిపిస్తాయి.

**రాజనాల బాలకృష్ణ,** సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.
E-mail: rajanala.bk@gmail.com

అయితే అదే సమయంలో ఒక దానికి ఒకటి కొనసాగింపుగానూ కపిపిస్తాయి. ఇందులో ప్రత్యేకంగా ప్రముఖంగా కనిపించే విశేషం ప్రతి సంవత్సరం బడ్జెట్ పద్దు పెరుగుతూ వస్తోంది. గత సంవత్సరం (2016-17)లో రూ. ఒక లక్షా 30 వేల 415 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సంవత్సరం మరో అడుగుముందుకేసి రూ. 1,49,646 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇందులో రూ. 61,607.20 కోట్లు నిర్వహణ పద్దు అయితే రూ. 88,038.80 కోట్లు ప్రగతి పద్దు.

### గతమెంత ఘనం

అయితే, తెలంగాణ రాష్ట్రం విషయం లోనేకాదు, ఏ రాష్ట్రం విషయంలో అయినా అయినా ప్రస్తుత పద్దు ఎంత పెద్దగా ఉందన్నది అంత ప్రధానం కాదు, గత పద్దు ఘనకీర్తి ఏపాటిది అనేదే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ప్రామాణికంగా నిలుస్తుంది. గత (2016-17) బడ్జెట్ సంవత్సరాంతానికి సవరణలతో చిక్కి పోయింది. సవరించిన అంచనాల ప్రకారం 86.02 శాతం మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగింది. అంటే మొత్తం పద్దు ఒక లక్ష 30 వేల 415 కోట్ల రూపాయలకుగాను లక్షా 12 వేల 191 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగింది. ఈలెక్కన ఆదాయం ఎక్కడనుంచి, ఏరూపంలో వస్తుందన్న ప్రధాన ప్రశ్నను పక్కన పెట్టినా గత సంవత్సరం కంటే ఇంచు మించుగా రూ. 40 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయవలసి ఉంటుంది.

### అప్పు.. తప్పుకాదు

ఆదాయం లేకుండా ఖర్చులు చేయాలంటే అది కుదిరే విషయంకాదు. కాదు కూడదు అనుకుంటే అప్పు ఒక్కటే మార్గం. అయితే, ఇప్పటికే అప్పుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం విమర్శలను ఎదుర్కుంటోంది. అయితే, అప్పులను అప్పులుగా కాకుండా పెట్టు బడులుగా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అప్పులు తప్పవని, అప్పులు చేయడం తప్పు కాదని ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా గతసంవత్సరం ఆశించిన ఆదాయ లక్ష్యాలను ఎందుకు చేరుకోలేక పోయారో కూడా ఆర్థిక మంత్రి సవివరంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తాయని అనుకున్న గ్రాంట్లు, ఇతరమార్గాల నుంచి ఆశించిన ఆదాయం ఆశించిన స్థాయిలో రాలేదు. అలాగే, పెద్దనోట్ల రద్దు ప్రభావం కొంత ఉంది. స్టాంప్ డ్యూటీ ఆదాయంపై పెద్దనోట్ల రద్దు ప్రభావం బలంగాపడింది. ఇలా అనేక కారణాల చేత ఆదాయం తగ్గడంతో అంచనాలు తప్పి బడ్జెట్ కోతకు గురైందని ఆర్థిక మంత్రి వివరణ ఇచ్చారు. నిజానికి ఇలా లెక్కతప్పడం అనేది సాధారణ విషయం. అయితే, ప్రధాన ప్రాధాన్యతా రంగాలలో పెద్ద ఎత్తున కోత పడడటం కొంత ఆలోచించవలసిన విషయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రణాళిక నిధుల్లోనే భారీగా కోతపడింది. సాగునీటి రంగానికి కేటాయిం చిన రూ.25 వేలకోట్లలో ఇంచుమించుగా రూ. 10 వేలకోట్ల మేర కోత విధించారు. అదేవిధంగా సంక్షేమ రంగానికి కేటాయించిన రూ. 23, 473 కోట్లలో రూ. 1600 కోట్ల మేర కోతపెట్టి రూ.21,850 కోట్లతో సరిపుచ్చారు.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం

ఇక గతంలోంచి ప్రస్తుతంలోకి వస్తే, ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్, ముఖ్య మంత్రి కే. చంద్రశేఖర రావు 2017-18 బడ్జెట్ పేదల అనుకూల బడ్జెట్ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు ఆర్థిక మంత్రిని అభినందించారు. సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్‌ను రుపొందించామని ప్రభుత్వం ప్రకటించు కుంది. ప్రధానంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను పునరుజ్జీవింపచేసే లక్ష్యంతో బడ్జెట్ రూపొందించినట్లు ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. నిజమే, మనం ముందుగా పేర్కొన్న ఆర్థికసర్వే వివరాలను దృష్టిలో ఉంచుకుంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపచేసే లక్ష్యం స్వాగతించదగినదే. నిజంగా కూడా ఆర్థికమంత్రి ప్రగతి పద్దు రూ. 88 వేల కోట్లలో సింహభాగం సంక్షేమ రంగానికే కేటాయించారు. అదే సమయంలో ఇతర కీలకరంగాలను, మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, ఇంటింటికి పైపుల ద్వారా మంచినీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ, చెరువుల పునర్జీవనానికి చేపట్టిన మిషన్ కాకతీయ పథకాలకు నిధుల కొరత లేకుండా కేటాయింపులుచేశారు. గతసంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే, ఆర్థిక మంత్రి తరతమ బేధం లేకుండా అన్ని రంగాలకు కేటాయింపుల విషయంలో కొంత ఉదారంగానే వ్యవహరించారు. గతసంవత్సరం సాగునీటి రంగానికి రూ. 25 వేల కోట్లు కేటాయించారు. అందులో రూ.15 వేల కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. అయినా, ఈసారి మళ్ళీ గతానికి తగ్గకుండా రూ. 25 వేల కోట్లు కేటాయించారు. మరి ఈ సంవత్సరం అయినా అనుకున్న ఆవిధంగా ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు సాగుతాయా అనేది చూడవలసి ఉంది.

అదేవిధంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను పరిపుష్టంచేయాలన్న ప్రధానలక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ఆర్థికవ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయం వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,640 కోట్ల మేర కేటాయింపులు చేశారు. అయితే గతాన్ని గుర్తు చేసుకున్న మన కాళ్ళ ముందున్న అంకెలనే అర్థం చేసుకున్నా, లక్ష్యం చేరేనా

అనే సందేహం కలుగు తోందని, ఆర్థిక నిపుణులు సందేహాలను వ్యక్త పరుస్తున్నారు.

## బడ్జెట్ స్వరూపంలో మార్పులు

ఈసారి బడ్జెట్ రూపకల్పనలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల మధ్య రేఖను తుడిచేసి రెవిన్యూ పద్దును తెరపైకి తెచ్చారు. అయినా, పేరు ఏదైనా ప్రభుత్వంపై అనివార్య భారాలు అలాగే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, కార్యాలయాల ఖర్చులు, వడ్డీల చెల్లింపు వంటి అనివార్య ఖర్చులే నిర్వాహణ వ్యయంలో 82 శాతానికి చేరుకున్నాయి. ఇందుకు అదనంగా కొత్త జిల్లాల ఏర్పాటు కారణంగా అనివార్యంగా నిర్వాహణ వ్యయం మరికొంత పెరిగే అవకాశాన్ని కొట్టివేసే పరిస్థితి లేదు. అలాగే ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన విధంగా రానున్న రెండు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాల లక్ష్యం చేరేందుకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసి ముందుకుసాగుతోంది. ఇందుకు సంబంధిం చిన వ్యయ అంచనాలను బడ్జెట్‌లో పొందు పరిచారా లేదా అన్న విషయంలో అంత స్పష్టత లేదు.

## కుల వృత్తులకు కోట్ల దండాలు.

ఇక ఈ బడ్జెట్ ప్రధాన ఆకర్షణల విషయానికి వస్తే, పల్లె వెలుగుల సంక్షేమమే ప్రధాన ఆకర్షణగా ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణ పభుత్వం 30కి పైగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందుకు అదనంగా కుల వృత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో వృత్తుల వారీగా బడ్జెట్ కేటాయింపులు చేశారు. ముఖ్యంగా చేనేత, గొర్రెలు, చేపల పెంపకం, గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక క్షౌర శాలలు, దోభీ ఘాట్లు ఏర్పాటుకు ఆయా కుల వృత్తుల వారికి ఆర్థిక సహాయం, ఆధునిక పనిముట్ల పంపిణి, ఇలా అన్నివర్గాల్లో ఆనందాన్ని నింపేందుకు ఆర్థిక మంత్రి గట్టి కసరత్తే చేసారు. రాష్ట్రంలో నాలుగు లక్షల కుటుంబాలకు ఇంటికి 20+1 వంతున మొత్తం 84 లక్షల గొర్రెలను 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. అదేవిధంగా జలాశయాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తామనీ, ఇతర కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఆయా వృత్తి సంఘాల ప్రతినిధులను విదేశాలకు పంపి అధ్యయనం చేయిస్తామని వారి సూచనలు, సలహాల మేరకు మరిన్ని కొత్త పథకాలను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. అది కూడా బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా గొర్రెలు, మేకలు, చేప పిల్లల పెంపకం ఇతర కుల వృత్తులను ప్రోత్సహించడం ద్వారా దీర్ఘ కాలంలో వీటి ద్వారా రాష్ట్ర ఆదాయం పది వేల కోట్ల నుంచి ఇరవై వేల కోట్ల రూపాయల వరకు పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే క్రమంలో ఇంతవరకు అంతగా గుర్తింపుకు నోచుకోని అత్యంత వెనక బడిన (ఏమ్బీసీ) కులాలకు రూ. వెయ్యి కోట్లను బడ్జెట్‌లో కేటాయిం చారు. అదే విధంగా చేనేత రంగాన్ని సకల విధాలా ఆదుకునేందుకు కూడా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను, రాయతీలను ప్రకటిం చింది. మొత్తంగా చూస్తే, బియ్యం, విద్యుత్, సబ్సిడీలు, రుణ మాఫీ, విద్య, వైద్య సదుపాయాలు కాకుండా వెనకబడిన కులాల వారికీ రూ. 5,070.36 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

## ఇల్లు – పొలం

సొంత ఇల్లు, సొంత పొలం ఈ రెండూ అందరూ కోరుకునే కనీస కోరికలు. ఈ రెండు కోరికలను తీర్చేందుకు ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూమి, పేద ప్రజలు అందరికి రెండు పడకల ఇల్లు ఇచ్చేదుకు ముందు కొచ్చింది. ఈ రెండు పథకాలు కూడా అమలవుతున్నాయి. అందుకు కొనసాగింపుగా రెండు పడకల ఇళ్ళ నిర్మాణం విషయంలో ప్రభుత్వం గట్టి పట్టు మీదుంది. ఈ సంవత్సరాంతానికి రెండు లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయక పోతే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగేది లేదని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అది కూడా రాష్ట్ర శాసన సభలో అయన ఈ ప్రతిజ్ఞ చేశారు. అయితే బడ్జెట్‌లో మాత్రం వెయ్యి కోట్ల రూపాయలను మాత్రమే కేటాయిం చారు. మిగిలిన నిధులను ఇతర మార్గాల ద్వారా సమీకరిస్తారు. అదలా ఉంటే ఇప్పటికే కొనసాగుతున్న దళితుల భూమి పంపిణి కార్యక్రమం ద్వారా ఇంచు మించుగా మూడున్నర వేల కుటుంబాలకు మూడు ఎకరాల వంతున 9,664 ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణీ చేసింది, ఇందు కోసంగా రూ.406 కొట్లు ఖర్చు చేసింది. అదే క్రమంలో ప్రస్తుత బడ్జెట్‌లో కూడా ఇందుకు నిధులు కేటాయించారు.

## కళ్యాణ లక్ష్మికి కొత్త కళ

అదే విధంగా ఇప్పటికే అమలవుతున్న కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.51,116 నుంచి రూ.75,116 పెంచుతూ ప్రతిపాదనలు చేశారు. అలాగే గర్భిణీ స్త్రీలకు మూడు విడతల్లో విడతకు రూ. 4 వేలు వంతున మొత్తం రూ. 12 వేలు, ఆడ పిల్ల పుడితే అదనంగా మరో వెయ్యి రూపాయలు ఇచ్చేందుకు ఒక నూతన పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా చూస్తే మహిళా శిశు సంక్షేమానికి రూ.1,731.50 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

*తరువాయి 49వ పేజీలో...*

# జాతీయ సాంకేతిక శిక్షణాభివృద్ధికి ప్రత్యేకనిధి

**దేశంలో 400 మిలియన్ల మంది నిపుణులైన కార్మికులను తయారు చేసుకోవలసిన అవసరం ఉండగా 2022 నాటికి అందులో కనీసం 200 మంది నిపుణులనైనా సమకూర్చాలని మెహరోత్రా తదితరులు 2013లో ప్రతిపాదించగా దానిపై 2015 జాతీయ నైపుణ్యం పెంపుదల విధానం రూపొందించారు. భారతదేశంలో శ్రామిక నైపుణ్యం పెంపుదల అంశానికి తగిన నిధులు సమ కూర్చడం కేవలం మన పారిశ్రామిక సంస్థల్లో కొన్నైనా శ్రామిక నైపుణ్యం పెంపు అంశాన్ని తమ సాంఘిక సేవాకార్యక్రమాల్లో భాగంగా స్వీకరించడం లేదు.**

పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన విధంగా శ్రామిక నైపుణ్యం పెంచేందుకు అవసరమైన పెట్టుబడులను సమకూర్చ డంలో ఇప్పటివరకు మందకొడి విధానం కొనసాగింది. దేశంలో 400 మిలియన్ల మంది నిపుణులైన కార్మికులను తయారు చేసుకోవలసిన అవసరం ఉండగా 2022 నాటికి అందులో కనీసం 200 మంది నిపుణులనైనా సమకూర్చాలని మెహరోత్రా తదితరులు 2013లో ప్రతిపాదించగా దానిపై 2015 జాతీయ నైపుణ్యం పెంపుదల విధానం రూపొందించారు. అయితే ఏటా కనీసం 5 మిలియన్ల మందికైనా వృత్తి నైపుణ్య శిక్షణ లభించడం లేదన్నది వాస్తవం. శ్రామిక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను మరింత వేగవంతంగా విస్తృతపరచవలసి ఉంటుంది. భారతదేశంలో శ్రామిక నైపుణ్యం పెంపుదల అంశానికి తగిన నిధులు సమ కూర్చడం కేవలం పన్నులకే పరిమితమై పోయింది. మన పారిశ్రామిక సంస్థల్లో కొన్నైనా శ్రామిక నైపుణ్యం పెంపు అంశాన్ని తమ సాంఘిక సేవాకార్యక్రమాల్లో భాగంగా స్వీకరించడం లేదు. దీనిఫలితంగా మొత్తం పారిశ్రామిక శిక్షణ పొందిన వారిలో కనీసం 39 శాతంలో కూడా తగిన సామర్థ్యం లేకపోవడం వల్ల అతి కొద్ది సంస్థలు మాత్రమే తమ అవసరాలకు అనుగుణంగా అంతర్గత శిక్షణ సౌకర్యం కల్పిస్తున్నాయి.

దేశంలో శ్రామిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రపంచబ్యాంక్ ఋణం లభించడంతో స్వయం ప్రతిపత్తిగల సహాయమంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన శ్రామిక నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ చేపట్టిన బృహత్తర ప్రణాళికల అమలు కోసం మరిన్ని నిధులు సమకూర్చుకోవలసి ఉంటుంది. చాలా దేశాల్లో సాధించిన శ్రామిక నైపుణ్యాభి వృద్ధిలో చాలావరకు ప్రైవేట్ సంస్థలపాత్రే అధికం కావడం వల్ల అలాంటి నైపుణ్యాభి వృద్ధి కూడా ఆయా సంస్థల సొంతమే కావడం విశేషం. అయితే శ్రామిక నైపుణ్యం సహజంగా మొత్తం పారిశ్రామిక అవసరాలపై ఆధారపడేలా డిమాండ్ సరఫరాలకు అనుగుణంగా ఉంటే కొన్ని సంస్థల వైఫల్యాలకు విరుగుడుగా ఉపయోగపడుతుంది. ప్రైవేట్ వృత్తి శిక్షణ సంస్థలకు జాతీయ శ్రామిక నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆర్థిక సహాయం అందజేయడం వెనుక కూడా డిమాండ్ – సరఫరాలపైనే

**సంతోష్ మెహరోత్రా,** ప్రొఫెసర్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూ ఢిల్లీ.
E-mail: santoshmeh@gmail.com

ఆధారపడి ఉందన్నది గమనించదగ్గ అంశం. ప్రత్యేక విభాగాలకు సంబంధించిన శిక్షణ లభిస్తున్నప్పటికే ఆయా సంస్థల ప్రమేయం లేకపోవడంవల్ల మొత్తం మీద శిక్షణ పరిమితమైపోయి పేలవంగా ఉంటోందన్నది వాస్తవం. అందువల్ల నైపుణ్యాభివృద్ధి ప్రాతిపదికలపై మరిన్ని విభిన్న కోణాల్లో నుంచి ఆలోచించాల్సి ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి కోసం సంస్థలు కేటాయించిన ప్రత్యేక నిధులపై కొంత శాతం పన్నువిధించడం, కేటాయించిన సొమ్ములో శిక్షణ కోసం చేసిన ఖర్చును వాపసు చేయడం ద్వారా శిక్షణ కోసం కేటాయించిన ప్రత్యేకనిధిని భర్తీ చేసే పద్ధతిని సుమారు 63 దేశాలు అనుసరిస్తున్నాయి. బ్రెజిల్ తో సహా లాటిన్ అమెరికా దేశాలు, దక్షిణ ఆఫ్రికాతో సహా ఆఫ్రికా ఖండంలోని సహారా ప్రాంతంలోని మరో 17 దేశాలు, యూరోపు ఖండంలో 14, ఉత్తరాఫ్రికా-మధ్యధరా ప్రాంతంలోని 7 దేశాలతో పాటు ఆసియా ఖండంలోని మరో 7 దేశాల్లో కూడా ఇలాంటి నిధులు అందుబాటులో ఉన్నాయి.

**భారత దేశంలో ఇప్పుడు జాతీయ శిక్షణ నిధి ఎందుకు ఏర్పాటు చేయాలి?**

మొట్టమొదట ప్రస్తుతం కల్పిస్తున్న శ్రామిక నైపుణ్య శిక్షణ పరిధి పరిమితమైనది. శ్రామిక నైపుణ్యం గత దశాబ్దపు మధ్యలోనే ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికీ సాంకేతిక వృత్తి విద్యా శిక్షణ (టెక్నికల్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ -టీ వీఈటీ) విస్తృతపరచే కార్యక్రమం అభివృద్ధి మాత్రం మందకొడిగానే సాగింది. జాతీయ నైపుణ్యాభివృద్ధి మండలి (ఎన్.ఎస్.డి.సి) ఆర్థిక సహాయంతో వృత్తి శిక్షణ అందజేసే సంస్థలవల్ల శిక్షణ పొందేవారి సంఖ్య మాత్రం ఏటా 5 మిలియన్ల చొప్పున పెరుగుతున్నది. అయితే ఈ లెక్కన "మేక్ ఇన్ ఇండియా" లక్ష్యం నెరవేరడం సాధ్యం కాకపోగా, మన యువశక్తిని సక్రమంగా వినియోగించుకోలేకపోవడమేగాక, ప్రపంచ జనాభాలో కీలకమైన మనకు తగిన ప్రతిఫలాన్ని పొందడంలో కూడా విఫలమవుతాం! పన్నుల ద్వారా లభించే ఆదాయంలో కీలకమైన వైద్యం, విద్య, మౌలిక అవసరాలకు పెట్టుబడులు సమకూర్చడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావడం వల్ల నైపుణ్య శిక్షణకు కేటాయించే సొమ్ముతో ఏర్పడే ఆర్థిక లోటును అదుపు చేయవలసి ఉండడం మూడవ అంశం. శ్రామిక నైపుణ్య శిక్షణ వల్ల లబ్ధి పొందేది ప్రైవేట్ రంగమే గనుక నైపుణ్య శిక్షణకు లభించే పెట్టుబడులకు కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేట్ రంగమే మూలమవుతోంది. అందువల్ల కీలకమైన ఈ నాలుగో అంశంలో ప్రైవేట్ రంగానికి లక్ష్యాన్ని నిర్దేశించవలసి ఉంటుంది. ఇందుకోసం జాతీయ శిక్షణ నిధిని తొందరగా ఏర్పాటు చేయవలసి ఉంది. ఇదిఎలా రూపొందించాలో చర్చిద్దాం.

ఎ) సంఘటిత రంగంలోని భారీ, మధ్యతరహా పరిశ్రమల నుంచి పన్ను రూపంలో కొంత సొమ్ము వసూలు చేయడం: ఉత్పత్తి విభాగంలో 85 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న అసంఘటిత రంగం నుంచి లభించే ఉత్పత్తి వాటా 22 శాతం మాత్రమే. అందువల్ల ఉత్పత్తి విభాగంలో ఎక్కువ వాటా కలిగి తక్కువ ఉపాధి కల్పిస్తూన్న సంఘటిత రంగంలోని పరిశ్రమల నుంచి శ్రామిక నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా అసంఘటిత రంగంలో పెద్ద సంఖ్యలో ఉన్న చిన్న తరహా సంస్థల నుంచి పన్ను వసూలు చేస్తే తీవ్రమైన వ్యతిరేకత కూడా ఎదురవుతుంది.

బి) సంఘటిత, అసంఘటిత రంగాలలో రెండింటి నుంచి లబ్దిదారులకు అవకాశం : అసంఘటిత రంగంలో చాలామంది కార్మికులు తమకు అనధికారికంగా లభించిన శిక్షణతోటే ఉద్యోగరీత్యా విధులు నిర్వహిస్తున్నారు. అందువల్ల వారికీ అధికారికంగా శిక్షణ ఇచ్చేనందుకు నిధులు కేటాయించాల్సి వుంటుంది. అయితే శిక్షణ కార్యక్రమాల వల్ల భారీ మధ్యతరహా పరిశ్రమలే ఎక్కువ లబ్ధిపొందే అవకాశం ఉండడం వల్ల వాటినుంచి పెద్ద ఎత్తున సొమ్ము సేకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతంఉన్న అప్రెంటిస్ షిప్ ప్రోగ్రాం (1961) చట్టాన్ని మరింత చురుకుగా అమలు చేయాలి. ఈ కార్యక్రం అమలు వల్ల ఎవరెవరు ఎంతెంత లబ్ది పొందుతారో గుర్తించి ఆమేరకు ఖర్చులో వాటాలు నిర్ణయించేందుకు సంఘటిత, అసంఘటిత రంగాలలో లబ్దిదారులైన పారిశ్రామిక వేత్తలతో చర్చించి నిర్ణయించాలి. ఇందువల్ల పన్నుల ద్వారా లభించే సాధారణ నిధుల నుంచి అసంఘటిత రంగంలో కార్మికులకు సాంకేతిక శిక్షణ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించవచ్చు

సి) నైపుణ్య స్థాయిలో శిక్షణ పొందేవాళ్లకు ఉపకార వేతనాలు: అందుబాటులో ఉన్న శిక్షణ పొందడమన్నది సరఫరాను బట్టి శిక్షణ కాగా అందులో కూడా నైపుణ్య స్థాయికి చేరుకోవడమన్నది డిమాండుకు అనువుగా శిక్షణ పొందడమవుతుంది. అయితే మనదేశంలో చాలాకాలంగా డిమాండ్ ఆధారితమైన నైపుణ్య శిక్షణ మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న యువకులు ఆర్థిక స్తోమతు లేకపోవడం వల్ల ఉద్యోగంలో ప్రవేశించే ముందుగానే నైపుణ్య శిక్షణ పొందలేకపోతున్నారు. అలాంటి పేద విద్యార్థులు ఒకవైపు ఉద్యోగం చేస్తూనే నైపుణ్యసాధనకోసం శిక్షణపొందేందుకు వీలుగా ఈ ప్రత్యేక నిధులను వినియోగించవచ్చు. ఇందువల్ల పేదవిద్యార్థులు ఒకవైపు ఉద్యోగం

చేస్తూనే మరోవైపు నైపుణ్య శిక్షణ పొందడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఏకమొత్తంగా మంజూరు చేస్తున్న గ్రాంట్ చాలా స్వల్పమైనది కావడంవల్ల ఆశించిన విధంగా వినియోగపడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

చైనాలో విద్యార్థులను సాంకేతిక శిక్షణవైపు మళ్లించేందుకు వీలుగా తగిన ఆర్థిక సహాయం అందజేసి ప్రోత్సహిస్తున్నారు. తొమ్మిదేళ్ల నిర్బంధ ప్రాథమిక విద్యను అభ్యసించిన పిల్లల్లో సగం మంది వృత్తి విద్యల్లో శిక్షణ అందజేసే సీనియర్ సెకండరీ పాఠశాలల్లో చేరుతున్నారు. ఈ స్థాయిలో వృత్తివిద్య శిక్షణను 2005 నుంచి దేశంలోని గ్రామీణ పట్టణ ప్రాంతాలని తేడా లేకుండా అందరు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నారు. అంతేగాక గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణాలకు వచ్చి శిక్షణ పొందే పేదవిద్యార్థులకు వసతి ఖర్చుల కోసం మరో 500 యువాన్లు అదనపు ప్రోత్సాహకంగా అందజేస్తారు. అయితే కొత్తగా పన్ను విధించి జాతీయ శిక్షణ నిధి ఏర్పాటు చేయడంపై కొన్ని విమర్శలు వస్తున్నాయి.

1. ఆర్థికమాంద్యం వల్ల గత కొద్ది సంవత్సరాలుగా పెట్టుబడులు తగ్గిపోతున్న తరుణంలో ఇప్పుడు కొత్తగా మరో పన్ను వేయడం వల్ల మరింత సంక్షోభం ఎదుర్కోవలసి వస్తుందని పరిశ్రమలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదివరకే ప్రాథమిక విద్య సెస్ ఉండగా ఇటీవల ఉన్నత విద్య సెస్ వేశారని, ఇప్పుడు సాంకేతిక శిక్షణ కోసం మరో పన్ను పారిశ్రామిక వర్గాలు భరించలేవని కొందరు హెచ్చరిస్తున్నారు. అయితే ప్రాథమిక సత్యాలను విస్మరించిన ఈ వాదనలను సులువుగా కొట్టివేయవచ్చు. నిపుణులైన కార్మికులు దొరకనందువల్ల ఉన్న నైపుణ్యం కలిగిన కొద్దిమంది కార్మికులకు వారి ఉత్పత్తి దామాషాకంటే చాలా ఎక్కువ జీత భత్యాలు చెల్లించుకోవలసి వస్తోంది. ఇందువల్ల ఉత్పత్తి, సేవల ఖర్చు పెరగడంతో ధరలు కూడా పెంచవలసి వస్తోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగిపోయి వస్తుసేవలకు డిమాండ్ పడిపోతోంది. అయితే దాదాపు 12 ఏళ్ల తర్వాత ప్రాథమిక విద్య సెస్ ను పూర్తిగా ఎత్తివేసి ఆమేరకు సాధారణ బడ్జెట్ నిధులనుంచే సొమ్ము కేటాయించాలనిప్రభుత్వం భావిస్తున్నది.
2. ప్రభుత్వఆధీనంలోని నిధుల నిర్వహణ తీరు పేలవంగా ఉంటుండగా ఆ నిధుల పై ఆధారపడి శ్రామిక శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రైవేట్ సంస్థలు సిద్ధంగా లేవు. ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఈ దశలో జాతీయ శిక్షణ సంస్థ నిధుల నిర్వహణలో బ్రెజిల్ తరహాలో ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యం కల్పించవచ్చు. ఒక్కొక్క రంగానికి సంబంధించిన పరిశ్రమలు సంబంధిత శిక్షణ కార్యక్రమాలకోసం ప్రత్యేక నిధుల నిర్వహణ బాధ్యత స్వీకరించవచ్చు. ఆయారంగాల్లో నిపుణులైన కొందరు ప్రత్యేక వ్యక్తుల ఆధ్వర్యంలో నిధుల నిర్వహణకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయవచ్చు. ■

*46వ పేజీ తరువాయి...*

## తెలంగాణ బడ్జెట్ లక్ష్యం సకల జనుల సంక్షేమం

**ఎస్ సి - ఎస్టీలకు ..**

చివరగా చెప్పుకోవలసిన విషయం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బడ్జెట్ స్వరూపంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో షెడ్యూలు కులాలు, తెగల ఉప ప్రణాళికలో మార్పులు అనివార్యమయ్యాయి. ఈ నేపథ్యంలో వారికి కేటాయించిన నిధులు వారికే ఖర్చు చేయాలన్న మౌలిక సూత్రానికి కట్టుబడి ప్రభుత్వం, ఉప ప్రణాళికకు బదులుగాఆయా వర్గాల జనాభా నిష్పత్తి ఆధారంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబైదించిన బిల్లును రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించింది.

ఆసరా పింఛన్ల విషయంలో కూడా ప్రభుత్వం మరో ముందడగు వేసింది. ఇంతవరకు పింఛన్ పొందుతున్న వారికి తోడుగా ఒంటరి మహిళలకు కూడా పథకాన్ని వర్తింపచేయాలనీ ప్రభుత్వం నిర్ణయించింది. ఫీజు రీయింబర్స్‌కు రూ. 1,939.93 కోట్లు కేటాయించారు. ఇతర సంక్షేమ పథకాల కోసంగా పాత్రికేయులు సహా వివిధ వర్గాలకు సముచిత రీతిలో నిధులను కేటాయించారు. ఇలా ఏ కోణం నుంచి చూసినా తెలంగాణా ప్రభుత్వం ప్రతిపాదించిన 2017-18 బడ్జెట్ సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ఉంది. ■


### సూచన

యోజన చందాదారులకు ప్రతి నెలా ఒకటి, రెండవ తేదీల్లో ఠంచనుగా వారి సంచిక పోస్టులో వెళ్లిపోతుంది. ఎవరికైనా అందకపోతే వారి పోస్టుమ్యాన్‌ను సంప్రదించి చిరునామాను సరిచూసుకోవాలి. సంచిక అందక పోతే యోజన బాధ్యత వహించదు. ఇందులో ఉత్తర ప్రత్యుత్తరాలకు, టెలిఫోన్ సంభాషణలకు అవకాశంలేదు. గమనించగలరు.

*- సీనియర్ ఎడిటర్*

సానుకూల ప్రభావం

# కార్మికుల ఉపాధి, వలసలు, వేతనాలు - విశ్లేషణ



**కార్మిక మార్కెట్లపైనా, వలసల తగ్గింపులోనూ ఉపాధి హామీ పథకం ప్రభావం నామమాత్రంగా ఉన్నప్పటికీ వేతనాల పెంపు భారీగా ఉన్నట్లు విశ్లేషణలో వెల్లడైంది. పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగాన్ని కట్టడి చేసే స్థాయిలో ఈ పథకం లేదని తెలుస్తోంది. ఉపాధి హామీ పథకానికి ప్రాచుర్యం కల్పించేలా ప్రచారం నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో, సాధారణ ప్రజానీకంలో అవగాహన పెంచే విధంగా ఉండాలి.**

భూమి, నీరు, పచ్చదనం వంటి ప్రాకృతిక వనరులను విస్తారంగా, దీర్ఘకాలికంగా వినియోగించుకోవడంతో అది వ్యవసాయ దిగుబడులు, ఉపాధి అవకాశాలపై తిరోగామి ప్రభావాన్ని చూపించింది. అదే సమయంలో పేదరికం, నిరుద్యోగం పెరగడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయి, వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరగడానికి దారి తీసింది. 1981లో 7.08 మిలియన్లు ఉన్న వ్యవసాయ కార్మికులు 2008 నాటికి 121 మిలియన్లకు పెరిగారు. సరిగ్గా ఇక్కడే చిన్న, మధ్య తరహా రైతులు సాగు చేసే భూమి శాతం 1971లో 70 శాతముంటే, 2001 నాటికి 82 శాతానికి పెరిగింది. ఈ సమస్యను అధిగమించడానికి ఖచ్చితమైన చర్యలు తీసుకోవడం పాటు, సమ్మిళిత వృద్ధిపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఒక నిర్దిష్ట కాలపరిమితికి లోబడిన ఫలితాలను సాధించడానికి ప్రధాన కార్యక్రమాల ద్వారా ప్రాధాన్యతా రంగాలపై దృష్టి పెట్టడమే సమ్మిళిత వృద్ధిగా నిర్వచించడం జరిగింది. వీటిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా ఒకటిగా ఉంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి కనీసంగా వంద పని దినాలను కల్పించడమే లక్ష్యంగా 7, సెప్టెంబర్, 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చట్ట రూపం ఇచ్చారు. ఈ పథకం పరిమాణం కారణంగా ఏటా దాదాపు రూ.40,000 కోట్లతో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజా పనుల పథకంగా రికార్డు సృష్టించింది.

ఏడాదిలో వంద రోజుల పనికి హామీ ఇచ్చే ఈ చట్టం జాతి జనుల ఆకాంక్షను ప్రతిఫలిస్తోంది. ఉపాధి హక్కు న్యాయ బద్దమైన హక్కు ఉంటూ పేదలు, నిరాశ్రయులకు అనుకూలంగా ఉంటోంది. ఈ దిశగా జరిపిన పరిశోధనల్లోని కొన్ని అంతరాలను కింది విధంగా ఇవ్వడం జరిగింది.

* జాతీయ ఉపాధి హామీ పథకం సరిగ్గా లక్షిత కార్మిక సమూహాలను విధాన కల్పన, అమలులో లక్ష్యం చేసుకుందా?
* జాతీయ ఉపాధి హామీ పథకం కారణంగా వ్యవసాయ కూలీల వేతనం పెరిగిందా? ఈ కారణంగా కోతల సమయంలో కూలీల లభ్యత తగ్గిందా?
* ఉపాధి లేక ఒత్తిడి గురైన వలసలపై ఉపాధి హామీ పథకం ప్రభావం ఏమైనా ఉందా?

**యు. హేమంత్ కుమార్,** అసోసియేట్ ప్రొఫెసర్, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, హైదరాబాద్.
E-mail: hemanthakumar2010@gmail.com
**బి. సుజాత,** పరిశోధక సహాయకులు, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, హైదరాబాద్. E-mail: bottugalla.sujatha@gmail.com

**లక్ష్యాలు:**

* ఒత్తిడితో కూడుకున్న వలసలు, వ్యవసాయ రంగం వంటి అంశాల్లో కూలీల మార్కెట్లపై ప్రభావాన్ని అంచనా వేయడం.
* కుటుంబాలకు భద్రమైన, వృద్ధి చెందిన ఆదాయ కల్పనలో భాగస్వామ్య ప్రక్రియను తెలుసుకోవడం.

**విధానం:**

ఈ అధ్యయనం రెండు రాష్ట్రాల్లో అంటే కర్నాటక, జార్ఖండ్‌ల్లో కొనసాగింది. ఈ ఎంపిక చేసిన రెండు రాష్ట్రాల్లోని పేదలకు వ్యవసాయం అన్నది ప్రధాన ఆదాయ వనరు కావడంతో, అందుబాటులో ఉండే వనరులు, సుస్థిరతకు కావాల్సిన పరిస్థితులు, అనుకూలంగా మల్చుకొనే లక్షణాలు ఈ రెండు రాష్ట్రాల్లో వైవిధ్య భరితంగా ఉంటాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రతి రాష్ట్రం నుంచి నాలుగు గ్రామాలను ఎంచుకోవడం జరిగింది. ప్రతి గ్రామంలో అధ్యయనం కోసం 50 నమూనాలను ఎంచుకోవడం జరిగింది (ప్రతి గ్రామంలో యాభై శాంపిల్స్ అంటే ఒక్కో రాష్ట్రంలో నాలుగు గ్రామాలను తీసుకు న్నందున అవి 200 శాంపిల్స్ కాగా, రెండు రాష్ట్రాల్లో కలిపి 400 శాంపిల్స్ అవుతాయి, పట్టిక:1). నేరుగా అక్కడక్కడా తీసుకొనే శాంపిల్ పద్ధతిని అధ్యయనం చేయడం కోసం ఇక్కడ అవలంభించడం జరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లోని ఎంపిక చేసుకొన్న గ్రామాల్లో తీసుకున్న శాంపిల్స్ అన్నీ కూడా జాతీయ ఉపాధి హామీ పథకంలో పాల్గొంటున్న కార్మికులే.

గ్రామీణ కూలీల మార్కెట్‌కి నియంత్రణ అన్నది సాంఘికంగా, ఆర్థికంగా బలంగా ఉన్న వారికి అనుకూలంగా ఉండడం చేత నిరుపేదలు, భూమి లేని వ్యవసాయ కూలీలు తమకు వీలుగా మలుచుకోవడం సాధ్యం కాదు. భూమి లేని కూలీలు, చిన్న రైతులు వంటి గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి మార్కెట్లలో నెలకొన్న సంక్షోభం నుంచి బయటపడడానికి వలస బాట పడుతుంటారు. ఈ విధంగా వేతనాలు, గ్రామీణ ఉపాధి మార్కెట్లు, వలసలు అన్నవి కేవలం జాతీయ ఉపాధి హామీ పథకంతో పాటుగా ఏక కాలంలో అమలవుతున్న ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ కింద మహిళా కిసాన్ సశక్తికరన్ పరియోజన (ఎమ్‌కేఎస్‌పి) వంటి పథకాల జోక్యంలోనూ అంతర్లీనంగా అనుసంధానమై ఉంటాయి. ఈ రెండు శాంపిల్ రాష్ట్రాల్లో ఉపాధి మార్కెట్లు అన్నవి చాలా సున్నితంగా ఉంటూ అవి నేల, నీరు, సాగు, భూ వినియోగం అదే విధంగా కరువు వంటివాటితో ప్రభావితం అవుతుంటాయి. వ్యవసాయేతర ఆదాయం పెరగడంతో వ్యవసాయ రంగంలో పని చేసే కూలీలు ఆ రంగాన్ని వదిలి వ్యవసాయేతర పనులకు మరలడాన్ని తొలి దశలో గుర్తిస్తే, అదే జాతీయ ఉపాధి పథకం, ఎమ్ఎస్‌కేపి వంటి పథకాల అమలుతో ఆ ధోరణి తిరోగమనం పట్టడం ఈ రెండు శాంపిల్ రాష్ట్రాల్లో గమనించడం జరిగింది.

* ఇందులో వ్యసాయ కూలీ, ఉపాధి పథకం, పశుపోషణ వంటివి ఇమిడి ఉన్నాయి. గత సంవత్సరం జాతీయ ఉపాధి హామీ పథకంలో మహిళలకు, పురుషులకు కల్పించిన ఉపాధి గణాంకాల ఆధారంగా ఈ పట్టిక రూపొందించడం జరిగింది. పని దినాల విషయంలో ఉపాధి కల్పన అన్నది గణనీయంగా పెరిగిందని రెండవ పట్టిక ద్వారా అర్థమవుతుంది. ఇక్కడే ఆసక్తికరమైన అంశం ఏంటంటే, ఈ రెండు శాంపిల్ రాష్ట్రాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో చిన్న తరహా రైతులు, భూమి లేని కూలీలు, నిరాశ్రయులకు పనిదినాలు పెరగడం కనిపించింది.
* సమూహాల ఆధారంగా సంస్థలను బలోపేతం చేయడం, పౌర సమాజాల పాత్ర గ్రామీణ ఉపాధి మార్కెట్ల వృద్ధికి దోహదపడడమే కాకుండా ప్రభుత్వ పరంగా, పాలన పరంగా తీసుకున్న చర్యలు, అంకిత భావం వలసలను అరికట్టడంలో ఉపాధి కల్పనకు సహాయపడ్డాయి.
* వ్యవసాయం, ఉపాధి కల్పన అమలులో ఒక సానుకూల అంశంగా పనిచేసిందని చెప్పాలి.
* ఎమ్‌కేఎస్‌పీ, జాతీయ ఉపాధి హామీ పథకంతో పాటు వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలు దిగుబడిని పెంచడానికి, వృద్ధి సాధించడానికి దోహపడ్డాయి.

**వలసలు మరియు ఉపాధి హామీ పథకం**

కుటుంబాల్లో ఆర్థిక వత్తిళ్లకు అనేక

**పట్టిక 1: శాంపిల్ రూపురేఖలు**

| రాష్ట్రం | జిల్లా | బ్లాక్ | గ్రామం పేరు | శాంపిల్ సైజ్ |
|---|---|---|---|---|
| కర్ణాటక | తుంకూరు | గుబ్బి | చేలూరు | 50 |
| | | | హొసకేరె | 50 |
| | గుల్బర్గా | సేదమ్ | ముదోల్ | 50 |
| | బెల్గామ్ | రాయ్‌బాగ్ | సవాసుద్ది | 50 |
| జార్ఖండ్ | రామ్‌గఢ్ | మందు | బొంగబర్ | 50 |
| | | | గర్గాలి | 50 |
| | తూర్పు | ఘట్‌సిల | ధైన్‌మరి | 50 |
| | సింగమ్‌బురి | పటమ్డే | గెరువాల | 50 |

కారణాలున్నాయి. ఉపాధి హామీ పథకం నేరుగా తన రూపురేఖలు, ఆచరణ ద్వారా వలసలపై దృష్టి సారించలేదని చెప్పాలి. అయితే, స్వయం సహాయ బృందాలను బలోపేతం చేయడం ద్వారా పౌర సమాజాల జోక్యంతో పాటు ఎమ్‌కేఎస్‌పీ కింద వ్యవసాయ వైవిధ్యత సాధించడంతో వలసలను ప్రత్యేకించి సీజనల్ వలసలను తగ్గించడం జరిగింది. వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఉపాధి హామీ పథకం పనులు కొంత మేరకు వలసలను తగ్గించడానికి దోహదపడ్డాయి.

**ఉపాధి లభ్యతలో అనిశ్చితి:**

ఉపాధి హామీ పథకం లోపాల్లో పనులు కేటాయింపుల్లో తగ్గుదల, వేతనాల చెల్లింపులో జాప్యం ముఖ్యమైనవి. ఈ విషయాన్ని శాంపిల్ రాష్ట్రాల్లో గుర్తించడం జరిగింది. క్షేత్రస్థాయి గణాంకాల ప్రకారం వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా బాగా డిమాండ్ ఉన్నప్పటికీ ఉపాధి హామీ పనులకు చాలా మంది దూరంగా ఉంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చాలా మందికి అందుబాటులోకి రాకపోవడం, వేతనాల చెల్లింపులో జాప్యంతో ఈ పనులకు డిమాండ్ లేకుండా పోతోంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల కారణంగా కూడా పనులు లభ్యతలో అనిశ్చితి నెలకొంది. జాతీయ ఉపాది హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో వేతనాల చెల్లింపుకి ఆధార్‌ను అనుసంధానించిన తొలి రాష్ట్రం జార్ఖండ్‌లో కూలీలు సంతోషంగా ఉన్నామని చెబుతున్నారు. వేతనాలు తీసుకోవడానికి ఇక ఎంతమాత్రమూ బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని అంటున్నారు. అయితే 2015లో సుప్రీంకోర్టు ఈ ఆధార్ ఆధారిత చెల్లింపులను స్వచ్ఛందంగా అమలు చేయాలని, ఆదేశించింది. అయితే జార్ఖండ్‌లో ప్రభుత్వం ఆధార్ ఆధారిత చెల్లింపులను తప్పనిసరి చేసిందని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్యకర్తలు చెబుతున్నారు. "మాకు ఆధార్ కార్డు లేకపోతే ఉపాధి హామీ పథకం కింద పని దొరకదు. మాకు పని ఇమ్మని అడినప్పుడు ఆధార్ లేకపోవడంతో వారు పనులు ఇవ్వడం లేదని" అంటున్నారు. అదే కర్నాటకలో అయితే ఉపాధి పథకం అమలు చేస్తున్న ఉద్యోగుల్లో సమన్వయ లోపం కారణంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వార్షిక, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడంలో ఆలస్యం కారణంగా, లేబర్ బడ్జెట్ తయారీలోనూ జాప్యంతో వార్షిక ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహణలో తగ్గుదల కనిపించింది. ఈ రెండు రాష్ట్రాల్లో కనిపించిన మరికొన్ని సమస్యల్లో సాంకేతిక సహాయకుల కొరత, సమాచారం, విద్య, జాబితాలోని అంశాలపై వ్యయం, నిధుల విభజన, జాబ్ కార్డుల కోసం ఇంటింటికీ సర్వే చేయకపోవడం, నిర్వహణా లేమి, రికార్డులను సవ్యంగా నిర్వహించకపోవడం, ఇవ్వబడిన బడ్జెట్‌లో పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం, పనులు చేయడంలో యంత్రాలను వాడడం, సమీకృత కార్యకలాపాల లేమి, పథకం అమలును పర్యవేక్షించలేకపోవడం వంటివి ముఖ్యమైనవి. జార్ఖండ్, కర్నాటక రాష్ట్రాల్లో జరిపిన అధ్యయనాల ప్రకారం సకాలంలో కూలీలకు కింద పేర్కొన్న కారణాల కారణంగా వేతనాలు చెల్లించడం లేదు.

* జాబితాలో ఉన్న వారి పేరుపై కాకుండా ఇతరులు పనిచేయడం: జార్ఖండ్‌లో క్షేత్రస్థాయికి ఈఎమ్ఆర్ చేరకముందే ఇక్కడి కూలీలను ఉపాధి హామీ పథకం కింద పని చేయమని చెబుతారు. అయితే తరుచూ ఈ కింది కారణాల ప్రకారం ఈఎమ్ఆర్‌లో సంబంధిత కూలీల పేర్లన్నీ ఉండవు.

1) జాబ్ కార్డులో ఉన్న కూలీ పేరుకి ఎమ్ఐఎస్‌లో ఉన్న పేరుకి తేడా ఉంటుంది.

2) కూలీ పేరును తన ఎలక్ట్రానిక్ జాబ్ కార్డులో తన సమ్మతి లేకుండానే తొలగించడం జరుగుతుంది.

3) లేదా మరో జాబ్ కార్డులో లేదా ఈఎమ్ఆర్‌లో తనకు తెలీకుండానే పేరు ఉండడం మరో కారణమవుతోంది.

* పని చేసిన దినాలను సరిగ్గా రాయకపోవడం: పైన పేర్కొన్న విధంగా ప్రింట్ అయిన ఈఎమ్ఆర్ అన్నది కార్యక్షేత్రానికి చేరుతుంది. ఈలోగా కార్యక్షేత్ర నిర్వాహకుడు కూలీల అటెండెన్స్ కోసం ఒక కచ్చా జాబితా తయారు చేస్తాడు. దీన్ని తరువాత ప్రింటెడ్ ఈఎమ్ఆర్‌లోకి కాపీ చేస్తాడు. లేదా ఎఐఎస్‌లోకి చేరుస్తాడు. దీంతో ఉపాధి హామీ కార్మికుడి వేతనం రిస్కులో పడుతుంది.

* జాబితా పట్టిక పోవడం: ప్రింట్ అయిన ఈఎమ్ఆర్‌ని నింపిన తరువాత దాన్ని ఏ కారణంతోనైనా పోగొట్టుకుంటే, లేకపోతే దొరకకపోతే కంప్యూటర్ ఆపరేటర్ జీరో అటెండెన్స్‌ని నమోదు చేస్తాడు. దీంతో ఆ ఈఎమ్ఆర్‌లో పనిచేసిన కార్మికుడికి వేతనం అందదు.

* వేతనాల జాబితా లేదా ఎఫ్‌టీఓను సిద్ధం చేయకపోవడం: వేతనాల జాబితా లేదా ఎఫ్‌టీఓలను ఈ ఎమ్ఆర్ కోసం సిద్ధం చేయనప్పుడు, లేదా ఎఫ్‌టీఓలపై మొదటి లేదా రెండవ సంతకాలు చేయనప్పుడు ఈఎమ్ఆర్‌లో ఉన్న కార్మికుల వేతనాల చెల్లింపులు జరగకుండా నిలిచిపోతాయి. ఉపాధి హామీ పనుల నిర్వహకుల లోపాల వల్ల కాని, లేదంటే వారికి లంచాలు ఇవ్వకపోవడం వల్లకానీ ఇలా జరిగే అవకాశాలున్నాయి.

**వేతనాలు చెల్లింపు పూర్తి కాకుండా ఎమ్ఐఎస్‌లో పథకాన్ని రద్దు చేయడం:**

పూర్తి అయిన పనుల సంఖ్యను పెంచాలని మంత్రిత్వశాఖ నుంచి పదే పదే ఆదేశాలు వెళ్లినా, కొన్నిసార్లు స్థానిక నిర్వాహకులు అందరి వేతనాలు చెల్లించారని పూర్తిగా నిర్ధారించుకోకుండానే ఎఐఎస్‌లో పథకానికి చరమ గీతం పాడతారు. ఒకసారి ఈ పథకానికి చరమ గీతం పాడితే, ఎమ్ఐఎస్‌లోని ఈ ఎమ్ఆర్ నుంచి అటెండెన్స్ వివరాలను నమోదు చేయడం సాధ్యం కాదు లేదా తిరస్కరించిన ఎఫ్‌టీఓ లావాదేవీలను తిరిగి తయారు చేయడం వీలు పడదు. ఈ పథకాలను రాష్ట్ర స్థాయి ఎమ్ఐఎస్ లాగిన్ ద్వారా మాత్రమే పున:ప్రారంభించడం జరుగుతుంది. ఇలా ఈ పథకాలకి చరమ గీతం పాడడంతో వేతనాలు చెల్లింపులు జరగకపోవడంపై గ్రామీణాభివృద్ధి శాఖకి పలు ఫిర్యాదులు అందుతున్నాయి.

**బ్యాంక్, పోస్టాఫీసు అకౌంట్ లేకుండా పనిచేయడం:**

2008లో నేరుగా నగదు చెల్లింపుల అలవాటును బ్యాంకులు లేదా పోస్టాఫీసుల ద్వారా చెల్లించడానికి మార్చడం జరిగింది. అప్పటి నుంచి బ్యాంకు లేదా పోస్టాఫీసు అకౌంట్ లేని కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నారు. అయితే ఈ సమస్యను తరువాతి కాలంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వాహకులు అధిగమించారు. పోస్టాఫీసు, బ్యాంక్ అకౌంట్ లేని వారికి పనులు ఇవ్వడం మానేయడంతో ఈ సమస్య చాలా వరకు పరిష్కారమైందని చెప్పాలి.

**ఎమ్ఐఎస్‌లో సరైన అకౌంట్ నెంబర్ నమోదు కాకపోవడం:**

బ్యాంక్ లేదా పోస్టాఫీసు అకౌంట్ ఒక్కటి ఉంటే మాత్రం సరిపోదు. అకౌంట్ వివరాలను ఎమ్ఐఎస్‌లో సరిగ్గా నమోదు చేయడం అత్యవసరం. ఒక చెల్లుబాటు కాని అకౌంట్ నెంబర్‌ని నమోదు చేసినా చెల్లింపులు తిరస్కారానికి గురవుతాయి. అయితే తప్పుడు అకౌంట్ వివరాలను సరిచేసుకొనే అవకాశం ఉండడం, చెల్లింపుల కోసం వేతనాల జాబితాను మరోసారి రూపొందించడం సాధ్యమైనా ఇదంతా ఒక విసుగెత్తించే సుదీర్ఘ ప్రక్రియ కావడంతో కేవలం కొంతమంది ఉపాధిహామీ నిర్వాహకులు మాత్రమే ఈ విషయంలో శ్రద్ధ చూపిస్తున్నారు. ఇదే కాకుండా, ఒక వేళ నమోదు అయిన అకౌంట్ నెంబర్ వేరొకరికి చెందినదైనప్పుడు, అప్పుడు వేతనాలు ఆ వ్యక్తి అకౌంట్‌లో జమ అవుతాయి. తప్పుడు అకౌంట్‌లో జమ అయిన వేతనాలను తిరిగి పొందడం కూడా పెద్ద సమస్యగా తయారవుతుంది.

**ఎమ్ఐఎస్‌లో తప్పుడు ఆధార్ నంబర్ నమోదు కావడం:**

ఉపాధి హామీ పథకంలో కార్మికులకు వేతనాలను ఆధార్ ఆధారంగా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది. ఇక ఈ విధానంలో చెల్లింపుల ప్రయోజనాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉన్న నేపథ్యంలో ఇందులో కూడా కొన్ని సమస్యలున్నాయి. ఎఐఎస్‌లో కార్మికుడి ఆధార్ నెంబర్ తప్పుగా నమోదవుతే, ఆధార్ ఆధారంగా జరిపే చెల్లింపుల్లో ఆ కార్మికుడు లేదా కార్మికురాలు తన వేతనం పొందలేరు.

**సరైన అకౌంట్ కానిదానికి ఆధార్ అనుసంధానం కావడం:**

కార్మికుడి ఆధార్ నెంబర్ సరిగానే ఎఐఎస్‌లో నమోదు అయినా ఆధార్ ఆధారిత చెల్లింపులకు అది ఒక్కటే సరిపోదు. ఆ ఆధార్ నెంబర్ ఎఐఎస్‌లో తప్పుగా నమోదైన అకౌంట్ నెంబర్‌తో అనుసంధానమైతే కార్మికుడు తన వేతనం పొందజాలడు. దీంతోపాటు, ఒకటి కన్నా ఎక్కువ బ్యాంక్ అకౌంట్లు ఉన్న కార్మికుడికి ఆధార్‌తో అనుసంధానంతో వింత సమస్యలు ఎదురయ్యే అవకాశం కూడా ఉంది.

**ఉపాధి కార్డు నుంచి కార్మికుడి పేరు తొలగించడం:**

ఒక వేళ తనకు తెలియకుండానే ఎలక్ట్రానిక్ జాబ్ కార్డులో తన పేరు తొలగించి ఉంటే అప్పుడు ఈఎమ్ఆర్‌లో ఆ కార్మికుడి పేరు నమోదు చేయడం సాధ్యం కాదు. ఇలాంటి తొలగింపులకు పలు కారణాలుంటాయి. ఉదాహరణకి, ఎఐఎస్‌లో ఆధార్ నంబర్ లేదా ఫోటోని అప్‌లోడ్ చేయనప్పుడు కార్మికుల పేరు తొలగించే అవకాశం ఉంది లేదా ఒక పనికి సంబంధించి పరిమిత సంఖ్యలోనే కార్మికులను తీసుకోవాల్సి వచ్చినప్పుడు కూడా ఇలా జరుగుతుంది.

కార్మిక మార్కెట్, వలసలు, వేతనాలపై స్వయం సహాయ బృందాల ప్రభావం, పాత్ర పనికి డిమాండ్ సృష్టించడం, పనులు చేయించడం, పనులను గుర్తించడం, ఉపాధి హామీ పథకానికి తగిన కార్యక్షేత్రాల ఎంపిక, నిర్వహకులు ముసాయిదా వ్యయ పట్టిక తయారు చేయడం, పనులు పరిమితిని సిద్ధం చేయడం, ఎంత మంది కార్మికులు అవసరం అవుతారో గుణించడం, ఆయా పనులకు సంబంధించిన అంచానాలు రూపొందించడం, కూలీల ఆదాయ వ్యయాల తయారీలో భాగస్వామ్యం, ప్రాజెక్ట్ సమావేశాల్లో పాల్గొనడం, మస్టర్ జాబితా ప్రకారం పనులు చేపట్టడం, క్షేత్రస్థాయిలో అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో స్వయం సహాయ బృందాలు కీలక పాత్ర పోషిస్తాయి. వత్తిళ్లతో కూడుకున్న వలసలను ఆపడంలో, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో వేతనాలను ప్రభావితం చేయడంలో స్వయం సహాయ బృందాలు ప్రభావం స్పష్టంగా ఉంటుంది.

**మహిళలు, ఆర్థిక సమీకృతం:**

మహిళలు వ్యక్తిగతంగానూ, బృందాలుగానూ బ్యాంక్ అకౌంట్లు కలిగి ఉండడం కారణంగా వారి ఆర్థిక స్థాయి పెరుగుతుంది. ఎమ్‌కేఎస్‌పి కింద నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం సాధ్యమవుతుంది. శాంపిల్ గ్రామాల్లో స్థూలంగా కార్మిక మార్కెట్‌పై మహిళా ఆర్థిక స్వాలంభన విస్తారమైన ప్రభావాన్ని చూపించింది. కార్మికుల మార్కెట్‌పై ఉపాధి హామీ పథకం ప్రభావం నామమాత్రంగా ఉన్నప్పటికీ వలసలను తగ్గించడంలో వేతనాల బేరసారాల శక్తిని అమితంగా పెంచడంలో మాత్రం కీలక పాత్ర పోషించింది.

**ముగింపు:**

కార్మిక మార్కెట్లపైనా, వలసల తగ్గింపులోనూ ఉపాధి హామీ పథకం ప్రభావం నామమాత్రంగా ఉన్నప్పటికీ వేతనాల పెంపు భారీగా ఉన్నట్లు ఈ గణాంక సహిత విశ్లేషణలో వెల్లడైంది. ఈ విభాగాల ద్వారా రెండు శాంపిల్ రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగాన్ని కట్టడి చేసే స్థాయిలో లేదని తెలుస్తోంది. ఉపాధి హామీ పథకం ప్రభావం తక్కువగా ఉండడానికి అనేకానేక ఆచరణాత్మ సమస్యలు కారణంగా ఉన్నాయి.

* ఉపాధి హామీ చట్టం ప్రకారం మరియు భారత ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఐఈసి కార్యకలాపాలను ఉపాధి హామీ పథకానికి ప్రాచుర్యం కల్పించేలా నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో, సాధారణ ప్రజానీకంలో అవగాహన పెంచే విధంగా ఉండాలి. ఎక్కడైతే ఉపాధి హామీ పథకం గురించి సరైన అవగాహన లేదని గుర్తిస్తారో అక్కడంతా ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రాష్ట్రాల్లోని నిరుపేద లబ్ధిదారులకు ఈ పథకం గురించి సరైన అవగాహన లేదని తేలింది. ఉపాధి హామీ పథకం గురించి విస్తారమైన అవగాహనా కార్యక్రమాలు నిర్వహించకపోవడమే దీనికి కారణంగా గుర్తించడం జరిగింది.
* సామాజిక తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించకపోవడంతో దీని ప్రాయోజిత ప్రయోజనం దెబ్బతినడంతో ప్రజా ప్రయోజనం కూడా నెరవేరడం లేదు. దీంతోపాటు, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సామాజిక తనిఖీలు నిర్వహించకపోవడంతో ఫలితాలు ఆశించిన విధంగా రావడం లేదు. క్షేత్రస్థాయిలో తగినంత ప్రచారం లేకపోవడం కూడా దీనికి కారణంగా చెప్పాలి.
* ఆశించిన ఫలితాలకు, సాధించిన విజయాలకు మధ్య అంతరాయానికి తగినన్ని నిధుల కేటాయింపు లేకపోవడమూ ఒక కారణంగా ఉంటూ, మరోవైపు, అనేక దశల్లో నిధులు నిరుపయోగం ఉండడంతో పాటు, రాష్ట్రాలు, ప్రాజెక్టు అమలు చేసే ఏజెన్సీలు తగినన్ని నిధులను ప్రోగు చేసుకోవడం మరో కారణంగా చెప్పాలి.
* ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం బలంగా లేకపోవడం లేదా సరిగా పనిచేయపోవడం మరో కారణంగా భావించాల్సి వస్తుంది. సరైన ప్రచారం లేకపోవడం ప్రత్యేకించి పనులు కోసం చూసేవారు, పేదలకు ఈ యంత్రాంగం అందుబాటులో ఉండడం లేదు. ఈ పథకాన్ని మరింతగా పారదర్శకంగా మార్చడానికి, మరింత ప్రభావంతంగా అమలు చేసే యంత్రాంగం అవసరం ఎంతైనా ఉంది.
* చేసిన పనుల అంచనాలను రూపొందించడంలోని లోపాలే ప్రధానంగా వేతనాలకు చెల్లింపులో ఆలస్యానికి కారణమవుతాయి. వీటితో పాటు, సాంకేతిక అనుభవ రాహిత్యం కూడా మరో కారణంగా ఉండడంతో, అంచనాలను రూపొందించడం, బిల్లులు తయారు చేయడం ఆచరణాత్మక సమస్యలుగా ఉన్నాయి. దీంతోపాటు, జూనియర్ ఇంజనీర్లు, సాంకేతిక సహాయకులు చేపట్టే పనుల పరిమాణాన్ని క్రమం తప్పకుండా సరైన రీతిలో గణించలేకపోతున్నారు. పనుల పరిమాణంతో నిమిత్తం లేకుండానే కార్మికులందరూ పూర్తిస్థాయి వేతనం పొందాలి. చెల్లింపుల్లో జాప్యాలు, లోపాలను సరిదిద్దడానికి, అందరికీ అందుబాటులో ఉండే యాంత్రాంగాన్ని రూపొందించాలి.

ఇక్కడే మరో ఆసక్తికరమైన అంశమేంటంటే, ఉపాధి పథకం ఎమ్‌కేఎస్‌పీతో అనుసంధానమైన ప్రతి చోట సానుకూల ప్రభావం కనిపించింది. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యతిరేకించే సాంఘికంగా బలంగా ఉన్న కాంట్రాక్టర్లు, మధ్య దళారీల చెర నుంచి కూలీలు బయట పడడానికి మహిళా స్వయం సహాయక బృందాలు సహాయ పడడం పెద్ద విజయంగా భావించాలి. ఆర్థిక సాధికారత, ఆర్థిక సమీకృతం అన్నవి లింగ సమానత్వాన్ని, సాధికారతను సాధించడంలో కీలకంగా ఉంటాయి. తీసుకున్న రెండు శాంపిల్ రాష్ట్రాల్లో విస్తృత స్థాయిలో సాంఘిక, రాజకీయ రంగాల్లో ఆర్థిక సాధికారత నుంచి నాయకత్వం వరకు స్వయం సహాయ బృందాలు కీలక పాత్ర వహించడం గమనార్హం.

■

# జాతీయ వలస విధానం వైపుగా అడుగులు




**భారత పౌరులు దేశంలో ఎక్కడికైనా వెళ్ళవచ్చును, ఎక్కడైనా నివాసం ఉండ వచ్చును. ఈ స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది. అయితే కొన్ని రాష్ట్రాలలో విద్యా సంస్థలలో ప్రవేశం, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల విషయంలో స్థానికులకు ప్రాధాన్యత, ప్రత్యేక కోటా అమలవు తున్నాయి. ఈ నేపథ్యంలో "ఉద్యోగ, ఉపాధి రంగాలలో వివక్షను నిరోధించేందుకు స్థానిక హోదా అర్హతను తొలిగించేలా రాష్ట్ర ప్రభుత్వాలు క్రియాశీలంగా వ్యవహరించ వలసిన అవసరం ఉందని" అధ్యయన బృందం సిఫార్సు చేసింది.**

అంతర్గత దేశీయ వలసలకు సంబంధించి మన దేశానికీ ఒక విధానం అంటూ లేదు. కానీ, అలాంటి విధానం అవసరం మాత్రం ఉంది. అంతర్గత వలస విధానం వలన నివాస అవసరాలు, ఆర్జిత ప్రయోజనాలు లేదా ప్రతిఫలాల బదిలీ వంటి అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇంతవరకు మన దేశంలో వలసలకు సంబంధించిన ఏదైనా చట్టం, విధానం ఉందంటే అది, వలస కార్మికులకు సంబంధించిన 1979 నాటి అంతర్ రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి నియంత్రణ – సేవ పరిస్థితులు) చట్టం మాత్రమే. ఈ చట్టం పరిధికి ఆవల సమగ్ర చట్టానికి దారిచూపే విధానం ఏదీ లేదు. అయితే, ప్రస్తుతం వలసల స్వభావ, స్వరూపాలు మారి పోయాయి. బహుముఖాలుగా విస్తరించాయి. ఫలితంగా సమస్య మరింత జటిలంగా, సంక్లిష్టంగా మారింది. అవసరాలు లేదా నైపుణ్యం ఆధారంగా వలసలు జరుగు తున్నాయి. ఇది నిజం. ఇందులో ఆశ్చర్య పరిచే విషయం ఏదీ లేదు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ – ఒరిస్సా రాష్ట్రాల మధ్య కుదిరిన అంతర్రాష్ట్ర వలస కార్మికుల, ముఖ్యంగా ఇటుక బట్టీలలో పనిచేసే వలస కార్మికుల హక్కుల పరిరక్షణ అవగాహన ఒప్పందం సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికుల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలే ఇందుకు నిదర్శనం. ఒక నిర్దిష్ట చట్టం అంటూ ఏదీ లేక పోయినా ప్రతి సంవత్సరం లక్షలాది మంది కార్మికులు రాష్ట్రంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి లేదా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి శాశ్వతంగా లేదా తాత్కాలికంగా ఉపాధి కోసం వలసలు పోతూనే ఉన్నారు. ఇందులో ఎక్కువ శాతం మంది తమ తమ రాష్ట్రాలలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలు పోతుంటే, ఇతరులు రాష్ట్రాలు దాటి పోతున్నారు. అంతర్రాష్ట్ర, రాష్ట్రం లోపల జరిగే అంతర్ – జిల్లా వలసల మధ్య చాలా వ్యత్యాసం ఉంది. వలసకు గల కారణాలలో కూడా తేడా ఉంటుంది. వివాహం కారణంగా పుట్టిన ఊరు నుంచి వేరే చోటికివెళ్ళడం, చదువు కోసం వేరే ప్రాంతానికి వెళ్లడం, ఉపాధి కోసం ఇలా వలసల కారణాలు వేర్వేరుగా ఉంటాయి. సహజంగా మహిళలు వివాహ కారణంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళితే, పురుషులు సహజంగా ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళతారు. వీటికి తోడుగా,

**ఎస్ . చంద్రశేఖర్,** ఐ.జి.ఐ.డి.ఆర్., ముంబై.
E-mail: chandra@igidr.ac.in

విధానపరంగా చూస్తే, శాశ్వతంగా వలస వెళ్లే వారు, సంవత్సరంలో కొంత కాలం పాటు వలస వెళ్లే వారి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించవలసిన అవసరం కూడా ఉంది.

ఇక గణాంకాలలోకి వస్తే, 2011 జనాభా లెక్కల వివరాలు వెలువడక ముందు, పట్టణప్రాంత జనాభా పెరుగుదలలో గ్రామీణ - పట్టణ వలసల ప్రభావం అంచనాల పై చాలా ఆసక్తి ఉండేది. అయితే చాలా పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రాంత ప్రజలు శాశ్వతంగా పట్టణాలకు వలసలు పోతున్నారన్న అంచనాలు తప్పని, అందులో నిజం లేదని తేలిపోయింది. ఇదిలా ఉంటే, 1991-2001, 2001-2011 దశాబ్దాల మధ్య కాలంలో గ్రామీణ - పట్టణ ప్రాంత వలసలు 20-22 శాతం మధ్యనే ఉన్నాయని, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ పరిశోధకులు కన్‌హూ చరణ్ ప్రధాన్ అంచనా వేశారు. 2011 జనాభా లెక్కల వివరాల ప్రకారం చూస్తే 38 శాతం మంది ప్రజలు తమ జీవిత కాలంలో ఎప్పుడో అప్పుడు శాశ్వతంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస పోతున్నారు. 2001 - 2011 దశాబ్దంలో నగటున ప్రతి సంవత్సరం 15 లక్షల మంది పురుషులు, 3 లక్షల మంది మహిళలు శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస పోతున్నారు. ఇదే సమయంలో అనేకమంది ఇతరులు తాత్కాలికంగా అంటే తమ శాశ్వత చిరునామాలో మార్పు లేకుండా వలసలు పోతున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నవారే ఎక్కువగా ఉన్నారు. వీరు సంవత్సరంలో కొద్ది కాలం పాటు పని మీద ఇతర ప్రాంతాల్లో ఇంటికి దూరంగా ఉంటారు. ఒక అంచనా ప్రకారం పది మిలియన్ కుటంబాలలో ఎవరో ఒకరు సంత్సరంలో 15 రోజుల కంటే ఎక్కువ 6 నెలల కంటే తక్కువ కాలం కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. ఈ కుటుంబాల నుంచి ఇంటికి ఒకరు చొప్పున కుటంబాలకు దూరంగా ఉంటున్నారని అనుకున్నా, పది మిలియన్ల మంది స్వల్ప కాలిక, కాలానుగుణ వలస కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని అనుకోవచ్చును.

ఈ గణాంక వివరాలను బట్టి చూస్తే ఏ సంవత్సరం అయినా, శాశ్వతంగా వలస పోతున్నవారికంటే తాత్కాలికంగా వలస పోతున్న వారి సంఖ్య 5.5 రెట్లు ఎక్కువగా ఉంది. అలాగే ఇలా తాత్కాలికంగా వలస పోతున్నవారిలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఉన్నారు. వయసుపరంగా చూస్తే వృద్ధుల కంటే యువకుల సంఖ్యే ఎక్కువగా ఉంది. స్వస్థలంలో ఉపాధి అవకాశాలు లేక పోవడం వలన యువత ఉపాధి అవకాశాలు ఉన్న ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. అక్కడి అవసరాలను తీరుస్తున్నారు. ఒక వేళ తాము వెళ్లిన చోట పని లేక పొతే వారు అక్కడ ఉండరు. స్వస్థలాలకు తిరిగి వెళతారు లేదంటే పని ఉన్న ఇతర ప్రాంతాలకు వెళతారు. ఇది వలస కార్మికులు సంవత్సరంలో కొంత కాలం మాత్రమే స్వస్థలాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారో తెలియ చేస్తుంది.

కాలమాన పరిస్థితులను బట్టి వలసలు వెళ్లే సీజనల్ వలస కార్మికులలో వ్యవసాయం, గనులు, సేవారంగాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. నిర్మాణ రంగంలో భారీ మౌలిక వసతుల నిర్మాణ పథకాలు, భారీ గృహ నిర్మాణ పథకాలు, చిన్నాచితకా రోడ్ల నిర్మాణం పనుల మధ్య స్వభావసిద్ధమైన వ్యత్యాసం ఉంటుంది. ఈ పనులలో తాత్కాలిక వలస కార్మికులు చాలా పెద్ద సంఖ్యలో ఉంటారు. ఒక అంచనా ప్రకారం ప్రాథమిక రంగంలో పనిచేసే వలస కార్మికులలో 36 శాతంమంది నిర్మాణ రంగంలో, 15 శాతం మంది సెకండరీ రంగంలో పనిచేస్తున్నారు. నిర్మాణ రంగంలో పనిచేసే వలస కార్మికుల పట్ల కాంట్రాక్టర్లు, యజమానులు, ప్రభుత్వాలకు గల విధులు - కర్తవ్యాలను 'ఇంటర్ స్టేట్ మైగ్రంట్స్ యాక్ట్' కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను నిర్దేశించింది. దీనితో పాటుగా, నిర్మాణ రంగ కార్మికులకు సంబంధించి మరో రెండు చట్టాలు, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ (రెగ్యులేషన్ అఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ కండిషన్స్ అఫ్ సర్వీస్ యాక్ట్ 1996. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ యాక్ట్ 1996 ఉన్నాయి. అయితే, ఈ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు సక్రమంగా అమలుచేస్తున్నాయి అనే విషయంలో అనేక సందేహాలున్నాయి. ఈ చట్టాల అమలులో లోపాలు, ఉల్లంఘనలకు సంబంధించి అనేక కేసులను హై కోర్టులు, సుప్రీం కోర్టు విచారించాయి. ఈ మూడు చట్టాలు కూడా వలస కార్మిలు, నిర్మాణ రంగ కార్మికుల పని నైజానికి, సంరక్షణకు సంబంధించిన చట్టాలు. ఆయితే, విధాన పరంగా చర్చించవలసిన సమస్యలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

'మేక్ ఇన్ ఇండియా'పై చర్చ సాధారణంగా 'భారత దేశంలో ఏమి తయారు చేయాలి' 'ఎక్కడ తయారు చేయాలి' అదే దిశగా సాగుతుంది.అంతే గాని 'ఎవరు' 'ఎక్కడ' 'ఏమి' తయారు చేస్తారు అనే దిశగా అంతగా సాగదు. ఇక్కడ గమనించవల్సిన విషయం, 'ఎవరు' అన్న ప్రశ్నకు వచ్చే సమాధానంలో గణనీయ సంఖ్యలో వలస కార్మికులు ఉంటారు.ఈ కోణంలో చూసినప్పుడు, వలస కార్మికులు .మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో అంతర్గత భాగస్వాములు. అయినా చర్చల్లో వారి ప్రస్తావన ఉండదు.

గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాలపై వలసల ప్రభావంపై అధ్యయనం జరిపిన బృందం సమర్పించిన నివేదిక దేశ ఆర్థిక వ్యవస్థలో వలస కార్మికుల

భాగస్వామ్యం, వాటా గణనీయంగా ఉందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణం – పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ 2015లో ఈ అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ జోక్యం ఎక్కడ, ఏ మేరకు అవసరం అన్నది గుర్తించి తదనుగుణంగా వ్యూహాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాటు చేసింది. అధ్యయన బృందం 2017లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో ప్రధానంగా నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ నిధిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదని గుర్తించింది. ఈ నిధులను అద్దె ఇల్లు, వసతి గృహాల ఏర్పాటుకు వినియోగించాలని అధ్యయన బృందం సూచించింది. అదే విధంగా వలస కార్మికులు సంవత్సరానికి గరిష్టంగా రూ.50 వేల కోట్లు తమ కుటుంబాలకు పంపుతున్నారు. కాబట్టి, ఆర్థిక మధ్యవర్తిత్వ ఖర్చును తగ్గించడం వలన ఆ మేరకు కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది. అలాగే, కార్మికుల ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణ చర్యలు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. అదే విధంగా ప్రజా పంపిణీ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఎక్కడైనా పొందే విధంగా (పోర్టబుల్) సదుపాయాన్ని కల్పించాలని నివేదిక పేర్కొంది.ముందుగా రాష్ట్ర స్థాయిలో ప్రజా పంపిణి వ్యవస్థ ప్రయోజనాలు ఎక్కడైనా పొందే విధంగా చేయడం అవసరం. ఛత్తీస్‌గఢ్ లాంటి కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఈ విధానాన్ని అమలుచేస్తున్నాయి. రాయపూర్‌లోని అన్ని చౌక ధరల దుకాణాలతో లబ్ది దారుల జాబితాను ప్రభుత్వం అనుసంధానం చేసింది. తద్వారా లబ్దిదారులు నగరంలో ఎక్కడినుంచయినా నిత్యావసర సరుకులు కొనుక్కునే సదుపాయం చేకూరింది. ఇదే విధానాన్ని రాష్ట్రంలోని ఇతర పట్టణాలకు కూడా విస్తరించారు. అయితే, ఇంతటితో అంతా అయిపోయిందని కాదు, ఇటీవల 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ'లో రాసిన వ్యాసంలో ఏ. జోషి, డి. సిన్హా, బి. పట్నాయక్ ఈ వ్యవస్థ మరింత సమర్ధవంతంగా పనిచేసేందుకు చేయవలసింది చాలా ఉందని పేర్కొన్నాడు. "తరచూ చౌక ధరల దుకాణం యజమానులకు – లబ్దిదారులకు మధ్య తలెత్తే సమస్య, అసంతుల్య అధికారులు" ఈ సమస్యపై దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. అని ఆ ముగ్గురు నిపుణులు అభిప్రాయం వ్యక్త పరిచారు.

రాష్ట్ర ప్రభుత్వాలు క్రియాశీలంగా వ్యవహరించవాల్సిన మరో క్షేత్రం, మరో సమస్య వలస కార్మికుల పిల్లల చదువులు. తల్లితండ్రులతో పాటు వచ్చే వలస కార్మికుల పిల్లలకు పాఠశాలలలో ప్రవేశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవలసిన అవసరం ఉంది. ప్రతి సంవత్సరం ప్రత్యేక రుతువులో వలసలు పోయే కార్మికుల పిల్లలు ఇంటి వద్ద ఉండిపోరు. తల్లి తండ్రులతో పాటు వారూ వెళతారు.. ఇలాంటి వారి కోసం ఒడిశా ప్రభుత్వం సీజనల్ హాస్టల్స్ నిర్వహిస్తోంది. యునిసెఫ్. మహారాష్ట్ర విభాగం ఆ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో తల్లి తండ్రులతో పాటు వలస వెళ్లే పిల్లల భద్రతకు తీసుకోవలసిన చర్యలను స్పష్టంగా పేర్కొంది. అక్కడే ఉండి పోవాలనుకునే పిల్లల సామాజిక భద్రతకు సంబంధించిన విధి విధానాలను రూపొందించి అమలు చేస్తోంది.

భారత పౌరులు దేశంలో ఎక్కడికైనా వెళ్ళవచ్చును, ఎక్కడైనా నివాసం ఉండవచ్చును. ఈ స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది. ఈ విషయాన్ని అధ్యయన బృందం గుర్తించింది. అయితే కొన్ని రాష్ట్రాలలో విద్యా సంస్థలలో ప్రవేశం, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల విషయంలో స్థానికులకు ప్రాధాన్యత, ప్రత్యేక కోటా అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో "ఉద్యోగ, ఉపాధి రంగాలలో వివక్షను నిరోధించేందుకు స్థానిక హోదా అర్హతను తొలిగించేలా రాష్ట్ర ప్రభుత్వాలు క్రియాశీలంగా వ్యవహరించవలసిన అవసరం ఉందని" అధ్యయన బృందం సిఫార్సు చేసింది. జాతీయ స్థాయిలో దేశీయ వలస విధానం, వలస కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ చట్టాల రూపకల్పనకు అధ్యయన బృందం చేసిన సిఫార్సులు, ఇప్పటికే అమలులో ఉన్న నిర్మాణ రంగ కార్మికులకు సంబంధించిన చట్టాలు... ఒక ముందడుగుకు... తొలి అడుగుగా నిలుస్తాయి. ■


యోజన
ప్రగతి పథంలో భారతదేశం
మే, 2017 సంచిక

*29వ పేజీ తరువాయి...*

**యంత్ర యుగం**

గురించి ఆలోచించకుండా సాంకేతికతపై పెట్టుబడులను పెంచుకుంటూ పోతే ఉత్పాదక సమస్యలు తలెత్తుతాయి. ఇప్పటికే, నైపుణ్యాలు ఉన్న శ్రామికుల కొరత పెరుగుతోంది. తయారీ సంస్థలు, యాంత్రీకరణతో పాటు తమవద్ద పని చేస్తున్న శ్రామికులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా ప్రణాళికలు అమలు చేస్తే, మారిన పరిస్థితులకు తగినట్లుగా వారు పనిచేస్తారు. లేకపోతే, దీర్ఘకాలంలో వ్యాపారాభివృద్ధి, ఉత్పాదకత తగ్గి పోతాయి. విభిన్న నైపుణ్యాలున్న శ్రామికులకు యాంత్రీకరణ ఏ విధంగా ఉపయోగపడుతుందన్నది ఒక పెద్ద సవాలు. ముందుగా యంత్రాల గురించి శ్రామికులకు తగిన శిక్షణ ఇప్పించకుండా అత్యాధునిక యంత్రాలను కొనుగోలు చేస్తే ఉపయోగం ఉండదు. స్థూల ఆర్థిక వ్యవస్థలో కార్మికుల స్థానంలో సాంకేతికత ద్వారా అత్యంతవేగంగా పనిచేసే యంత్రాలను సరసమైన ధరకు అందుబాటులోకి తీసుకు వస్తే, దీనివల్ల దీర్ఘకాలంలో సమస్యలు ఎదురవుతాయి. పెరుగుతున్న నిరుద్యోగం వల్ల సామాజిక ఐక్యత దెబ్బతింటుంది, వినియోగదారుల నుంచి డిమాండు తగ్గిపోయి ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుంది. సాంకేతికత, శ్రామికులు పరస్పరం ఒకదానికొకటి విరుద్ధమైనవనే ధోరణి తయారీదారులలో కనిపిస్తోంది. ఏది ఏమైనా, శ్రామికుల సమర్థతను పెంచేలా యాంత్రీకరణను కొనసాగించడం దీర్ఘ కాలంలో ఉత్తమ పరిష్కారం.

**ముందున్న మార్గం :**

ఏ వ్యాపారమైనా వృద్ధి చెందడానికి దీర్ఘకాల ప్రణాళికలే కీలకం. సాంకేతికత అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను పొందకుండా దాని దుష్ప్రభావాలను అధిగమించడానికి ప్రయత్నించడం సరైందికాదు. సాంకేతికత మార్పుల వల్ల ఉపాధి కల్పనపై పడుతున్న ప్రభావాలను, వినియోగదారులు, తయారీదారులకు కలుగుతున్న అవకాశాలు, వస్తుపంపిణీ నిర్వహణలో వాటాదారులకు కలుగుతున్న ప్రయోజనాలపై ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థలు అన్వేషణలు జరపాలి. నైపుణ్యంలేని శ్రామికులు ఎక్కువ సంఖ్యలో పనిచేసే భవన నిర్మాణ రంగం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. యాంత్రీకరణ వల్ల ఉత్పాదకతలో వస్తున్న మార్పులు, ఉపాధి కల్పన అవకాశాలు, కార్మికుల సంక్షేమం, యాంత్రీకరణ ప్రయోజనాలు పొందడం ఎలా అనే అంశాలపై సమాచార విశ్లేషణ, పరిశోధనలు జరగవలసి ఉంది.

**ముగింపు:**

నైపుణ్యాలేమీ అవసరం లేకుండా కేవలం మానవ శ్రమతో చేసే పనులు, ప్రమాదకరమైన ప్రదేశాల్లో చేసే పనులకు యంత్రాలను వినియోగించడం మంచిది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువ మంది కార్మికులు అవసరమయ్యే చోట్ల యంత్రాలను వినియోగించడం రెండు దశాబ్దాల క్రితమే మొదలైంది. అమెరికాలో ఒకప్పుడు వ్యవసాయరంగంలో 41 శాతం మంది శ్రామికులు పనిచేసేవారు. కానీ ఇప్పుడు కేవలం 2 శాతం మందే ఈ రంగంలో పని చేస్తున్నారు. మిగిలిన వారు ఇతర ఉపాధుల వైపు మళ్ళారు. సమగ్ర ఆర్థికాభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం సాంకేతికతను అందిపుచ్చుకోవడం తప్పనిసరి. నిరంతర వ్యాపారాభివృద్ధి కోసం నైపుణ్యాలను పెంపొందించు కోవడం, తిరిగి శిక్షణ పొందడం కీలకమైనవి. ఇందుకోసం మన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలలో మార్పులు చేసి మరిన్ని వృత్తి విద్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు “అను” 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

*సీనియర్ ఎడిటర్*

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

## లేబర్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ఎల్. ఐ. ఎన్.

కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన అన్ని వ్యవహారాలకూ ఏక గవాక్ష విధానంలో కేంద్ర ప్రభుత్వం శ్రమ సువిధ పోర్టల్‌ను ప్రారంభించింది. దీనివల్ల ఈ ఈఎస్ ఐ, ఈపిఎఫ్, సిఎల్‌సి, డిజిఎంఎస్ వంటి అంశాలపై ఒక సంస్థ యజమానికి ఇచ్చిన వివిధ గుర్తింపు నెంబర్లు అన్నీ రద్దయి ఒకే నెంబరు అమలులోకి వస్తుంది. దీనిని లేబర్ ఐడెంటిఫికేషన్ నెంబరు అంటారు. తమ వద్ద పనిచేసే కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ జమలు, ఈఎస్ఐ చెల్లింపులు వంటివాన్నిటినీ ఈ నెంబరు ద్వారా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు. ఈ శ్రమ సువిధ పోర్టల్‌ను HTTPS://SHRAMSUVIDHA.GOV.IN లో చూడవచ్చు. చట్టబద్ధంగా తమకు కేటాయించిన ఏ నెంబరు తోనైనా లాగిన్ అయి, శ్రమ సువిధ పోర్టల్‌లోని “KNOW YOUR LIN” ద్వారా తమకు కేటాయించిన ఎల్ఐఎన్ నెంబరును తెలుసుకోవచ్చు. వివిధ చట్టాల కింద దాఖలు చేయాల్సిన రిపోర్టులు, రికార్డులన్నిటినీ ఈ ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయవచ్చు.

## భారతీయ సృజనాత్మక సూచి ప్రారంభం

దేశీయ ఉత్పత్తులలో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్రం భారతీయ సృజనాత్మక సూచిని ప్రారంభించింది. ఈ సూచి ఆధారంగా అధిక సృజనాత్మక ఉత్పత్తులను చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహ ముంటుంది. భారతీయ పరిశ్రమల సమాఖ్య, పారిశ్రామిక విధాన ప్రోత్సాహక విభాగాల సహకారంతో నీతి ఆయోగ్ ఈ సూచిని రూపొందించింది. నీతి ఆయోగ్ వారి వెబ్ సైట్ ద్వారా ఈ సూచిని చూడవచ్చు. 128 దేశాల ప్రపంచ సృజనాత్మక సూచిలో మన దేశం ప్రస్తుతం 66వ స్థానంలో ఉన్నది.

## సామాజిక భద్రత హక్కు

ఇంతవరకు మనదేశంలో కార్మికులకు సామాజిక భద్రత అనేది కేవలం సౌకర్యంగానే ఉన్నది తప్ప, హక్కుగా లేదు. దీనివల్ల దేశంలోని అసంఘటితరంగ కార్మికులు దాదాపు 92 శాతం, మహిళా అసంఘటిత కార్మికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న కార్మికులు మొత్తంగాను, వ్యవసాయ కార్మికులలోనైతే కేవలం ఒక్క శాతం మాత్రమే ఏదో ఒక రకమైన సామాజిక భద్రత పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. వివిధ కార్మిక చట్టాల అమలులోని నిబంధనలవల్లనైతేనేమి (అంటే ఏదేని చట్టం కనీసం 20 మంది కార్మికులు ఉంటేనే వర్తించడంవంటివి), ఇతరత్రా అనేక కారణాలవల్ల దేశంలోని మొత్తం 47.41 కోట్ల కార్మికులలో 82.7 శాతంగానున్న అసంఘటితరంగ కార్మికులలో కేవలం ఎనిమిది శాతం మందికి మాత్రమే ఈ ప్రయోజనం అందుతున్నది. ఇప్పుడు కేంద్రం ప్రవేశపెడుతున్న ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది చట్టరూపం ధరిస్తే, ఎటువంటి తారతమ్యాలూ లేకుండా కార్మికులందరికీ, ఒక్క కార్మికుడున్నాసరే, ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలనందించవలసి ఉంటుంది. ఇళ్ళలో పనిచేసేవారికీ, వ్యవసాయ కార్మికులకూ కూడ ఈ నిబంధన వర్తిస్తుంది. స్వయం ఉపాధి పొందిన వారు తదితర వర్గాలవారికి కూడ ఈ సౌకర్యాన్ని వర్తింపచేయడానికి కేంద్రం ఒక నిధిని ఏర్పాటుచేస్తుంది. ఈ నిబంధనను అమలుచేయనివారిపై చట్టపరమైన చర్యలుంటాయి. ■

Publishing date 1 April 2017, Posting on 3 - 4 April 2017
Yojana (Telugu) April 2017 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17


सत्यमेव जयते

# భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ

ఆధార్
నా ఆధార్, నా గుర్తింపు

## ఆధార్ వివరాలలో సవరణలు / మార్పులు చేసుకునే సౌలభ్యం

## ఆధార్‌లో వివరాలు 3 విధములుగా అప్‌డేట్ చేసుకోవచ్చు



ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా
www.resident.uidai.net.in



సాధారణ పోస్ట్ ద్వారా



ఆధార్ కేంద్రాన్ని
లేదా పి.ఇ.సి. సెంటర్
సందర్శించటం ద్వారా

## ఆధార్ కేంద్రాలలో వివిధ ఆధార్ సేవలు

| ఆధార్ కేంద్రాలలో వివిధ ఆధార్ సేవలు | రుసుము |
|---|---|
| ఆధార్ నమోదు | ఉచితము |
| బయోమెట్రిక్ వివరాల మార్పు<br>పిల్లల (5 & 15 సం॥) తప్పనిసరి బయోమెట్రిక్ వివరాల మార్పు | ఉచితము |
| ఇతర బయోమెట్రిక్ వివరాల మార్పు | 25/- |
| డెమోగ్రాఫిక్ వివరాల మార్పు<br>(పేరు, పుట్టిన తేది, చిరునామా, లింగం & ఇ-మెయిల్) | 25/- |
| ఆధార్ స్థితి తెలుసుకొనుటకు — ఈ-ఆధార్ (బ్లాక్ & వైట్) | 10/- |
| ఆధార్ స్థితి తెలుసుకొనుటకు — ఈ-ఆధార్ (కలర్) | 20/- |

## ముఖ్య గమనికలు :

- ఆమోదింపబడిన రుసుము కంటే ఎక్కువ చెల్లించవద్దు
- మొబైల్ అప్‌డేట్ కొరకు ఆధార్ కేంద్రాన్ని మాత్రమే సందర్శించవలెను.

www.uidai.gov.in ఉచిత ఫోన్ నెం : 1947


Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314